
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 4, ఫిబ్రవరి 2024

అటు.. ఇటు.. హీటు

ఓటమి భయంతో పోటీచేసే స్థానాలు మార్చి ఎమ్మెల్యేలను కాపాడుకోవాలని చూస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యూహానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని తాజా పరిస్థితులు అందుకు దర్పణం పడుతున్నాయి. ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తులకు చెక్‌పెట్టే ఉద్దేశంతో వైసీపీ ఎమ్మెల్యేలను సీఎం జగన్ నియోజకవర్గాలు మారుస్తున్న విషయం విదితమే. దీనికితోడు రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు మార్చుకుని మరీ ఎమ్మెల్యేలకు జై కొడుతున్నారు. అందులో భాగంగా పోటీ చేయను మహాప్రభో అన్న రాంబాబును ఒప్పించి మార్కాపురం ఇన్‌చార్జిగా నియమించారు. పోటీ చేయకుండా ఖాళీగా అయినా ఉంటా కానీ గిద్దలూరు వెళ్లకూడదని నిర్ణయించుకున్న నాగార్జునరెడ్డితో సీఎం ప్రత్యేకంగా మాట్లాడి ఒప్పించారు. అయితే రెండుచోట్లా జగన్ వ్యూహాన్ని ఆపార్టీ శ్రేణులే జీర్ణించుకోలేకపోతున్నాయి. కొందరు కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇక వైసీపీతో లాభం లేదని గుడ్‌బై చెబుతుండగా, మరికొందరు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీంతో రెండు చోట్లా వైసీపీ శ్రేణుల్లో శనివారం తీవ్రస్థాయిలో అలజడి ఆరంభమైంది.



మారిస్తే సరిపోతుందా?

మార్కాపురం, గిద్దలూరుల్లో సూటిగా ప్రశ్నిస్తున్న వైసీపీ శ్రేణులు

గిద్దలూరు వద్దేవద్దు

మార్కాపురంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఇంటికి శనివారం ఆయన అనుచరగణం పెద్దసంఖ్యలో తరలివచ్చింది. 'గిద్దలూరులో పరిస్థితులు ఏమీ ఆశాజనకంగా లేవు. ఎమ్మెల్యే రాంబాబుకు మద్దతుగా ఉన్న ఓ సామాజికవర్గం వారు జై జనసేన అని వెళ్లిపోతున్నారు. రెడ్డి సామాజికవర్గం నాయకులంతా ఐక్యంగా నియోజకవర్గేతర నాయకులకు సహకరించబోమని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో మీరు గిద్దలూరుకు వెళ్లడం మాకిష్టం లేదు' అని నాగార్జునరెడ్డికి వారు స్పష్టంగా సూచించారు. అయితే నాగార్జునరెడ్డి 'నాకూ ఇష్టం లేదు. కానీ సీఎం జగన్ ఒకటికి రెండుసార్లు చెప్పారు. ఆయన మాటను గౌరవించి వెళ్లాల్సిందే. అక్కడ ఇబ్బందులు ఉంటాయని కూడా నేను అనుకోవడం లేదు' అని అన్నట్లు తెలిసింది. తదనుగుణంగా మంచిరోజు చూసుకుని గిద్దలూరులో అడుగుపెట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. అయితే ఆ నియోజకవర్గంలోని రాంబాబు అనుచరులుగా ముద్రపడిన పలువురు గత రెండురోజుల నుంచి టీడీపీలో చేరడం ప్రారంభించారు. ప్రజారాజ్యంలో రాంబాబు చేరినప్పటి నుంచి ఆయనతో పయనిస్తున్న కాపు సామాజికవర్గం నాయకులంతా జనసేన పట్ల ఆసక్తితో టీడీపీ నేత అశోక్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటిస్తున్నారు. గిద్దలూరులోని ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన రెండు వార్డులలోని ముఖ్యులంతా అశోక్‌రెడ్డిని కలిసి శుక్రవారం రాత్రికే తమ మద్దతును ప్రకటించేశారు. ఇంకోవైపు రెడ్డి సామాజికవర్గంలో స్థానికులకు అవకాశం ఇస్తామని హామీ ఇచ్చి అధిష్ఠానం మాట తప్పిందని ఆసామాజికవర్గం నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడిన లింగారెడ్డి, ఐవీరెడ్డి తదితరులైతే హైదరాబాద్ వెళ్లి బాలినేనితో మంతనాలు ప్రారంభించారు. మిగిలిన నాయకులు గతంలో చెప్పిన మాట ప్రకారం స్థానికేతర నాయకుడికి సహకరించేది లేదని స్పష్టంగా చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఆయా నియోజకవర్గాల్లో ప్రజావ్యతిరేకత ఉందని భావిస్తున్న ఎమ్మెల్యేలను ఇతర చోట్ల నుంచి రంగంలోకి దింపే ప్రక్రియను వైసీపీ అధిష్ఠానం వేగవంతం చేసింది. జిల్లాలో అందుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. తాజాగా గిద్దలూరు ఎమ్మెల్యేను మార్కాపురం, మార్కాపురం ఎమ్మెల్యేను గిద్దలూరుకు మార్పు చేయగా రెండుచోట్లా వైసీపీ శ్రేణుల నుంచి తీవ్రస్థాయిలో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. పక్కపక్కనే ఉండే గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు రాంబాబు, నాగార్జునరెడ్డిలు నివాసం ఉండేది మార్కాపురంలోనే. రెండు నియోజకవర్గాలకు రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్ డివిజన్, ఇతర ఆయా ముఖ్యశాఖల కార్యాలయాలు ఉండేది మార్కాపురంలోనే. రెండూ కలిసే ఉంటాయి. గిద్దలూరులో ఎమ్మెల్యే రాంబాబుపై వైసీపీలోనే అసమ్మతి పెరిగిపోయింది. ప్రధానంగా అక్కడ రెడ్డి సామాజికవర్గం నాయకులంతా రాంబాబు తమను ఇబ్బందిపెడుతున్నారంటూ నేరుగా సీఎం జగన్‌కే ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ రెడ్డిని అభ్యర్థిగా రంగంలోకి దింపబోతున్నట్లు జగన్ ముందుగానే సంకేతం ఇచ్చారు. కారణం ఏమైనా తర్వాత రాంబాబు వచ్చే ఎన్నికల్లో పోటీచేయనని బహిరంగంగా ప్రకటించారు. పైగా వైసీపీకే చెందిన ఎంపీ మాగుంటపై ఆరోపణలు చేసి వివాదాస్పదుడయ్యారు. అయితే చివరికి అధిష్ఠానం రాంబాబును ఒప్పించి మార్కాపురానికి బదిలీ చేయడంతో ఈ విషయాలన్నీ అక్కడి వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమయ్యాయి. ఇక మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పాలనలో కుటుంబ సభ్యుల పాత్ర పెంచారని, ఆయన సోదరుడు భూకుంభకోణాలతో రెచ్చిపోయాడన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. టీడీపీ నాయకులైతే వారికి మార్కాపురం నయీమ్ అనే బిరుదును ఇచ్చి ఆ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాన్ని పక్కనే ఉన్న గిద్దలూరు వాసులు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారు. పైగా తాను గిద్దలూరు వెళ్లనని నాగార్జునరెడ్డి చెప్పినప్పటికీ జగన్ బలవంతంగా ఒప్పించారు. దీంతో వైసీపీ శ్రేణులు వారికి వ్యతిరేకంగా వ్యాఖ్యానించడం, బదిలీలపై అసంతృప్తి వ్యక్తం చేయడం స్పష్టంగా కనిపించింది.




- ఆ నియోజకవర్గం మనకొద్దు.. వెళ్లొద్దు..!
- ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి అనుచరుల సూచన
- వైసీపీకి గుడ్‌బై అంటున్న గిద్దలూరులోని ఒకవర్గం నాయకులు
- స్థానికులను మోసం చేశారంటూ ఆగ్రహం
- హైదరాబాద్ వెళ్లి బాలినేనిని కలిసిన నేతలు
- పుణ్యక్షేత్రాలకు వెళ్లిన రాంబాబు

బాలినేనితో చెవిరెడ్డి భేటీ

అధిష్ఠానం నిర్ణయంతో అసంతృప్తితో హైదరాబాద్‌లో ఉన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఇటీవల రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కలిశారు. శుక్రవారం రాత్రి ఒకసారి, శనివారం ఉదయం మరోసారి బాలినేనినితో భేటీ అయ్యారు. ఒంగోలులో వివాదంగా మారిన ఫ్లెక్సీల ఏర్పాటు వ్యవహారం తనకు తెలియదని చెవిరెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఒంగోలులో కార్యక్రమం పెట్టేందుకు రమ్మని బాలినేనిని కోరినట్లు సమాచారం. అయితే తనను సీఎం నుంచి అధిష్ఠానంలోని నాయకులు పదేపదే మోసం చేశారని, వారి మోసపు ఎత్తుగడలకు తన రాజకీయాన్ని పణంగా పెట్టలేనని బాలినేని అన్నట్లు తెలిసింది.

మార్కాపురం రాని రాంబాబు

తాడేపల్లిలో సీఎంతో సమావేశం అనంతరం ఎమ్మెల్యే రాంబాబు మార్కాపురం రాకుండా పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. సోమవారం సాయంత్రానికి ఆయన మార్కాపురం చేరే అవకాశం ఉంది. మార్కాపురంలో సీఎం జగన్ ఆశించినట్లు ఆర్యవైశ్యులలో రాంబాబు పట్ల అంతోఇంతో ఆసక్తి కనిపించినప్పటికీ రెడ్డి సామాజికవర్గం నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మార్కాపురం జడ్పీటీసీ సభ్యుడు అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తాను కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తానని బహిరంగంగానే చెబుతున్నారు. దీనికితోడు గిద్దలూరులో రెడ్లను రాం బాబు ఇబ్బందిపెట్టారన్న ప్రచారం వారిలో విస్తృతంగా ప్రారంభమైంది. దీంతో అభ్యర్థులను మార్చినంత మాత్రాన వారిపై వైసీపీ శ్రేణుల్లో ఉన్న అసంతృప్తి అంత సులువుగా తొలగిపోదన్న విషయాన్ని ఆ రెండుచోట్లా నెలకొన్న పరిస్థితులు మరోసారి తేటతెల్లం చేస్తున్నాయి.

భోజనం బాగోలేదంటే దూషించారు..

- కళాశాల భవనం పైనుంచి దూకిన నర్సింగ్ విద్యార్థిని
- తీవ్రగాయాలవడంతో ఆస్పత్రికి తరలింపు
- దరిమడుగులో ఘటన
- సిబ్బంది వేధింపులే కారణమంటున్న తల్లిదండ్రులు

లోపలి పేజీల్లో..


గాయపడిన విద్యార్థిని జానకీబాయ్

39 మంది తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

లోపలి పేజీల్లో..

ముంపు గుబులు

వెలిగొండ నిర్వాసితుల్లో భయాందోళన


- అతీగతీ లేని పునరావాసం, పరిహారం
- నిర్వాసిత కాలనీల్లో అసంపూర్తిగా నిర్మాణాలు
- కొద్దిరోజుల్లో ప్రాజెక్టు ప్రారంభోత్సవం అంటూ హడావుడి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3 : పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పుడు నిద్ర కరువైంది. రెండో టన్నెల్ తవ్వకం పూర్తయ్యిందంటూ ఇటీవల అధికారులు ప్రకటించారు. అయితే సొరంగం లోపల రివెంట్‌మెంట్‌ను పూర్తి చేయలేదు. ఎన్నికల నేపథ్యంలో మరో వారంలో ప్రాజెక్టు ప్రారంభిస్తామని అధికారులు, అధికార పార్టీ నేతలు హడావుడి చేస్తున్నారు. అయితే పునరావాస కాలనీల గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వెలిగొండ ప్రాజెక్టు ముంపుగ్రామాల నిర్వాసితులకు కనీసం పునరావాస కాలనీల్లో నేటికీ పట్టాలు ఇవ్వలేదు. దీంతో వారు ఎక్కడికి పోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ గ్రామాలను వదిలి వెళ్లేందుకు వారు సిద్ధంగా ఉన్నప్పటికీ వీరికి పరిహారం, ఇతర ప్యాకేజీలు సక్రమంగా అందలేదు. తమకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆర్‌ఆర్ ప్యాకేజీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఈ ఏడాది.. వచ్చే ఏడాది అంటూనే ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలం వెళ్లదీసింది. అయితే ఇప్పుడు ప్రాజెక్టు ప్రారంభిస్తామని హడావుడి చేస్తుండటంతో నిర్వాసితుల సమస్య మొదటికి వచ్చింది. దీంతో అధికారులు నిర్వాసితుల జాబితాలను నేడో,రేపో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మరో వారంలో ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని చెబుతున్న అధికారులు, వైసీపీ నేతలు నిర్వాసితులకు ప్రభుత్వం ప్యాకేజీ ఇస్తుందా..? లేదా..? అన్నది ప్రకటించడం లేదు. మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతాండాలకు అదే మండలంలోని వేములకోట ఇలాకాలో కుంట, జమ్మనపల్లి మార్గమధ్యలో 83ఎకరాల భూమిని సేకరించారు. 800 నిర్వాసిత కుటుంబాలకు ఇక్కడ పట్టాలు ఇవ్వాల్సి ఉంది. కాలనీలో మౌలిక వసతులు కూడా కల్పించాల్సి ఉంది. అయితే సదరు కాంట్రాక్టర్ అర్థంతరంగా పనులను నిలిపేశాడు. దీంతో పునరావాసం ప్రహసనంగా మారింది.


కలనూతల పునరావాస కాలనీ పరిస్థితి ఇదీ..

నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు

పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కలనూతల, చింతలముడిపి, కాటమరాజుతాండ, గుండంచర్ల, మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతండా, అర్థవీడు మండలంలోని లక్ష్మీపురం, కృష్ణానగర్, సాయినగర్, రామలింగేశ్వరపురం గ్రామాలను వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలుగా ఉన్నాయి. వీటిలో 4,517 కుటుంబాలను నిర్వాసితులుగా గుర్తించారు. 2019 నాటికి 18ఏళ్లు నిండిన మరో 2,918 మంది యువతీ యువకులను ప్యాకేజీకి అర్హులుగా గుర్తించారు. దీంతో మొత్తం 7,555 మంది నిర్వాసితులకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి తరలించాల్సి ఉంది. అర్థవీడు మండలానికి చెందిన నిర్వాసితులు 96 మందికి మాత్రమే వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా నష్టపరిహారం అందించారు. మిగిలిన ముంపు గ్రామాల్లో ఒక్కరికి కూడా పునరావాసం కల్పించకుండా, నష్టపరిహారం అందించకుండా, ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా ప్రాజెక్టు పూర్తిచేశామమంటూ త్వరలో ప్రారంభమని చెప్పడంపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.


వెలిగొండ ముంపు గ్రామం గొట్టిపడియ వ్యూ

ఆర్‌ఆర్ ప్యాకేజీ ఊసే కరువు

మార్కాపురం మండలం ఇడుపూరు పంచాయతీలో ఇడుపూరు-2 పునరావాస కాలనీ, కలనూతల గ్రామం వారికి కేటాయించారు. కానీ నిర్వాసితుల తుది జాబితా ఇంతవరకు విడుదల చేయలేదు. సుమారు రూ.1000 కోట్ల వరకు నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. కానీ బడ్జెట్లో కేవలం రూ.101 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రారంభం అంటూ హడావుడి చేస్తున్న అధికారులు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ముంపు గ్రామాల నుంచి తమను బలవంతంగా పంపించేస్తారేమోనన్న ఆందోళన నిర్వాసితుల్లో నెలకొంది.




పొగాకు కిలో రూ.289

- కర్ణాటకలో రికార్డు స్థాయి ధర
- ముగింపు దశకు చేరుకున్న వేలం

ఒంగోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పొగాకు మార్కెట్ తుది దశకు చేరుకుంది. మరో పది రోజుల్లో సగం కేంద్రాల్లో వేలం ముగియనుండగా మిగిలినవి కూడా ఆ తర్వాత వారంలో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ దశలో అక్కడ రికార్డు స్థాయిలో ధరలు లభిస్తున్నాయి. శనివారం అక్కడి మార్కెట్లో కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.289 పలికింది. మీడియం గ్రేడ్‌లన్నీ రూ.280పైనే ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో 2023-24 సంవత్సరానికి 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా సుమారు 83 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు అంచనా. ఇప్పటివరకు 72 మిలియన్ కిలోల అమ్మకాలు పూర్తయ్యాయి. సగటున కిలోకు రూ.254 ధర లభించింది. మరో పది మిలియన్ కిలోలకు అటుఇటుగా అక్కడ కొనుగోళ్లు జరగాల్సి ఉంది. రానున్న పక్షం రోజుల్లో మొత్తం వేలం ప్రక్రియ ముగుస్తుంది. ఈ దశలో హాట్‌హాట్‌గా మార్కెట్ నడుస్తోంది. గ్రేడ్ ఏదైనా రేటు ఒకటే అన్న విధంగా సాగుతున్న అక్కడి మార్కెట్లో కనిష్ఠ ధరలు కిలో రూ.260పైనే ఉంటున్నాయి. మీడియం గ్రేడ్, మేలురకం తేడా లేకుండా వాటి ధరలు కిలో రూ.280పైగా ఉంటుండగా గరిష్ఠ ధర శుక్రవారం కిలో రూ.280, శనివారం రూ.289 లభించింది. ముగింపుదశ కావడంతో వ్యాపారులు కూడా పోటీపడి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

ఒంగోలు డీఎస్పీగా కిషోర్‌బాబు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 3 : ఒంగోలు డీఎస్పీగా ఎం.కిషోర్‌బాబు శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన కె.నారాయణస్వామిరెడ్డి బదిలీపై భీమవరం వెళ్లారు. ఆయన స్థానంలో బాధ్యతలు తీసుకున్న కిషోర్‌బాబును పోలీసు సిబ్బంది కలిసి బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కిషోర్‌బాబు ఇప్పటివరకూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేశారు.


డీఎస్పీ కిషోర్‌బాబు


త్రిపురాంతకం కొండపక్కన దున్ని సాగుకు సిద్ధం చేస్తున్న అనాధీన భూమి

భూం ఫట్!

- త్రిపురాంతకంలో రెచ్చిపోతున్న వైసీపీ నేతలు
- 30 ఎకరాలకు పైగా అనాధీన భూమి ఆక్రమణ
- సాగుకు సిద్ధం చేస్తున్నా పట్టించుకోని అధికారులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 3 : వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ఖాళీ భూమి కనిపిస్తే వాలిపోతున్నారు. యథేచ్ఛగా ఆక్రమించి పొలాలుగా మారుస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తిచూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రమైన త్రిపురాంతకంలోని 30 ఎకరాలకుపైగా అనాధీన భూమిపై స్థానిక వైసీపీ నేతలు కొందరు కన్నేశారు. సాగర్ కుడి ప్రధాన కాలువకు పడమర వైపున గణపవరం రెవెన్యూకు ఆనుకుని సర్వే నెంబరు 804, 300లలో ఉన్న భూమిని ఆక్రమించి కొన్ని రోజులుగా చదును చేస్తున్నారు. ప్రస్తుతం ఆక్రమణకు గురైన భూమి సమీపంలోనే ఇటీవల ప్రభుత్వం గ్రామంలోని 12 మంది లబ్ధిదారులకు అసైన్‌మెంటు కమిటీ ఆమోదం ద్వారా 23.46 ఎకరాల పొలాన్ని ఇచ్చింది. దీన్ని ఆసరా చేసుకుని అధికార పార్టీకి చెందిన కొందరు ఆ పక్కనే ఉన్న కొండభూమిని ఆక్రమిస్తున్నారు. యంత్రాల సహాయంతో భూమిని చదునుచేసి, దుక్కి దున్ని పంటల సాగుకు సిద్ధం చేశారు. ప్రస్తుత ఆక్రమిత భూమి విలువ రూ.కోటికిపైన ఉంటుందని అంచనా. కాగా రెవెన్యూ అధికారులు మాత్రం విషయం తెలిసినా ఆక్రమణలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో గ్రామస్థుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై వీఆర్వో శివలింగయ్యను వివరణ కోరగా... ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడతామన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఒంగోలు కలెక్టరేట్‌లో ఎపిక్ కార్డులను పరిశీలిస్తున్న బీఎల్వోలు

జిల్లాకు 1.50లక్షల ఎపిక్ కార్డులు

- తపాలా ద్వారా ఓటర్లకు పంపేందుకు చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నుంచి జిల్లాకు 1.50లక్షల కొత్త ఎపిక్ (ఓటరు ఫొటో గుర్తింపు కార్డు)లు చేరాయి. కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగానికి అవి వచ్చాయి. వాటిని ఓటర్లకు పంపేందుకు శనివారం బూత్ లెవల్ అధికారులు (బీఎల్వో)లు చర్యలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ నుంచే ఓటరుకు పంపేందుకు అడ్రసుతో సహా కవర్లు కూడా వచ్చాయి. ఆ కార్డులను సెల్ లేదా ల్యాప్‌టాప్‌లో స్కాన్ చేస్తున్నారు. అది పూర్తయిన అనంతరం పోస్టాఫీసు ద్వారా ఓటరుకు పంపనున్నారు. ఈ ప్రక్రియను సత్వరం పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

కొన్ని శాఖలకే జీతాలు

మెజారిటీ ప్రభుత్వ ఉద్యోగులకు పడని వైనం

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు పడటం లేదు. రానురాను వారి పరిస్థితి దారుణంగా తయారవుతోంది. 3వతేదీకి కేవలం కొన్నిశాఖల ఉద్యోగులకు మాత్రమే జీతాలు చెల్లించగా, మెజారిటీ శాఖల్లో పనిచేస్తున్న వారికి ఇంకా అందలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 1వతేదీనే ఉద్యోగులు, పెన్షనర్లు తమ వేతనాలు బ్యాంకు అకౌంట్లలో జమ అవుతాయని ఆశించారు. అయితే జగన్ సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటంతో ఉద్యోగులు మండిపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్స్‌తో కలిపి 50 వేలమందికిపైగానే ఉన్నారు. ఇప్పటి వరకు సచివాలయ ఉద్యోగులు, ట్రెజరీ, పోలీస్‌తోపాటు మరో నాలుగైదు శాఖల ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడ్డాయి. ప్రధానంగా ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులే 30వేల మంది వరకు ఉంటారు. ఇతర అన్నిశాఖల్లో కలిపి మరో 20వేల వరకు ఉంటారు. ఉపాధ్యాయులకు గత ఏడెనిమిది నెలల నుంచి ఏతేదీన జీతాలు పడతాయో కూడా తెలియడం లేదు. వారు 1వతేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇలా వైసీపీ పాలనలో ఉద్యోగులు తమ జీతాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.



రైతులకు అండగా ఉంటాం!

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత పథకం ద్వారా ఏటా రూ.20వేలు

వైసీపీ పాలనలో అన్ని విధాలా దగా

ఎమ్మెల్యే స్వామి



పాకలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఫిబ్రవరి 3 : రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. వైసీపీ పాలనలో అన్నదాతలను అన్ని విధాలా దగా చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధోగతిపాలైన రాష్ట్రం తిరిగి అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. శనివారం పాకలలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో స్వామి పాల్గొని మాట్లాడారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలలో భాగంగా అధికారంలోకి రాగానే అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామన్నారు. దీనిని కౌలురౌతులకు కూడా వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులకు జింక్, బోరాన్, మినరల్ మిక్చర్. పశుగ్రాసాన్ని సబ్సిడీపై అందించామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆర్బాటానికే ఆర్బీకేలను ఏర్పాటు చేశారని విమర్శించారు. వాటి ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు అందడం లేదన్నారు. నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు పంటనష్టాన్ని అందించడంలో కూడా జగన్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా వారి ఉసురు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిపై ముందుచూపులేని మూర్ఖపు జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల వారూ ఇక్కట్లు పడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం ఇంటింటికీ తిరిగి భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నేతలు నేతలు చీమకుర్తి కృష్ణ, షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, చంటి, మించల బ్రహ్మయ్య, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కన్నా ప్రసాద్, యస్థాని, సనావుల్లా, గౌస్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక

టీడీపీకి బలహీన వర్గాల ప్రజలే వెన్నెముకని అని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. వారికి రాజకీయ ప్రాధాన్యతను ఇచ్చి ఎన్టీఆర్ గుర్తింపు తీసుకొస్తే ఆ ఒరవడిని చంద్రబాబు కొనసాగించారన్నారు. స్థానిక కందుకూరు రోడ్డు కూడలిలో శుక్రవారం రాత్రి నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో స్వామి పాల్గొని మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల్లో టీడీపీ 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, వైసీపీ ప్రభుత్వం వచ్చాక 24 శాతానికి కుదించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ ద్వారా పెద్దఎత్తున సబ్సిడీ రుణాలను అందజేశామని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేశారని స్వామి ధ్వజమెత్తారు. వేట నిషేధ సమయంలో రూ.4వేల భృతిని ఇచ్చి మత్స్యకారులను తొలుత ఆదుకున్న ప్రభుత్వం టీడీపీనే అన్నారు. కులవృత్తులు చేసుకొని జీవనం సాగించే బీసీలకు ఆదరణ ద్వారా యంత్రాలను అందిస్తే ఆ పథకానికి మంగళం పాడిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 70 మంది బీసీలను హత్యచేశారని, 2,500 మందిపై దాడులు, 2,600 పైగా అక్రమ కేసుల బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం రాగానే బీసీలకు దన్నుగా రక్షణ చట్టాన్ని అమలుచేస్తామని స్వామి హామీ ఇచ్చారు. వైసీపీ తగ్గించిన 10 శాతం రిజర్వేషన్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో బీసీలు తరలి వచ్చారు. తొలుత స్వామి.. నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక పాకల రోడ్డు నుంచి కందుకూరు రోడ్డు వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

మంత్రి సురేష్‌పై ఫైర్

మంత్రి సురేష్‌పై ఎమ్మెల్యే స్వామి ఫైర్ అయ్యారు. జిల్లాకు మంత్రిగా ఉండి వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి నీరు ఇవ్వనందుకు, మార్కాపురం ప్రత్యేక జిల్లాను సాధించలేనందుకు, ఓట్లేసి గెలిపించిన వైపాలెం నియోజకవర్గ ప్రజలను వదిలివేసి వచ్చినందుకు ఆయన ఒక చెత్తమంత్రి అని విమర్శించారు. కొండపి ఇన్‌చార్జిగా ఆయన వచ్చాక సెమీక్రిస్మస్ వేడుకల నిర్వహణకు పోలీసుల నుంచి, పింఛన్ల పంపిణీ కార్యక్రమాలకు ఎంపీడీవోలు, కార్యదర్శుల నుంచి, స్టడీ మెటీరియల్ పంపిణీకి విద్యాశాఖలో ఓ ఉన్నతాధికారి చేత డబ్బులు ఖర్చు పెట్టించారని ఆరోపించారు. ఎన్నికలకు రెండు నెలలు మాత్రమే సమయం ఉందని, ఈలోపు కొండపి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని చెప్తూ ప్రజలను మోసం చేయలేవని మంత్రినుద్దేశించి అన్నారు. స్థానికంగా మిగిలిపోయిన అభివృద్ధిని పూర్తిచేయాలంటే అందుబాటులో ఉండే తనను గెలిపించాలని స్వామి ప్రజలను కోరారు. ఎన్నికల సమయంలో వచ్చే వలసపక్షులను ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● మంత్రి నాగార్జున



ప్రాజెక్టులోకి చేప పిల్లలను వదులుతున్న మంత్రి నాగార్జున

మద్దిపాడు, ఫిబ్రవరి 3: గుండ్లకమ్మ ప్రాజెక్టులో మత్స్య సంపదను అభివృద్ధి చేసి మత్స్యకారుల జీవనాన్ని మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మెరుగ నాగార్జున పేర్కొన్నారు. శనివారం మత్స్యశాఖ అధికారుల నేతృత్వంలో చేప పిల్లలను గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గుండకమ్మ ప్రాజెక్టులో లైసెన్స్ పొందిన మత్స్యకారులు చేపలను వేట చేసేందుకు వీలుగా ఉందని, తద్వారా వారి జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ వాకా అరుణ, ఎంపీటీసీ కోటిరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, పుల్లారావు, బెజవాడ శ్రీరామమూర్తి, ప్రభాకర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థిక భరోసా : వైఎస్సార్ ఆసరా పథకంతో డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మెరుగ నాగార్జున పేర్కొన్నారు. శనివారం మద్దిపాడులో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏపీఎం బత్తుల నరేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ వసుంధరాదేవి మాట్లాడుతూ వైకేపీ ద్వారా దాదాపు 1142 గ్రూపులకు రూ.10.20కోట్ల ఆసరా చెక్కును అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ, పూనాటి అప్పారావు, బాల ఆంజనేయరెడ్డి, నారా సుబ్బారెడ్డి, పల్లకి సత్యనారాయణరెడ్డి, డాక్టర్ నట్టే సంజీవరావు పాల్గొన్నారు.

వైసీపీ కార్యక్రమంలా ఆసరా సంబరాలు

పార్టీ నాయకులంతా వేదికపైనే.. ● మంత్రి మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన డ్వాక్రా మహిళలు



ఆసరా చెక్కు పంపిణీ సభలో మాట్లాడుతున్న మంత్రి సురేష్, వేదికపై అధికారులు, వైసీపీ నాయకులు



మంత్రి మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న డ్వాక్రా మహిళలు

టంగుటూరు, ఫిబ్రవరి 3 : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధ్యక్షతన శనివారం టంగుటూరులో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాలు పార్టీ కార్యక్రమంలా జరిగాయి. సభ నిర్వహణబాధ్యతల్లో అధికారులున్నా సమస్తం వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే సాగింది. నిబంధనల ప్రకారం అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే వేదికపై కూర్చోవాల్సి ఉండగా అధికార పార్టీ మండల నాయకులంతా ఆశీనులయ్యారు. సభలో హడావుడంతా వారిదే. షెడ్యూల్‌ప్రకారం మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం దాదాపు రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. మంత్రి మాట్లాడుతుండగానే సభకు హాజరైన డ్వాక్రా మహిళలు వెనుదిరిగి వెళ్లడం కనిపించింది. వైకేపీ అధికారులు మహిళలను సమీకరించినా వారిని సభ పూర్తయ్యేవరకు ఉంచలేకపోయారు. సభా వేదిక పక్కనే అధికారపార్టీ చోటామోటా నాయకులు కొందరు వెళ్తున్న మహిళలను ఆపమని వైకేపీ సిబ్బందిని ఆదేశించడం వినిపించింది. దీంతో వారు మహిళలను ఆపేందుకు తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు. మాకు పనులున్నాయ్ అని చెప్పి మహిళలు వెళ్లిపోతూనే ఉన్నారు. పరిస్థితిని గమనించిన సభా నిర్వాహకులు వేదికపై ఒకరిద్దరికి మించి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. వారి తర్వాత వెంటనే మంత్రి ప్రసంగించారు. జగన్ మహిళా పక్షపాతి అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఆయన్ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం డ్వాక్రా మహిళలకు 4వ విడత ఆసరా కింద రూ.11,51,93,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, ఎంపీడీవో నారాయణరావు, డీపీఎం సనీత, ఏపీవో సుభాషిణి, ఏపీఎం హనుమంతురావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

సింగరాయకొండ: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సురేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొదుపు సంఘాల సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, ఎంపీపీ కట్టా శోభారాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎంపీడీవో టి.నగేష్‌కుమారి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: జిల్లాలో మార్చి1నుంచి 20వతేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధితశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాటాడారు. ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలన్నారు. జిల్లాలో 69 పరీక్షాకేంద్రాల్లో 44,733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 21,570 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 23,163 మంది ఉన్నారని ఆయన తెలిపారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో సిటింగ్, లైటింగ్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరీక్షలు జరిగే రోజున ఫ్లయింగ్ స్క్వాడ్ చురుకుగా పనిచేయడంతో పాటు కేంద్రాల్లో సీసీకెమెరాల నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సుల ఏర్పాటుతో పాటు విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ఆర్‌ఐవో సైమన్‌విక్టర్, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఆర్ఎం సుధాకర్, ఆర్టీసి, ట్రెజరీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో వైసీపీ పెద్దలకు ఇళ్ల పట్టాలు

జనసేన పార్టీ సమన్వయకర్త మనోజ్‌కుమార్ ఆరోపణ



ధర్నాలో పాల్గొన్న నాయకులు, ఇళ్ల స్థలాల బాధితులు

టంగుటూరు, ఫిబ్రవరి 3 : టంగుటూరులోని జగనన్న లేఅవుట్ కాలనీల్లో అధికార వైసీపీకి చెందిన పెద్ద నాయకులు, ఆపార్టీ ప్రజాప్రతినిధులకు ఇళ్ల పట్టాలున్నాయని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ ఆరోపించారు. ఇళ్ల పట్టాల్లో గోల్‌మాల్‌పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ జనసేన ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెండో రోజైన శనివారం కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, స్థానిక శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గొల్లపూడి సునీత, గ్రామ సచివాలయ కన్వీనర్లు సోమేపల్లి మురళి, పులిచర్ల కోటయ్యతోపాటు మరికొందరు వైసీపీ నాయకుల పేరున జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలున్నాయన్నారు. వీరంతా నిరుపేదలా! గ్రామంలో వీరికంటే పేదలు లేరా అని ప్రశ్నించారు. అలాగే నకిలీ పట్టాలు అనేకం చలామణిలో ఉన్నాయన్నారు. వాటిలో నకిలీ స్టాంప్‌లు, ఫోర్జరీ సంతకాలున్నాయని చెప్పారు. సోమేపల్లి కల్పన, షేక్ హమీదా, షేక్ హుస్సేన్‌బీ తదితరులకు స్వయంగా తహసీల్దార్ కార్యాలయంలోని కిందిస్థాయి ఉద్యోగులు నకిలీ పట్టాలిచ్చి వీరి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఇళ్ల స్థలాల్లో అక్రమాలన్నీ వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే జరిగాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను గుర్తించే వరకు జనసేన ఆందోళన కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన నిందితులను శిక్షించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ రమణయ్యను దారుణంగా హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ ఎస్.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. రమణయ్య హత్యను నిరసిస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కృష్ణమోహన్ మాట్లాడుతూ కార్యాలయంలో విధులు ముగించుకొని వస్తున్న తహసీల్దార్ రమణయ్యను దుండగులు దారుణంగా కొట్టి చంపడాన్ని ఖండించారు నిందితులను అరెస్టు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. ఆదివారం విజయవాడలో అసోసియేషన్ అత్యవసర సమావేశం ఉందని, రమణయ్య హత్యపై చర్చించి తదుపరి కార్యచరణ ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసులు, కోశాధికారి జె.దానియేలు, వెంకటేశ్వరరాజు, కాశయ్య, కోమటిగుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు



పార్టీలో చేరిన వారితో రియాజ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : సింగరాయకొండ మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు కండువాలు వేసి ఆయన సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్‌డీ.ఖాజా యూసఫ్, మూలగుంటపాడు 9వ వార్డు మెంబర తస్లీమ్, షేక్ కరీంబాషా, పి.మల్లికార్జున, షేక్ ఖాజావలి, రాజా రామచంద్ర, యుగంధర్, షేక్ రసూల్, రజియాతో పాటు పలువురు చేరారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీలో చేరిన నాయకులకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయ నిర్వహణలో భాగస్వాములు కావాలి

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 3: గ్రంథాలయం అందరిదని, అందువల్ల దాని నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పిలుపునిచ్చారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రతినెల మొదటి శనివారం జరిగే మనం-మన గ్రంథాలయం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా గ్రంథాలయంలోని పత్రిక విభాగం, పుస్తక విభాగం, రెఫరెన్స్ విభాగం, కంప్యూటర్ విభాగం, పుస్తకాలు, ర్యాకులను శుభ్రం చేసి అమర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, డి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డును ప్రారంభించిన మాగుంట



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : ఒంగోలునగర పాలక సంస్థ పరిధిలోని కొత్తపట్నం రోడ్డులో ఉన్న ముస్లిం బరియల్‌గ్రౌండ్స్‌లో ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముస్లింలు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొని రాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ మాబు, వైసీపీ నాయకుడు పసుపులేటి శ్రీనివాసరావు, షేక్ అన్వర్, అమీద్ తదితరులు పాల్గొన్నారు. కాగా నగరంలో బీసీభవన్‌కు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని సీఈ సంఘం నాయకులు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో గోలి తిరుపతిరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా స్కూలులో సదస్సు



చిన్నారులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 3: ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో విద్యార్థులతో తల్లిదండ్రులు, పెద్దల పట్ల కృతజ్ఞతా భావం అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. విద్యార్థులను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల చిన్నతనంలోనే అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాధుని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జీవీ.భాస్కర్, ఎం.మహేష్, శశిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

29లోపు సమావేశాలు నిర్వహించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2 : ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టంపై జిల్లాలోని వివిధ వర్తక సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సహాయ కార్మిక కమిషనర్లు, సహాయక కార్మిక అధికారులను కోరారు. ఆయా దుకాణాలు, సంస్థలు విధిగా నమోదు/నవీకరణ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చట్టం కింది ప్రతి దుకాణంలో, సంస్థల్లో కార్మికులు ఉన్నా, లేకపోయినా, సొంత వ్యాపార దుకాణాలు, సంస్థలు విధిగా ఈ లైసెన్స్ ద్వారా కానీ, సమీపంలోని సచివాలయం, మీసేవా కేంద్రాల ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

అద్వానీకి భారతరత్న ప్రకటనపై హర్షం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి కోసం కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి అద్వానీ అని కొనియాడారు. అటువంటి వ్యక్తికి భారతరత్న పురస్కారం ప్రకటించడం అభినందనీయమని తెలిపారు.

ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్‌గా బీటీనాయక్

ఒంగోలు(క్రైం) ఫిబ్రవరి 3: ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్‌గా బీటీనాయక్ శనివారం ఒంగోలులోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అక్కడ పనిచేస్తున్న అజయ్ కుమార్‌ను వీఆర్‌లో ఉంచారు. కాగా బీటీనాయక్ జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోను, జిల్లాలో పలు సర్కిల్‌ళ్లలో విధులు నిర్వర్తించారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి : సీఐ

చీమకుర్తి, ఫిబ్రవరి3: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించటానికి అందరూ సహకరించాలని చీమకుర్తి అర్బన్ సీఐ ఒ.దుర్గాప్రసాద్ కోరారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పర్యవేక్షణకు తాము పెద్దపీట వేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానాన్ని అమలు చేస్తామని, శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై కఠిన చర్యలను చట్టప్రకారం తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. రెగ్యులర్‌గా నైట్‌బీట్‌లు, పట్టణంలో ఇరవైనాలుగు గంటలపాటు నిఘా ఉంటుందని, శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులకు మీడియా నుంచి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందెం వేస్తున్న ముగ్గురు అరెస్టు

టంగుటూరు, ఫిబ్రవరి 3: పసుకుదురులోని కోడిపందెం స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.17,200నగదును స్వాధీనం చేసుకున్నట్లు టంగుటూరు ఎస్సై తెలిపారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం



నాయకులతో మాట్లాడుతున్న జయంత్‌బాబు

మద్దిపాడు ఫిబ్రవరి 3: బీసీల అభ్యున్నతి టీడీపీతో సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. శనివారం మన ఊరు-మన తెలుగుదేశం కార్యాక్రమాన్ని సీతారాంపురం కొష్టాల్ వద్ద సర్పంచ్ మండవ శివానందరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జయంత్‌బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు మంజూరుచేస్తుందని ప్రతి ఒక్కరికి నివేశన స్థలాలు అందజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. వైసీపీ అరాచకాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఇసుక, గ్రావెల్ తవ్వుకొని జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని అయన కోరారు. కార్యక్రమంలో మండవ గోపీనాథ్, మారెళ్ల హరికుమార్, కోమటినేని ప్రసాద్, మండవ కోటేశ్వరరావు, పాటిబండ్ల అజయ్‌బాబు, దేవబత్తిన ప్రసాదరావు, రెబ్బవరపు ప్రభాకరరావు, అద్దేపల్లి దుర్గాభవానీ, వేల్పుల నాగరాజు, బాపట్ల వెంకటేశ్వర్లు, ఎర్రగడ్డ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నగర అధ్యక్షుడిగా మరోసారి 'కొరారి'

● ప్రధాన కార్యదర్శిగా బొల్లినేని వాసుకృష్ణ



కొరారి నాగేశ్వరరావు



బొల్లినేని వాసుకృష్ణ

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 3 : తెలుగుదేశం పార్టీ ఒంగోలు నగర కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ శనివారం ప్రకటించారు. స్థానిక 12వ డివిజన్‌కు చెందిన కొరారి నాగేశ్వరరావు మరోసారి నగర అధ్యక్షులుగా నియమితులయ్యారు. అలాగే ప్రధానకార్యదర్శిగా కమ్మపాలెంకు చెందిన బొల్లినేని వాసుకృష్ణ, కోశాధికారిగా పల్లపోతు దుర్గాప్రసాద్‌ను నియమించారు. వీరితోపాటు ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, సెక్రటరీలు, అధికార ప్రతినిధులుతో 28 మంది సభ్యులతో నరగ కమిటీని నియమించారు. ఇప్పటి వరకు నగర అధ్యక్షులుగా పనిచేసిన కొరారి నాగేశ్వరరావు, విద్యార్థి దశ నుంచి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా నగర అధ్యక్షులుగా పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ కోసం మరింతగా కష్టపడి పనిచేశారు. అంతే కాకుండా వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలపై నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు, రాస్తారోకోలు చేపట్టారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బొల్లినేని వాసుకృష్ణ పార్టీలో చురుకైన వ్యక్తిగా పనిచేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతు రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాగేశ్వరరావును అభినందించారు.

పేదల ఇళ్ల స్థలాల

పంపిణీ ప్రక్రియ వేగవంతం : కలెక్టర్



మ్యాప్‌ను పరిశీలించి సూచనలు ఇస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 3: ఒంగోలు నగరపరిధిలోని 25వేలమందికి ఇళ్ళ పట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఎస్.అగ్రహారం. చినమల్లేశ్వరకాలనీ, వెంగముక్కలపాలెంలోని పట్టాల కోసం సేకరించిన పొలాలను కలెక్టర్ పరిశీలించారు. ఇందుకు సంబంధించిన పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒంగోలు అర్బన్ పరిధిలో 25వేల మందికి ఇళ్ళ పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాల మేరకు వేగవంతం చేసినట్లు తెలిపారు. అందుకోసం 520 ఎకరాలను గుర్తించామని, వీటిలో ఇప్పటికే 435 ఎకరాలకు భూ సేకరణ జరిగిందన్నారు. యిందుకు సంబంధించి రైతుల ఖాతాల్లో సుమారు రూ.166 కోట్లు నగదు జమ చేసినట్లు తెలిపారు. ఈ భూమిలో జంగిల్ క్లియరెన్స్, అప్రోచ్ రోడ్‌లు, డ్రైనేజి వ్యవస్థ, లేఅవుట్ పనులు త్వరితగతిన జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈనెల 15వ తేదిలోపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పేదలకు ఇళ్ళస్థలాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, నగర కమిషనరు ఎం.జశ్వంత్‌రావు, తహసీల్దార్ మురళీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ మధుసూదనరావుకు సత్కారం



మధుసూదనరావు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

చీమకుర్తి, ఫిబ్రవరి 3 : ఎన్నికల బదిలీలలో భాగంగా చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన పిన్నిక మధుసూదనరావుకు ఘన సత్కారం నిర్వహించారు. శనివారం చీమకుర్తిలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, పట్టణవాసులు మధుసూదనరావు దంపతులను సత్కరించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ ఇన్నాళ్లు తనకు సహకరించిన ఉద్యోగులకు, మండలవాసులకు ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించటంలో తాను శక్తివంచన లేకుండా కృషి చేయటం తనకు ఎంతో సంతృప్తిని అందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన



పోస్టుకార్డులను చూపుతున్న విద్యార్థులు

చీమకుర్తి, ఫిబ్రవరి 3: పోస్టల్‌శాఖ అందిస్తున్న వివిధ రకాల సేవలపై చీమకుర్తి పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. పోస్ట్‌మాస్టర్ కె.రామారావు ఆధ్వర్యంలో ఈ అవగాహన తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది వాసుబాబు, మస్తాన్‌వలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి అదనపు బాధ్యతలు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 3: ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్‌నాయక్‌కు బీసీ కార్పొరేషన్ ఈడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ పనిచేసిన ఎం.వెంకటేశ్వరరావు బదిలీ కావటంతో ఈ బాధ్యతలను అర్జున్‌నాయక్‌కు అప్పగిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

14న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

కంభం, ఫిబ్రవరి 3 : కంభం మండలం రావిపాడు గ్రామంలోని పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 14న బుధవారం రెండు పళ్లలోపు విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలిచిన వారికి వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలు బహుమతులుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేవారు ఈ నెల 14వ తేది ఉదయం 6 గంటలోపు రూ.500, ప్రవేశ రుసుం చెల్లించాలని, పూర్తి వివరాలకు 7288098380 సెల్ నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

అధిష్ఠానం ఆదేశిస్తే బాపట్ల నుంచి పోటీచేస్తా!

● కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

పంగులూరు, ఫిబ్రవరి 3: పార్టీ అధినాయకత్వం అంగీకరిస్తే బాపట్ల పార్లమెంటరీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తానని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. వ్యక్తిగత పనిపై శనివారం పంగులూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. రెండుసార్లు రాజ్య సభ సభ్యుడిగా పనిచేసిన సమయంలో అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వందల సంఖ్యలో సామాజిక భవనాలు, స్వచ్ఛమైన తాగు నీరందించే ఆర్వో ప్లాంట్లు నిర్మించి గ్రామ పంచాయతీలకు అప్పగించినట్లు చెప్పారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, ఎస్సీ, ఎస్టీలకు ప్రయోజనం చేకూర్చే 26 పథకాలను జగన్మోహనరెడ్డి రద్దు చేశారని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, ఫిబ్రవరి 3: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి తాళ్ళూరు మండలం తురకపాలెంకు చెందిన పి.అంజిరెడ్డి, కలమాల కుటుంబసభ్యులు రూ.1,01,116 శనివారం ఈవో సుభద్రకు అందజేశారు. కార్యక్రమలో సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

బ్యారన్‌లకు భారీ డిమాండ్ !

1200 పొగాకు కర్రల క్యూరింగ్‌కు రూ.50వేలు వసూలు ● అయినా దొరకని వైనం ● రైతుల ఇబ్బందులు



పొగాకు అల్లుతున్న కూలీలు



బ్యారన్‌లోకి ఎక్కిస్తున్న అల్లిన పొగాకు కర్రలు

కొండపి, ఫిబ్రవరి 3 : పొగాకు బ్యారన్‌లకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. ఆకు క్యూరింగ్ చేయడానికి బ్యారన్‌లు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పొగాకు పక్వానికి వస్తుండటంతో ఆకు రెల్చి, క్యూరింగ్ చేయడానికి ఖాళీ బ్యారన్‌ల కోసం తిరుగుతున్నారు. క్యూరింగ్, పొగాకు అమ్ముకోవడానికి ఏటా రూ.70వేలు ఉండే బ్యారన్ లీజు ఈ సీజన్‌లో దాదాపు రూ.1.70లక్షలు ధర పలికింది. ఆధర చూసి రైతులు ఆశ్చర్యపోయారు. అయితే సకాలంలో వర్షాలు లేకపోవడంతో పొగాకు క్యూరింగ్‌కు పెద్దగా డిమాండ్ ఉండదేమో అని ఆరంభంలో భావించారు. ప్రస్తుతం ఆకు కొట్టుడు ముమ్మరం కాగా దిగుబడి తక్కువగా వస్తోంది. అయితే వాతావరణంలో మార్పుల కారణంగా పొగాకు పక్వానికి వస్తుండటంతో వెంటనే క్యూరింగ్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పుడు ఒకసారి పొగాకు అల్లిన 1200 కర్రలు (ఒక కొట్టు) క్యూరింగ్ చేసుకోవడానికి దాదాపు రూ.50 వేలు ఇస్తామన్నా ఖాళీ బ్యారన్‌లు చిక్కడం లేదు. దాదాపు అన్ని బ్యారన్‌లను గతేడాదే రైతులు ముందస్తుగా లీజుకు తీసుకున్నారు. అతి తక్కువ గ్రామాల్లో మాత్రమే ఖాళీ బ్యారన్‌లు ఉన్నాయి. పూర్తిగా పాడుబడిన బ్యారన్‌లను ప్రస్తుత డిమాండ్ వల్ల బాగు చేస్తున్నారు. గడచిన పది రోజులుగా బ్యారన్‌లలో పొగాకు క్యూరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. పూర్తిగా పొగాకు కర్ర అల్లుకుని రైతులు తెచ్చుకుంటే బ్యారన్‌లోకి ఎక్కించడానికి, కట్టెలు బ్యారన్ ఓనరే పెట్టుకుని, క్యూరింగ్ అయ్యాక పొగాకు కర్రను బ్యారన్‌లలో నుంచి వెలుపలకు తీసి ఇవ్వడానికి వెయ్యి కర్రలకు రూ.65వేలు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు తెలిపారు. వెన్నూరు, కట్టావారిపాలెం, ముప్పవరం గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగిన దృష్ట్యా పొగాకు చేలో ఎండిపోతున్నదని, అందువల్ల ఎవరికి వారే ఒకటి, రెండు దఫాలు ఎంత ధరైనా చెల్లించి పొగాకు క్యూరింగ్ చేసుకోవడానికి యత్నాలు చేస్తున్నారని రైతులు తెలిపారు. సహజంగా ఏటా ముందుగా రైతులు పది కొట్లు (దఫాలు) పొగాకు క్యూరింగ్ చేసుకోవడానికి నాట్లకు ముందే బ్యారన్‌లను రైతులు తీసుకుంటారు. ఈ సీజన్‌లో పది కొట్ల క్యూరింగ్‌కు రూ.80వేలు, లైసెన్స్‌కు (పొగాకు అమ్ముకునేందుకు) సంబంధించి రూ.90వేలు లీజు పలికింది. ప్రస్తుతం ఒక కొట్టు క్యూరింగ్‌కు రూ.50వేలు ఖర్చు చేయాల్సి రావడం, అంతమొత్తం చెల్లించినా బ్యారన్‌లు దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ సర్వనాశనం

» నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం
» ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు దగా డీఎస్సీ
» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 3: డీఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసి తీరా ఎన్నికల సమయం వచ్చేసరికి ఇప్పుడు ప్రకటిస్తుందని చెప్పారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50,896 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు మెగా డీఎస్సీ అని చెప్పి ఐదేళ్ళు తాడేపల్లి ప్యాలెస్‌లో నిద్రపోయి, ఎన్నికలకు ముందు 6,100 పోస్టులకు అనుమతి ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ సర్వనాశనం అయ్యిందన్నారు. సీఎం సభ కోసం ఇంటర్మీడియట్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా వాయిదా వేశారన్నారు. ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం సభకు విద్యార్థులను పెద్దఎత్తున తరలించేందుకు విద్యాలయాలకు సెలవు ప్రకటించారన్నారు. కళాశాల యాజమాన్యాలను అధికారులతో బెదిరించి బస్సులను బలవంతంగా తీసుకోవటం హేయమైన చర్య అని అన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా యువత పనిచేయాలని రవికుమార్ పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడ్డా దాని మూలాలు రాష్ట్రంలోనే ఉండటం జగన్‌రెడ్డి అరాచకపాలనకు నిదర్శనమని విమర్శించారు. గంజాయి రవాణా వైసీపీ నేతలు, అధికారుల కనుసన్నలలో జరుగుతుందన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రం పెట్టుబడులకు హబ్ గా ప్రథమస్థానంలో ఉంటే, వైసీపీ పాలనలో గంజాయి రవాణాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం రావాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు.

అక్రమ కేసులు పెట్టినా అదరం బెదరం

● ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఊరుకోం
● టీడీపీ నేతల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మార్టూరు, ఫిబ్రవరి 3: అక్రమంగా కేసులు పెట్టినా భయపడేది లేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. అక్రమ దందా చేస్తూ మార్టూరులోని కష్టాన్ని రోజూ కరెన్సీ రూపంలో ఎత్తుకుపోతున్నా కళ్లు మూసుకున్న నాయకులు కళ్లు తెరవాలన్నారు. ప్రశాంతతకు మారుపేరైన పర్చూరు నియోజ కవర్గంలో అలజడి సృష్టించి, అభివృద్ధికి మార్గదర్శకుడైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై దుష్ప్రచారం చేసే వారిపై తీవ్ర పరిణామాలు ఉంటాయని టీడీపీ మండల నాయకులు హెచ్చరించారు. గతనెల 30న మార్టూరులో టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్‌లో జరిగిన గొడవలో నెల్లూరు విజిలెన్స్ అధికారి బాలాజీ నాయక్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు అరెస్టు చేసిన ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులకు శనివారం ఒంగోలు జైలు నుంచి బెయిల్‌పై విడుదలై వచ్చారు. ఈ సందర్భంగా మార్టూరులోని టీడీపీ కార్యాలయంలో బెయిల్‌పై వచ్చిన నాయకులతో పాటు మండలంలోని నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. న్యాయం గెలిచిందని, టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కేవలం టీడీపీకి చెందిన గ్రానైట్ పరిశ్రమలలో అధికారులు తనిఖీలు చేయడం ఎంతవరకు సబబని అడిగిన పరిశ్రమల యజమానులపై అధికారుల చేత అధికారపార్టీ వారు అక్రమంగా కేసులు పెట్టించడం నీచ సంప్రదాయమన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తుందని చెప్పారు. సదరు వైసీపీ నాయకుడు మార్టూరు గ్రామంలో ఒక్క అభివృద్ధి పని చేశారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును విమర్శించే అర్హత ఎవరి కీ లేదన్నారు. ఎంతో మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమలకు అధికారులు ప్రయివేటు వ్యక్తులతో ముఖ్యంగా వైసీపీకి చెందిన వ్యక్తితో మారణాయుధాలుతో తనిఖీలకు రావడం కక్షపూరిత చర్య కాదా అని ప్రశ్నించారు. అదేమిటని అడిగినందుకు, ప్రజాప్రతినిధిగా అక్కడకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూరిపై అక్రమంగా కేసులు పెట్టడం రాజకీయ ప్రతీకారచర్య కాదా అని ప్రశ్నించారు. తాము పెట్టిన కేసును ఇంతవరకు పోలీసులు నమోదు చేయడానికి కారణం అధికార పార్టీ ఒత్తిడులు కాదా అని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రౌడీ రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరన్నారు. ప్రజానీకం తిరుగుబాటు చేసే సమయం ఆసన్నమయిందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, అడుసు మల్లి వెంకట శ్రీనివాసరావు, తొండెపు ఆదినారాయణ, మక్కెన శేఖర్‌బాబు, శివ, దాసం అశోక్ కుమార్, జంపని శ్రీనివాసరావు, రావినేని శ్రీనివాసులు, ఉప్పటూరి రమాదేవి, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో ఆమంచికి షాక్..!

» వెంకటేష్‌కు ముఖ్య అనుచరుల మద్దతు



వెంకటేష్‌తో ఆమంచి ముఖ్యఅనుచరులు

చీరాల, ఫిబ్రవరి 3: చీరాల నియోజకవర్గంలో రాజకీయ సమీరణాలు మారుతున్నాయి. ఆమంచి కృష్ణమోహన్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగే కొందరు శుక్రవారం రాత్రి ఒంగోలులో వైసీపీ నియోకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ను కలిశారు. వచ్చే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో తనకు మద్దతుగా పనిచేస్తామని చెప్తూ బొకే అందజేశారు. ఆమంచికి అత్యంత ఆంతరంగికులుగా గుర్తింపు పొందిన పైడి రాజేష్, గరికపాటి సుధీర్, కౌన్సిలర్ సల్లూరి సత్యానందం తదితరులు మద్దతు తెలపటం ప్రస్తుతం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈక్రమంలో భవిష్యత్ రాజకీయంపై ఈ కలయిక ఎలా ఉంటుందనే విషయంలో రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధిలో ముందుండి పనిచేయండి : మున్సిపల్ పరిధిలో ఎవరికి ఏ అవసరం వచ్చినా అభివృద్ధిలో ముందుండి పనిచేయాలని కమిషనర్ విజయసారథికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. చీరాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయసారథి ముందుగా స్థానిక అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పురప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచే యాలని చెప్పారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: ఎన్నికల నేపథ్యంలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రకాశం జిల్లాకు వచ్చిన 39మది తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాలకు నియమించిన తహసీల్దార్ల వివరాలు ఇలా ఉన్నాయి.. పశుమర్తి హేమంత్‌కుమార్(వెలిగండ్ల), పి.అనురాధ(దోర్నాల), టి.శ్రీనివాసులు(పుల్లలచెరువు), బి.రామకృష్ణ శివప్రసాద్(త్రిపురాంతకం), బి.సోమ్లానాయక్(వైపాలెం), షేక్ మహ్మద్‌హుస్సేన్(తాళ్ళూరు), ఏవీ.సుధాకర్(కురిచేడు), జె.మధుబాబు(ముండ్లమూరు), కె.సుజాత(దొనకొండ), జి.సుజాత(చీమకుర్తి), ఎం.భవానీశంకర్(మద్దిపాడు), ఎం.సుజన్‌కుమార్(నాగులుప్పలపాడు), ఎస్‌కే.మీరావళి(సంతనూతలపాడు), జి.సిద్దార్థ్(ఒంగోలుఅర్బన్), ఎస్.సురేష్(కొత్తపట్నం), బి.కిరణ్‌కుమార్(కొండపి), కేవీబీటీ.సుందరమ్మ(మర్రిపూడి), బి.పద్మావతి(దర్శి), ఎస్.రామయ్య(సింగరాయకొండ), ఎ.పద్మావతి(పిసిపల్లి), ఎస్.చంద్రశేఖర్(కొమరోలు), ఎం.పద్మజ(కేకేమిట్ల), జి.రమేష్‌కుమార్(మార్కాపురం), ఎండీ.జియాఉక్బిన్(పొదిలి), ఎస్‌కే.అబ్దుల్‌అహ్మద్(తర్లుబాడు), జె.ప్రసాదరావు(అర్థవీడు), వైవీబీ.కుటుంబరావు(కంభం), డి.పద్మనాభం(గిద్దలూరు), వి.లావణ్య(బేస్తవారపేట), టి.మస్తాన్(రాచర్ల), ఎంవీకే.సుధాకరరావు(సిఎస్‌పురం), ఆర్.యశోద(హనుమంతునిపాడు), కేఎస్.చక్రవర్తి(జరుగుమల్లి), శేఖర్ పాసా(పామూరు), ఎ.సురేష్(కనిగిరి), బీఆర్ఎల్‌వీ.ప్రసాద్(కలెక్టరేట్, ల్యాండ్-2 సూపరింటెండెంట్), కేవీఈ.ప్రసాద్(ఆర్డీవో ఆఫీసు డీఏవో, కనిగిరి), సీహెచ్.కృష్ణారావు(ఆర్డీవో ఆఫీసు ఒంగోలు డీఏవో, ఎ.వేణుగోపాలరావు(సబ్ కలెక్టర్ ఆఫీస్, డీఏవో, మార్కాపురం)లను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

న్యాయవాది మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 3: చీరాలలో ఓ న్యాయవాది శనివారం మృతి చెందాడు. పట్టణానికి చెందిన చెన్నుపాటి నాగేశ్వరరావు(60)కు భార్య కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. వయోభారంతో ఆయన తల్లి రమాదేవి గతనెల 23న మృతిచెందడంతో ఇరువురు సోదరులతో కలిసి సంబంధిత ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే బంధువుల సౌకర్యార్థం రామాపురంలో కూడా రూములు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా శనివారం తెల్లవారు జామున ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగేశ్వరరావు రామాపురం సముద్రతీరంలో విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్సై, జనార్దన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. గుండె పోటుతో మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు.

మోటార్‌సైక్లిస్టుకు తీవ్రగాయాలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 3: తిమ్మనపాలెం వద్ద డివైడర్‌ను ఢీకొని మోటర్ సైకిలిస్ట్‌కు తీవ్రగాయాలయ్యాయి. శనివారం మద్దిపాడు మండలం ఏడుగుళ్లపాడు నుంచి పి.గుడిపాడు వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో గాలి సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సురేష్‌ను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం : ఆర్డీవో

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 3: రాబోవు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు ఆర్డీవో విశ్వేశ్వరరావు తెలిపారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో శనివారం వివిధర రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన తరువాత రాజకీయపార్టీల నాయకులు కోడ్ నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కావాల్సిన మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఓట్ల దరఖాస్తుల పరిశీలిన పూర్తిచేసి ఈనెల 8వతేదీన ముసాయిదా ఓటరు జాబితాలను విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.మురళి, కొత్తపట్నం డీటీ అర్జున్‌రెడ్డి, రాజకీయ నాయకులు క్రాంతికుమార్, కటారి సంజీవ్, ఎస్‌కే.రసూల్, బి.రాజశేఖర్, గుర్రం సత్యం, రమేష్, స్వరూప్, కట్టా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

6న మార్కాపురంలో ఉపకరణాల పంపిణీ

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 3: మార్కాపురంలో దివ్యాంగులకు, వయోవృద్ధులకు ఈ నెల 6వ తేదీన ఉచితంగా ఉప కరణాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020 సంవత్స రంలో అలింకో సంస్థ ఉపకరణాల పంపిణీ కోసం మార్కాపురం, ఎర్రగొండపాలెంలో ప్రత్యేక శిబిరాల నిర్వహించి లబ్ధిదారులను గుర్తించిందన్నారు. ఈ శిబిరానికి హాజరైన వారికి మార్కాపురంలో ఉచితంగా ఉపకరణాల ను పంపిణీ చేస్తారని, కనుక నాడు నిర్వహించిన శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్న రశీదు, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, యూడీఐ కార్డు, 3 ఫొటోలు తీసుకుని ఉదయం 9 గంటలకు స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయానికి రావాలని ఆమె కోరారు.

మరోసారి మోసగించేందుకే 'వైసీపీ సిద్ధం'

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నారాయణరెడ్డి
- ముగిసిన చలో వెలిగొండ పాదయాత్ర
- ఇమ్మిడి కాశీనాథ్‌ను అభినందించిన నేతలు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వైసీపీ సిద్ధం అయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి విమర్శించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ నిర్వహించిన 'ఛలో వెలిగొండప్రాజెక్ట్' పాద యాత్ర ముగింపు సభకు నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్దారవీడు మండలం సుంకేసుల డ్యామ్ వద్ద శనివారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు 'సిద్ధం' పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రజలను భ్రమల్లో పెట్టి, రాజకీయ వైషమ్యాలు రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రాంతంలో వైసీపీ నేతలను నిల దీయాలని పిలుపునిచ్చారు. వెలిగొండ కోసం మార్కాపురం జిల్లా కోసం మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టిన ఇమ్మడి కాశీనాథ్‌ను పలువురు అభినందించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంపై వైసీపీ నాయకులు అసత్యాలు చెబుతున్నారన్నారు. నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకుండా వారికి ప్యాకేజీ ఇవ్వకుండా ప్రాజెక్టును ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయకుండా వైసీపీ ప్రభుత్వం పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేసిందన్నారు. వెనుకబడ్డ మార్కాపురం మరింత కరువుప్రాతంగా త య హా ర్చై ం ద న్నా ర ు. కార్యక్రమంలో వైపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, సీపీఎం, సీపీఐ, ఆప్ పార్టీల నేతలు డి.సోమయ్య, అందే నాసరయ్య, సుదర్శన్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన-టీడీపీ నాయకులు గిద్దలూరు జనసేన ఇంచార్జ్ బెల్లంకొండ సాయిబాబు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, కనిగిరి జనసేన నాయకులు రహంతుల్లా, పెద్దారవీడు మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, గొట్టం శ్రీనివాస్ రెడ్డి, మౌలాలి, వక్కలగడ్డ మల్లికార్జున, శాసనాల వీరబ్రహ్మం, గుమ్మ గంగరాజు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇమ్మిడి కాశీనాథ్



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్ : రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దనాగులరం, నికరంపల్లి, చింతగుంట్ల, తిప్పాయపాలెం, బొడిచెర్ల వేములకోట గ్రామాల్లో బూత్ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జవాజి రామానుజులరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, పార్టీ నాయకులు జెంకె రమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటికి భారీగా చేరిన వైసీపీ శ్రేణులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3: స్థానిక ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఇంటి వద్దకు నియోజకవర్గంలోని వైసీపీ శ్రేణులు శనివారం భారీగా హాజరై మంతనాలు చేశారు. గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిని అధిష్ఠానం నియమించిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యేతో వైసీపీ శ్రేణులు చర్చించాయి. ఆ విషయంపై ఎమ్మెల్యేను పునరాలోచన చేయాలని వైసీపీ శ్రేణులు కోరుతున్నట్లు తెలిసింది. అధిష్ఠాన నిర్ణయాన్ని ఎవరైనా శిరసా వహించాల్సిందేనని కార్యకర్తలకు ఎమ్మెల్యే సున్నితంగా వివరిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కంభం సీఐ కూడా ఎమ్మెల్యే ఇంటి వద్దకు వచ్చి మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు. మరో రెండురోజుల తర్వాత గిద్దలూరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

బీజేపీతోనే సుపరిపాలన

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 3: బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆరె రమణయ్య అన్నారు. స్థానిక శివసదన్‌లో బీజేపీ విజయ సంకల్ప యాత్రను ఆ పార్టీ యువ మోర్చా కొస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ పార్టీలు స్వలాభం కోసం పనిచేస్తాయని, బీజేపీ ప్రజల కోసం పని చేస్తుందన్నారు. ఈ యాత్ర దోర్నాల మండలం నుండి ఎర్రగొండపాలెం మీదుగా త్రిపురాంతకం, పెద్దారవీడు మండలాల నుంచి దోర్నాలకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరరాఘవరెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, అంకన్న, మండ్ల కాశి నాయుడు, బాలకాశి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

డివిజనల్ స్థాయి పాటల పోటీలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 3: త్రివిక్రమ అభ్యుదయ కళాసంఘం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్న సంఘ కార్యదర్శి చిత్తారి రంగనాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9505808242, 9440844985 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులలో అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శీనారెడ్డి హెచ్చరించారు. మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మండలంలో అన్ని గ్రామాలలో జరిగిన పనుల పైన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో జరిగిన పనుల వివరాలను సభలో తనిఖీ బృందం ప్రతినిధులు వివరించారు. వీటిలో అవకతవకలు జరిగిన పనులను గుర్తించి అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో 2022, 2023 ఆర్థిక సంవత్సరంలో 915 జాబ్ కార్డులకు గాను 90408021 పనిదినాలలో రూ.2,33,09,739 విలువైన పనులు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచా యతీల వారీగా భూపతిపల్లి 55439, కొండేపల్లి 46331, మాల్యవంతునిపాడు 49143, గొట్టిపడియ 127878, ఇడుపూరు 481588, నికరంపల్లి 53066, బొందలపాడు 1,36,854, గజ్జలకొండ 5,32,273, రామచంద్రపురం 297955, కోలభీమునిపాడు 143113, నాయుడుపల్లి 195915, రాయవరం 335520, చింతగుంట 9888, కె.కొత్తపల్లి 7766, తిప్పాయపాలెం 235999, జమ్మనలపల్లి 68145, పి.నాగులవరం 113792, పి.యాచవరం, బోడ పాడు 1987, గోగులదిన్నె 207665, వేములకోట 4727 రూపాయల అవకతవకలు జరిగినట్లుగా డీఆర్‌పీలు సభలో చదివి వినిపించారు. సంబంధిత సిబ్బందిపైన విచారణ జరిపి రికవరీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పోరెడ్డి అరుణ, ఎంపీడీవో తోట చందన, ఒంగోలు విజిలెన్స్ ఆఫీసర్ ఝాన్సీరాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎన్‌ఆర్‌పీ సుబ్బారావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

కంభం చెరువును అభివృద్ధి చేయాలి

జేసీకి బీజేపీ నాయకుల వినతి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3: కంభం చెరువును అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు కంభం చెరువును అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అబద్దాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. చెరువును ఆదాయ వనరుగా ఉపయోగించుకుంటూ జేసీబీలు, ట్రాక్టర్లతో మట్టిని అమ్ముకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం చేతకాకపోతే ప్రతిపాదనలు సిద్ధం చేస్తే కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు శ్రీధర్, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జ్ పీవీ కృష్ణారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

విచారణ చేయాలని వినతి

గిద్దలూరు, ఫిబ్రవరి 3 : మండలంలోని అంబవరం గ్రామంలోని కొన్ని పొలాలు డిలీషియన్ జాబితాలో ఉండగా దీనిపై ఉన్నతాధికారులు విచారిస్తున్నారని, రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యదర్శి పిడతల రమేష్‌రెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షులు బొంతల క్రిష్ణ, మార్కాపురం శాఖ కన్వీనర్ క్రిష్ణారావులు పేర్కొన్నారు. అయితే ఉన్నతాధికారుల విచారణ పూర్తికాక ముందే ఆన్‌లైన్ చేసిన గత తహసీల్దార్‌పై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

తిమ్మాపురం గ్రామానికి నీళ్లివ్వండి మహా ప్రభు

పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్సీల నిరసన

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 3: 'తిమ్మాపురం గ్రామానికి నీళ్లివ్వండీ మహా ప్రభూ' అంటూ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్సీలు డప్పులు కొడుతూ శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నెల రోజులకు పైగా నీళ్ల లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎస్సీ కాలనీలో గుక్కెడు నీరు లభించక శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై బైఠాయించి డప్పులు కొడుతూ నిరసన వెలిబుచ్చారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నెలల తరబడి నీళ్ల లేక ఇక్కట్లు పడుతున్నామని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నీటి కోసం వ్యవసాయ పొలాల వద్ద తెచ్చుకునేందుకు వెళితే అక్కడ కూడా నీళ్ల రాక ప్రైవేటు వ్యక్తులకు చెందిన ఆర్‌వో ప్లాంటు వద్ద శుద్ధి చేయగా మిగిలిన నీటితో కాలం గడుపుతున్నామన్నారు. పంచాయతీ అధికారులకు సర్పంచికి ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో రోడ్డెక్కాల్సి వచ్చిందని వాపోయారు. నీళ్లివ్వాలని నినాదాలు చేశారు. స్పందించిన గ్రామ కార్యదర్శి మోహన్‌రావు ట్యాంకర్లు నిలిపి వేశారని అయినా మధ్యాహ్నం పంపిస్తామని చెప్పి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీవాసులు

అదుపుతప్పి వంతెనను ఢీకొన్న వాహనం

- ఇరువురు మృతి
- నలుగురికి గాయాలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 3 : నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి టాటా ఏస్ వాహనం అదుపుతప్పి వంతెనను ఢీ కొట్టింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. నంద్యాల నుంచి టాటాఏస్ వాహనం బియ్యం లోడుతో వస్తోంది. దిగువమెట్టకు సమీపంలో వాహనం అదుపుతప్పి వంతెనను ఢీ కొట్టింది. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరు మృతి చెందగా ఒకరిని ఆసుల శ్రీనివాసులు (55)గా గుర్తించారు. మరో మృతి చెందిన వ్యక్తిని పోలీసులు గుర్తించేందుకు ఆరా తీస్తున్నారు. ఈప్రమాదంలో మామిళ్ల రమణయ్య, గువ్వల రాము, బొగ్గరపు చంద్ర శేఖర్ ఉన్నారు. మరో వ్యక్తిని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు అర్బన్ సీఐ వీర సోమయ్య ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి క్షత గాత్రులను పరిశీలించి ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.





వివరాలు తెలుసుకుంటున్న సీఐ వీరసోమయ్య, మృతిచెందిన వ్యక్తి

సబ్‌జైలులో న్యాయాధికారి తనిఖీ

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 3 : పట్టణంలోని సబ్‌జైలును శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఒంగోలు సీనియర్‌సివిల్ న్యాయాధికారి కె.శ్యాంబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో ఉంటున్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న భోజనం, వసతి, విశ్రాంతి గదులను క్షుణ్ణంగా పరిశీలించి జైలు అధికారులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఖైదీల పట్ల అంకితభావంతో ఉండాలని అన్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయనవెంట జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, పారా లీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 3 : గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వారితో ఆదివారం గిద్దలూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. హైదరాబాద్‌లోని రామంతపూర్‌లోని యాదవ కళ్యాణ మండపంలో ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశంలో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటున్న నియోజకవర్గానికి చెందిన అనేక మంది సమావేశంలో పాల్గొని రానున్న ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విజ్ఞప్తి చేయనున్నారు.

తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రకాశం జిల్లాకు వచ్చిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. మండలాలకు నియమించిన తహసీల్దార్ల వివరాలు ఇలా ఉన్నాయి.. పశుమర్తి హేమంత్‌కుమార్(వెలిగండ్ల), పి.అనురాధ(దోర్నాల), టి.శ్రీనివాసులు(పుల్లలచెరువు), బి.రామకృష్ణ శివప్రసాద్(త్రిపురాంతకం), బి.సోమ్లానాయక్(వైపాలెం), షేక్ మహ్మద్‌హుస్సేన్(తాళ్లూరు), ఏపీ.సుధాకర్(కురిచేడు), జె.మధుబాబు(ముండ్లమూరు), కె.సుజాత(దొనకొండ), జి.సుజాత(చీమకుర్తి), ఎం.భవానీశంకర్(మద్దిపాడు), ఎం.సుజన్‌కుమార్ (నాగులుప్పలపాడు), ఎస్‌కే.మీరావలి(సంతనూతలపాడు), జి.సిద్దార్థ్(ఒంగోలు అర్బన్), ఎస్.సురేష్(కొత్తపట్నం), బి.కిరణ్‌కుమార్(కొండపి), కేవీబీటీ. సుందరమ్మ (మర్రిపూడి), బి.పద్మావతి(దర్శి), ఎస్.రామయ్య(సింగరాయకొండ), ఎ.పద్మావతి (పీసీపల్లి), ఎస్.చంద్రశేఖర్(కొమరోలు), ఎం.పద్మజ(కేకేమిట్ల), జి.రమేష్‌కుమార్ (మార్కాపురం), ఎండీ.జియాఉద్దీన్(పొదిలి), ఎస్‌కే.అబ్దుల్‌అహ్మద్(తర్లుబాడు), జె.ప్రసాదరావు(అర్ధవీడు), వైవీబీ.కుటుంబరావు(కంభం), డి.పద్మనాభం(గిద్దలూరు), వి.లావణ్య(బేస్తవారపేట), టి.మస్తాన్(రాచర్ల), ఎంవీకే.సుధాకరరావు(సీఎస్ పురం), ఆర్.యశోద(హనుమంతునిపాడు), కేఎస్.చక్రవర్తి(జరుగుమల్లి), శేఖర్ పాషా(పామూరు), ఎ.సురేష్(కనిగిరి), బీఆర్ఎల్‌వీ.ప్రసాద్(కలెక్టరేట్, ల్యాండ్-2 సూపరింటెండెంట్), కేవీఈ.ప్రసాద్(ఆర్డీవో ఆఫీసు డీఏవో, కనిగిరి), సీహెచ్. కృష్ణారావు(ఆర్డీవో ఆఫీసు ఒంగోలు డీఏవో, ఎ.వేణుగోపాలరావు(సబ్ కలెక్టర్ ఆఫీస్, డీఏవో, మార్కాపురం)లను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

అవీ..ఇవీ..

పొలాలకు రహదారులను ఏర్పాటు చేయాలి

బేస్తవారపేట, ఫిబ్రవరి 3: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు వెళ్లే రహదారులు ఏర్పాటు చేయాలని ఎంపీపీ వేగనాటి ఓసూరారెడ్డి అన్నారు. అందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ పథకాలు పక్కదారి పట్టిస్తున్నారని, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వెంటనే కేంద్రాలలో జరుగుతున్న అక్రమాలను అడ్డుకట్ట వేయాలని కోరారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తట్టుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అందుకోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్లకు నీటి సరఫరా కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఏఈని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బండ్లమూడి వెంకటరాజయ్య, ఎంపీడీవో టి.పార్వతి, డిప్యూటీ తహశీల్దార్ జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

రేపు జాబ్‌మేళా

గిద్దలూరు, ఫిబ్రవరి 3 : పట్టణంలోని సాయిచైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 5న సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రంగస్వామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో మొబైల్, ఏసీ తయారు చేసే యూనిట్లలో ఉద్యోగం చేసేందుకు వీలుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమోలలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

గిద్దలూరు, ఫిబ్రవరి 3 : పట్టణంలోని రాచర్ల రోడ్డులోని 10వ సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టిక తీసి మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జాప్యం లేకుండా ప్రజలకు చేర్చాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో గౌరవంగా, చిరునవ్వుతో సంభాషించి వారి సమస్యల వెనుక ఉన్న బాధను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నెలాఖరులోపు లైసెన్సు ఫీజు చెల్లించాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 3 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దుకాణాల, వ్యాపార సముదాయాలు, అన్నిరకాల వ్యాపార సంస్థలకు నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్సు ఫీజు రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయాలలోని శానిటరి సెక్రటరీలను సంప్రదించి ఫీజు చెల్లించి రసీదు పొందాలన్నారు. ఈ నెల 28వ తేది తరువాత ఫీజు చెల్లిస్తే 25శాతం అపరాధం చెల్లించాల్సి వస్తోందన్నారు.

మెయిన్ డ్రాకు ఎంపిక

గిద్దలూరు, ఫిబ్రవరి 3 : విశాఖ పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ర్యాంకింగ్ టోర్నమెంటులో గిద్దలూరుకు చెందిన కంచర్ల కోటయ్యగౌడ్ మెయిన్ డ్రాకు ఎంపికయ్యారు. 65 ఏళ్ల గ్రూపులో హైదరాబాద్ క్రీడాకారుడు సామ్యూల్‌ను 9-2 స్కోరుతో మరో క్రీడాకారుడు రవికుమార్‌ను 9-5 స్కోరు తేడాతో కోటయ్యగౌడ్ ఓడించి మెయిన్ డ్రాకు ఎంపికయ్యారు.

14న రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలు

కంభం, ఫిబ్రవరి 3 : కంభం మండలం రావిపాడు గ్రామంలోని పోలేరమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 14న బుధవారం రెండు పళ్లలోపు విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గెలిచిన వారికి వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలు బహుమతులుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేవారు ఈ నెల 14వ తేది ఉదయం 6 గంటలోపు రూ.500, ప్రవేశ రుసుము చెల్లించాలని, వివరాలకు 7288098380 సంప్రదించాలని అన్నారు.

ఎన్‌ఎస్ అగ్రికల్చర్, హార్టీ కల్చర్ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 3: ఎన్‌ఎస్ అగ్రికల్చర్, హార్టీకల్చర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, డీన్ డా.ఆర్‌వీకేఎస్.రెడ్డి శనివారం మాట్లాడారు. విద్యార్థినులు యోగిత, దేవదివ్యని గోపిక, చందన, పూజితారెడ్డి, మాధురి, స్వప్న, జాహ్నవి, లక్ష్మీప్రసన్నలు వాలీబాల్ పోటీలలో 3వ స్థానాన్ని పొందారన్నారు. వీరిని పీడీ మహేష్ అభినందించారు.



బహుమతులు పొందిన విద్యార్థినులు

నేడు నాల్గొవ విడత ఆసరా

పెద్దదోర్నాల ఫిబ్రవరి 3 : స్థానిక శివసదన్‌లో నాల్గవ విడత ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం దర్శనం పోలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి చంద్రశేఖర్ హాజరవుతారని ఆయన చెప్పారు.

సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న మెప్మా ఆర్‌పీలు

గిద్దలూరు, ఫిబ్రవరి 3 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెప్మా ఆర్‌పీలు సిటి మేనేజర్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మెప్మా ఆర్‌పీల సంఘం అధ్యక్షురాలు జి.పద్మ, కార్యదర్శి పి.సాయిలక్ష్మి మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్స్ అందరికీ హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. బకాయిలను చెల్లించాలని, 15 సంఘాలలోపు ఉన్న ఆర్‌పీలకు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొదుపు సంఘాలకు 5లక్షల వరకు వడ్డీ రాయితీ ఇవ్వాలని, రూ.20లక్షల వరకు 0 వడ్డీ రాయితీ కొనసాగించాలని, ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెప్మా ఆర్‌పీల సంఘం ప్రతినిధులు ఫాతిమా, రూతమ్మ, గౌసియా, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 3: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా సూత్రాలు పాటించాలని రవాణాశాఖ అధికారి అమర్‌నాయక్ అన్నారు. జాతీయ రహదారి మాసోత్సవాలు పురస్కరించుకుని రవాణా శాఖ అధ్వర్యంలో శనివారం రోడ్డు ప్రమాదాలపై బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక రవాణా శాఖ కార్యాలయం నుంచి పట్టణ వీధులలో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. సెల్ ఫోన్ ఉపయోగిస్తు డ్రైవింగ్ చేయటం నేరమని, అతి వేగం ప్రమాదకరం అన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బడుగు, బలహీనవర్గాలే టీడీపీకి కొండంత అండ

కనిగిరి ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి

పామూరు, ఫిబ్రవరి 3 : టీడీపీకి బడుగు, బలహీన వర్గాల ప్రజలే కొండంత అండఅని టీడీపీ కనిగిరి ఇన్‌చార్జి ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని అంకాలమ్మవీధి వడ్డె పాలెం కాలనీకి చెందిన సుమారు 50 కుటుంబాలు శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీ లో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉగ్ర నాయకత్వంపై నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఉగ్ర మాట్లాడుతూ తాను అధికారం ఉన్నా లేకపోయినా నిత్యం అందుబాబులో ఉంటూ ప్రజా సేవా కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు. తన లక్ష్యం వెలుగొండ ప్రాజెక్టు నీటిని మోపాడుకు అనుసంధానం చేయడం, నిమ్జ్ ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, ట్రిపుల్‌ఐటీ నిర్మాణం, నడికుడి రైల్వేలైన్, సమ్మర్‌స్టోరేజ్ లాంటి కార్యక్రమాలు చేపట్టడమేనన్నారు. కాగా టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సూపర్‌సిక్స్ పథకాల వలన చేకూరే లబ్ధి గురించి వివరించారు.


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన పామూరు వడ్డెపాలెం వాసులు

ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీజి దశరథరామయ్య, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎం.గంగరాజు యాదవ్, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, వై.ప్రసాద్‌రెడ్డి, ఆర్‌ఆర్.రఫి, షేక్ ఖాజారహంతుల్లా బత్తుల సత్యం, నాగేశ్వరరావు, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, ఇర్రి కోటిరెడ్డి,షేక్ గౌసబాష, ఎస్‌సాంబయ్య, దైండే శివశంకర్, దొరబాబు, డోలా శేషాద్రి, సయ్యద్ ఖాదర్‌బాష, జనసేన నాయకులు వై. రహీముల్లా, దరిశి ఏడుకొండలు, వడ్డెపాలెం కాలనీ వాసులు పాల్గొన్నారు.

మాలకొండలో ఉగ్ర దంపతుల పూజలు


మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఉగ్ర దంపతులు

కనిగిరి, పామూరు, ఫిబ్రవరి 3: మాలకొండ శ్రీలక్ష్మీనరసింహసామిని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు. ఉగ్రనరసింహారెడ్డి తన సతీమణి కవితతో కలసి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ ఉగ్ర దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించగా, తన కుమార్తె ఊహశ్రీ చేతులమీదుగా అమ్మవారికి చీర, సారె అందజేశారు. వేదమంత్రాల నడుమ ఆలయంలో అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి, గణపతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పామూరు టీడీపీ నేత, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు ఉగ్రను కలిసి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ ఎంపీటీసీ ఇర్రికోటిరెడ్డి, డోలా శేషాద్రి, గోళ్ల వీరబాబు, పోకా వినోద్‌లు ఉన్నారు.

కనిగిరి ప్రాంతంలో దొంగనోట్ల ముఠా కలకలం

- యథేచ్ఛగా మార్పిడి
- లోతైన విచారణ చేపట్టిన పోలీసులు

కనిగిరి, ఫిబ్రవరి 3: కనిగిరి ప్రాంతంలో నకిలీ నోట్ల మార్పిడి కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం హనుమంతునిపాడు మండలంలోని వేములపాడు అడ్డరోడ్డు వద్ద నకిలీ నోట్లు మార్పిడి చేస్తుండగా స్థానికులు గుర్తించటంతో ఆయా వ్యక్తి కారులో ఉడాయించాడు. ఈ విషయాన్ని పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నకిలీనోట్లు మార్పిడి చేసిన వ్యక్తికి చెందిన మూలాలను అన్వేషిస్తున్నారు. కనిగిరి మండలంలోని చాకిరాల గ్రామానికి చెందిన ఆ వ్యక్తి నకిలీ నోట్లు మార్పిడి ముఠాకు నాయకుడిగా పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న వ్యక్తి నేర చరిత్రను పరిగణనలోనికి తీసుకున్న పోలీసులు ఆ వ్యక్తి జీవనశైలిపై అతని కుటుంబ సభ్యులు, బంధువులు నుంచి ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కనిగిరి ప్రాంతంలో దిగిన నకిలీ నోట్ల ముఠా ఏప ప్రాంతాల్లో తిరుగుతున్నారో పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. నకిలీ నోట్ల మార్పిడికి మూల కారకుడైన చాకిరాల గ్రామ వాసి కోసం గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారణ చేస్తున్నట్లు సమాచారం.


దొంగనోట్ల మార్పిడి సమయంలో గ్రామస్థులు ప్రశ్నించడంతో కారులో ఉడాయిస్తున్న వ్యక్తి

మిర్చి రైతుకు నష్టాల ఘాటు

- తెగుళ్లతో తగ్గిన దిగుబడులు
- అవి కొనేవారు లేక అవస్థలు

కంభం, ఫిబ్రవరి 3 : మిర్చి రైతులకు ఈ ఏడాది కూడా కలిసి రాలేదు. ప్రకృతి ఒడిదుడుకులను ఎదుర్కొని పంటలను సాగు చేస్తున్నా,, నీటిఎద్దడి, తెగుళ్ల బెడద రైతులను కుంగదీసింది. ఈ ఏడాది మిర్చి పూతదశలో ఉన్న సమయంలో వర్షాలు కురవడంతో పంటకు తెగుళ్ల సోకి పంటంతా తాలుగాయలొచ్చాయి. వచ్చిన పంటనైనా అమ్ముకుని పెట్టుబడులైనా రాబట్టుకుందామనుకుంటే తాలుకాయలను కొనేవారు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక విలవిలలాడుతున్నారు.


తెగులు సోకడంతో తాలుగా మారి సన్నబడిన మిర్చి

పూతదశలో వర్షం - నష్టాల్లో రైతులు

కంభం సబ్ డివిజన్‌లోని కంభం, అర్ధవీడు, బేస్తవారపేట మండలాల్లోని సూరేపల్లి, కందులాపురం, జంగంగుంట్ల, లింగోజీపల్లి, తురిమెళ్ల, యర్రబాలెం, లింగాపురం, నాగులవరం, మాగుటూరు, రంగాపురం, యాచవరం, చీమలేటిపల్లి, కొత్తూరు, అక్కపల్లి, కొత్తపేట, బసినేపల్లి, గలిజేరుగుళ్ల గ్రామాల్లో మిర్చి విస్తారంగా సాగయ్యింది. కంభం మండలంలో 560 హెక్టార్లు, అర్ధవీడు మండలంలో 2వేల హెక్టార్లు, బేస్తవారపేట మండలంలో 2500 హెక్టార్లలో మిర్చిని సాగు చేశారు. ఈ ఏడాది పూత బాగా వచ్చినదశలో వర్షాలు పడి పూత రాలిపోవడమే కాక తాలుగాయ అధికంగా వచ్చింది. దీనికితోడు తెగుళ్ల బెడద కూడా వెంటాడింది. దీంతో ఏడాది కూడా రైతులకు నష్టాలే మిగలనున్నాయి. గత ఏడాది వర్షాలు కురవక బోర్లన్నీ ఒట్టిపోయి దిగుబడి భారీగా తగ్గి రైతులు నష్టపోయిన సంగతి తెలిసిందే.


కంభం మండలం సైదాపురంలో మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న మహిళ కూలీలు

దిగజారుతున్న ధరలు

ప్రస్తుతం తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గగా, మరోవైపు ధరలు కూడా నేల చూపులు చూస్తున్నాయి. గుంటూరు యార్డులో మిర్చి ధర రోజురోజుకు పతనమౌతోంది. గత ఏడాది తేజ రకం మిర్చి క్వింటా రూ.20వేల ఉండగా ఈ ఏడాది రూ.10వేల కంటే ఎక్కువ పలుకడం లేదు. కోత కూలి ఎకరానికి 60వేలు, దుక్కి దున్నేందుకు 30వేలు, ఎరువులు, పురుగు మందులకు 60వేలు అన్నీ కలిపి ఎకరాకు 1.50లక్షలకు పైగా పెట్టుబడి అవుతోంది.ప్రస్తుతం వర్షం కురవడంతో దిగుబడి ఎకరాకు 12 క్వింటాళ్లకు మించి రాలేదని, అవి కూడా తాలుకాయలే వచ్చాయని రైతులు వాపోతున్నారు.

అధ్వానంగా కౌలు రైతుల స్థితి

అధిక వర్షాలతో పంట తెగుళ్ల బారినపడి దిగుబడి తగ్గింది. దీనికితోడు ధరలు కూడా తగ్గడంతో ఏమి చేయాలో తెలియక కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



తాలుకాయలే వచ్చాయి

నేను 7 ఎకరాల్లో మిర్చి పంట వేశాను. పూతదశలో వర్షాలు పడింది. దీంతో పూతకు, కాయలకు తెగుళ్ల సోకి తాలుకాయలుగా మారాయి. దిగుబడి తగ్గడంతోపాటు ధర కూడా క్షీణించింది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- గోదేశి పిచ్చమ్మ, మహిళ రైతు

భోజనం బాగోలేదంటే దూషించారు

కళాశాల భవనం పైనుంచి దూకిన విద్యార్థిని తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలింపు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3: భోజనం బాగా లేదని చెబితే తననే తిరిగి దూషిస్తున్నారంటూ మనస్తాపం చెంది ఓ నర్సింగ్ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని దరిమడుగులోని ఓ నర్సింగ్ కళాశాలలో శనివారం చోటుచేసుకుంది. ఎర్రగొండపాలెం మండలం పీఆర్‌సీ తండా చెందిన జానకీబాయ్ బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ ఏడాది మే నెలలో దరిమడుగులోని నర్సింగ్ కళాశాలలో చేరారు. వసతిగృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో భోజనం సక్రమంగా లేకపోవడంతో మనస్తాపం చెందారు.

దీనిపై ఫిర్యాదు చేసినా సిబ్బంది తననే దుర్భాషలాడుతున్నారని మరింత ఆవేదన చెందారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో కళాశాల మొదటి ఫ్లోర్ నుంచి కిందకి దూకింది. దీంతో ఆమె తల, వెన్నుముక బాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సిబ్బంది వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం వేధింపులతోనే తాను ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు.


విద్యార్థినిని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తున్న బంధువులు

ఎలుకలు పడిన భోజనం పెట్టారని, ఈ విషయం సిబ్బందికి చెబితే తననే వేధించారని ఆరోపించారు. కళాశాలలో వసతులు కూడా సక్రమంగా లేవన్నారు. దీంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. కళాశాల సిబ్బంది వేధింపులతోనే తమ బిడ్డ ఇలా చేసిందని బాధితురాలి తల్లిదండ్రులు, ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. బాధితురాలిని మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

అధిష్ఠానం ఆదేశిస్తే బాపట్ల నుంచి పోటీచేస్తా!

» కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

పంగులూరు, ఫిబ్రవరి 3: పార్టీ అధినాయకత్వం అంగీకరిస్తే బాపట్ల పార్లమెంటరీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తానని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. వ్యక్తిగత పనిపై శనివారం పంగులూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. రెండుసార్లు రాజ్య సభ సభ్యుడిగా పనిచేసిన సమయంలో అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేప ట్టినట్లు తెలిపారు. వందల సంఖ్యలో సామాజిక భవనాలు, స్వచ్ఛమైన తాగు నీరం దించే ఆర్వో ప్లాంట్లు నిర్మించి గ్రామ పంచాయతీలకు అప్పగించినట్లు చెప్పారు. కష్ట జీవులకు దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కార్పొరేట్ సంస్థల యజమానులకు కట్టబెడుతున్న కేంద్ర పాలకుల విధానాలను తప్పుబట్టారు. రాష్ట్రంలో అరాచక పా లన కొనసాగుతుందని, ఎస్సీ, ఎస్టీ లకు ప్రయోజనం చేకూర్చే 26 పథకాలను రద్దు చేసిన జగన్మోహనరెడ్డి, తానే దళిత, గిరిజనులకు మేలు చేకూర్చుతున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు.


మాట్లాడుతున్న వైసీపీ దర్శి ఇన్‌చార్జి శివప్రసాద్‌రెడ్డి

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

దర్శి, ఫిబ్రవరి 3 :దర్శి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే, దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వారు నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వలు తదితర పనుల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. తూర్పు గంగవరం-తాళ్ళూరు రోడ్డు, కురిచేడు-పొట్లపాడు ఆర్అండ్‌బీ రోడ్డు పనులు వెంటనే ఆరంభించాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సూచించిన పనులకు ప్రాధాన్యత ఇచ్చి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలు, తీగలు మార్చి సక్రమంగా కరెంట్ సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్ధన్‌ఆలీ, ఈఈ శ్రీనివాసరావు, డీఈ రంగారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కృష్ణ, పంచాయతీ రాజ్ డీఈ విఠల్‌రాథోడ్, విద్యుత్‌శాఖ ఈఈ ఎస్‌ఏ కరీమ్, డీఈ కె. పిచ్చయ్య, ఎంపీపీ జి సుధారాణి, ఎంపీడీవో హనుమంతరావు, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వి. వెంకటరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ఎస్సైని సన్మానిస్తున్న ప్రభు ట్రస్టు ప్రతినిధులు

రోడ్డు ప్రమాదాల నివారణకే నో యాక్సిడెంట్ డే

- త్రిపురాంతకం సీఐ సుబ్బారావు

దొనకొండ, ఫిబ్రవరి 3 : రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ప్రధాన లక్ష్యంతో ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు త్రిపురాంతకం సీఐ సుబ్బారావు తెలిపారు. సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం దొనకొండ విచ్చేసి స్థానిక నాల్గురోడ్ల కూడలిలో నో యాక్సిడెంట్ డే కార్యక్రమం నిర్వహించారు. ప్రాణం ఎంత విలువైనదో, ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పలువురు వాహనదారులకు ఆయన క్లుప్తంగా అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్‌కు సంబంధించిన సమాచారం అప్‌డేట్ చేయాలని కస్టమర్ సర్వీర్ అని ఫోన్‌కాల్స్ వస్తే వాటికి రెస్పాన్స్ కావద్దని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ప్రజలను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ సుబ్బారావును, స్థానిక ఎస్సై సంపత్‌కుమార్‌ను ప్రభు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు, పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిదులు శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


తక్కువ ఎత్తులో రక్షణ కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

పామూరు, ఫిబ్రవరి 3 : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎటువంటి రక్షణ వలయం లేకపోవడంతో ప్రమాదం పొంచిఉన్నది. పట్టణంలోని నెల్లూరు రోడ్‌లోని కోట వారి రైస్‌మిల్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. దీనికి తోడు కాకుండా ఫ్యూజు వద్ద తీగలకు తొడిగిన ప్లాస్టిక్ పైపులు పగిలిపోయి ఉన్నాయి. అంతేకాక ఫ్యూజులకు బాక్స్‌లు ఏర్పాటు చేయలేదు.దీంతో అక్కడ ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఫ్యూజుల వద్ద బాక్స్‌లు ఏర్పాటుచేసి రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


పట్టణంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నగర పంచాయితీ చైర్మన్ పిచ్చయ్య

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, ఫిబ్రవరి 3 : దర్శి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. శనివారం ఆయన 12వ వార్డులో పర్యటించి ఆ ప్రాంత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఏపీ నీరు తమకు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని, పైప్‌లైన్‌వేసి నీరు అందించాలని ప్రజలు కోరారు. ఎన్‌ఏపీ పైపులైన్‌ఏర్పాటు కోసం సిబ్బందితో చర్చించారు. పైపులైన్ వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నక్కా రంగా, దినకర్, టీడీపీ నాయకులు సైదారావు, మీరావలి, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు, ఫిబ్రవరి 3 : తాళ్లూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల4వ తేదీ ఉదయం 10గంటలకు ఎంపీపీ తాటికొంగ శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో సమావేశం హాలులో జరుగనున్నట్లు ఎంపీడీవో కె.యుగకీర్తి శనివారం తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని తెలిపారు. మండలస్థాయి అధికారులు తమశాఖలకు చెందిన ప్రగతి నివేదికలను సమావేశానికి తీసుకురావాలన్నారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, ఫిబ్రవరి 3: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి తాళ్ళూరు మండలం తురకపాలెంకు చెందిన పి.అంజిరెడ్డి, కలమాల కుటుంబసభ్యులు రూ.1,01,116 శనివారం ఈవో సుభద్రకు అందజేశారు. సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

దర్శి, ఫిబ్రవరి 3 : కేంద్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదా, విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. రాష్ట్రం అన్నీ రంగాల్లో వెనుకబడి పోతున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొక్కుబడిగా మాత్రమే నిధులు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం దర్శి నియోజకవర్గ నాయకులు సందు వెంకటేశ్వరరావు, టి. రంగారావు, ఈ. నాగేశ్వరరావు, యు. నారాయణ, గోగు వెంకయ్య, డి. రంగనాయకులు, ఇత్తడి జాన్ టి. లక్ష్మీ, ఎస్. రంగమ్మ, పద్మా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలి

పామూరు, ఫిబ్రవరి 3 : పామూరు 4 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్ల ద్వారా త్వరితిగతిన పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శి వి. బ్రహ్మానందరెడ్డి సూచించారు. పట్టణంలో ఐదు వేలకు పైగా ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు చొరవ తీసుకొని పంపిణీ చేయించాలని సూచించారు.

నేడు దద్దాల ఆత్మీయ పరిచయ సమావేశం

పామూరు, ఫిబ్రవరి 3 :స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ ఆత్మీయ పరిచయ సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసీపీ నాయకులు కల్లూరి రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ ఉప కమీషనరు గారి ఆఫీసు, దేవదాయ ధర్మదాయ శాఖ, గుంటూరు
దేవస్థానము పేరు : శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానము
మిట్టపాలెం గ్రామం, కోవిలంపాడు పోస్టు, చంద్రశేఖరపురం(మం), ప్రకాశం జిల్లా
నోటీసు ఇన్.ఆర్.సి.నెం: A5/239/2024 తేది:01-02-2024

పై దేవస్థానము యొక్క ధర్మకర్తల మండలి నియామకము కొరకు ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ప్రకాశం జిల్లా, చంద్రశేఖరపురం మండలం, కోవిలంపాడు పోస్టు, మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానమునకు దేవదాయ ధర్మదాయ శాఖ చట్టము 1987, సవరణ చట్టము 33/2007 మరియు నోటీసు ఇన్ ఆర్.సి.నెం. A5/239/2024 తేది.01-02-2024 ప్రకారము 20 రోజుల అనంతరము శ్రీయుత కమీషనరు వారు ధర్మకర్తల మండలి నియామకము చేసెదరు.

కావున అసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తగా నియామకమునకు నోటిఫికేషన్ ప్రచురించిన తేది.01-02-2024 నుండి 20 రోజులలోపు (20-02-2024లో) దేవదాయ ధర్మదాయ చట్టము 30/1987 నందు 17(3) పరిచ్ఛేదము నందు గల నమూనా ఫారం - II ద్వారా కార్యనిర్వహణాధికారి, శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానము, మిట్టపాలెం గ్రామం, కోవిలంపాడు పోస్టు, చంద్రశేఖరపురం మండలం, ప్రకాశం జిల్లా వారికి తమ దరఖాస్తులను పంపవలయును.

సం/- ఈమని చంద్రశేఖర్‌రెడ్డి, ఉప కమీషనరు
దేవదాయ ధర్మదాయ శాఖ, గుంటూరు






వలంటీర్లను సమన్వయం చేసుకుని ఓటర్లకు తమవైపు తిప్పుకునేందుకు వైసీపీ సమన్వయకర్తలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో సమన్వయకర్తలు వలంటీర్ల సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎన్నికల కార్యక్రమా లకు సం బంధించి వలంటీర్లను ఉపయోగించ రాదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయితే వాటిని పట్టించుకోని వైసీపీ సమన్వయకర్తలు అనధికారికంగా వలంటీర్లను ఉపయోగించి ఓటర్ల సమస్త వివరాలను సేకరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తేనే వలంటీర్లు ఉంటారు లేదంటే ఉద్యోగాలు పోతాయ్ అని చెప్తూ వారిని ఉపయోగించుకుంటున్నారు. ఓటర్ల సమస్త వివరాలను వలంటీర్ల ద్వారా సేకరించి అనుకూలురు ఎవరు.. వ్యతిరేకులు ఎవరు.. తటస్తులు ఎవరు.. ఎవరిని ఎలా లొంగతీసుకోవాలి అని వైసీపీ నేతలు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో వలంటీర్లతో ప్రాంతాల వారీగా సమావేశాలు పెట్టి మరీ వారికి నేతలు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు.



వలంటీర్లతో.. సమన్వయం

- వైసీపీ సమన్వయకర్తలకు ఓట్ల సేవ
- ఓటర్ల సమాచారం కార్యాలయాలకు చేరవేత
- ఎపిక్ నెంబర్లు, పోలింగ్ బూత్, కులం, ఫోన్ నెంబర్ల సేకరణ
- ఎన్నికల్లో తమకు లబ్ధి చేకూర్చేలా వలంటీర్ల ద్వారా ఓటర్లపై ఒత్తిడి

గుంటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందించేందుకు వలంటీర్లు నియమితులయ్యారు. అయితే ఈ వ్యవస్థని వైసీపీ సమన్వయకర్తలు దుర్వినియోగం చేస్తోన్నారు. వలంటీర్ల ద్వారా వచ్చే ఎన్నికల్లో తమకు రాజకీయంగా లబ్ధి చేకూర్చేలా నేతలు ప్రణాళికలు రూపొందించారు. ప్రతి ఇంటితో వలంటీర్లకు నేరుగా సంబంధం ఉన్న ఉంది. వారి క్లస్టర్ పరిధిలో ప్రతీ ఒక్కరి ఆధార్ నెంబర్లు కూడా ఉన్నాయి. వాటి ఆధారంగా చేసుకుని పోలింగ్ బూత్‌ల ఓటర్ జాబితాల్లో ఓటర్లు గుర్తించి వారికి సంబంధించిన సమస్త సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఒక్కో వలంటీర్‌కి సమాచార సేకరణకు సంబంధించి ప్రత్యేక ప్రొఫార్మాను కూడా ఇచ్చారు. వాటిలో డోర్ నెంబరు, ఓటరు పేరు, కులం, ఉపకులం, ఓటరు ఐడీ నెంబరు, పీఎస్ నెంబరు, మొబైల్ నెంబరు, హోదా, ఇతర చిరునామాలో ఉన్న వారి వివరాలను పూర్తి చేయించి ఆ డేటాని తీసుకుం టున్నారు. కొన్ని రోజుల నుంచి వారి క్లస్టర్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డులు డౌన్‌లోడింగ్ చేసుకోమని కోరుతున్నారు. పనిలో పనిగా ఇంట్లో అందరికి ఓట్లు ఉన్నాయా, లేవా ఒకసారి తుది ఓటర్ల జాబితాలో చూసు కోవాలని చెబుతున్నారు. అలా సమాచారాన్ని సేకరించి ఆ వివరాలను వైసీపీ సమన్వయకర్తల కార్యాలయాలకు చేర వేస్తున్నారు. ఈ డేటా ఆధారంగా గుర్తించే తటస్త ఓ టర్లను వారి వైపునకు తిప్పుకు నేందుకు చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. సంక్షేమ పథకాలు ఇస్తామనో, వ్యక్తిగత పనులు చేసి పెడతామనో చెప్పి తమ వైపునకు తిప్పుకోవాలని వైసీపీ నేతలు చూస్తున్నారు. ఇదే సమయంలో ఇంకా ఓటర్ల జాబితాలో క్లెయిమ్‌లు దాఖలు చేసే అవకాశం ఉండటంతో తమకు అనుకూలంగా లేని వారి ఓట్లు తొలగించేందుకు గుట్టు చప్పుడు కాకుండా దరఖాస్తులు పెట్టించే అవకాశం లేకపోలేదు. ఈ విధంగా వలంటీర్లను అడ్డు పెట్టుకుని ఎన్నికల్లో వైసీపీ సమన్వయకర్తలు తొండాట ఆడి గెలుద్దామని ఇప్పటి నుంచే అక్రమమార్గానికి తెర లేపారని పలువురు విమర్శిస్తున్నారు. అయితే దీనికి ఎన్నికల సంఘం ఏ విధంగా చెక్ పెడుతుందో చూడాలి.


వలంటీర్లకు ఇచ్చిన ఫారంలు

తల పట్టుకుంటోన్న వలంటీర్లు..

గుంటూరు: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల పెరుగుతుండటంతో కొందరు వలం టీర్లు తలలు పట్టుకుం టున్నారు. సంక్షేమ పథకా లను అర్హుల కు అందించటంలో వలంటీర్లను నమ్ము కున్న ప్రభుత్వం, వచ్చే ఎన్నికల్లోనూ గెలుపు భారాన్ని కూడా వారిపైనే మోపేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎన్నికల్లో వైసీపీని గెలిపించాల్సిన బాధ్యత మీదే అంటూ బాహాటంగానే ఆదేశాలు జారీ చేస్తున్నారు. మరోసారి అధికారంలోకి వస్తే వలంటీర్ల గౌరవ వేతనాలు పెరుగు తాయని కూడా ఆశచూపుతున్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓడితే మీకే నష్టం.. మీ ఉద్యోగాలు ఊడతాయ్ అని హెచ్చరించి మరీ వారితో రాజకీయ పనులు చేయించు కుంటున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను ఇస్తున్నాం.. ఇవి కొనసాగాలంటే వైసీపీకి ఓటు వేయా లంటూ ఓటర్లకు తెలిజేయాలని వలంటీర్లకు నేతలు ఆదే శాలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేత నం పొందుతున్న వలం టీర్లను పార్టీ కార్యకలాపాలకు వినియోగించటంపై విమ ర్శలు వ్యక్తమవుతున్నా అధికార పార్టీ నేతలు ఖాతరు చేయటం లేదు.



సిబ్బంది అరకొర

- జిల్లా కార్యాలయాల్లో నిష్పత్తి ప్రకారం లేని ఉద్యోగులు
- ఇంకా పరిష్కారం కాని ఉమ్మడి జిల్లాల తకరారు
- ముంచుకొస్తున్న ఎన్నికలు.. అరకొర సిబ్బందితో కష్టమే
- నిధుల విడుదలలోనూ ఎదురుచూపులే

బాపట్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంకో రెండునెలలు దాటితే బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి రెండేళ్ల పూర్తవుతాయి. అయినప్పటికీ ఇంకా బాలారిష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కార్యాలయాల్లో సిబ్బంది ఇప్పటికీ అరకొరగానే ఉన్నారు. సమీపదూరంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో చాలీచాలని సిబ్బందితో ఎలా అని జిల్లా అధికారులు మదనపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జిల్లాలో అత్యంత వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ముఖ్యంగా పర్చూరు నియోజకవర్గం అయితే నిత్యం వార్తల్లో నిలిచింది. దాదాపు రెవెన్యూ సిబ్బంది అంతా ఆ విధుల్లోనే నిమగ్నమైనప్పటికీ తుది ప్రచురణలో కోకొల్లలుగా తప్పులు వెలుగు చూస్తున్నాయి. తొలి నుంచి సిబ్బంది విషయంలో కొరత ఎదుర్కొంటున్నామని, కానీ పరిష్కరించాల్సిన దరఖాస్తులు లక్షల్లో ఉన్నాయనే ఆవేదనను అప్పుడే వారు వెలిబుచ్చారు. జాబితాలో పొరపాట్లు దొర్లడానికి ఇదే ప్రధాన కారణమనే అభిప్రాయం ఇప్పుడు వ్యక్తమవుతోంది.

ఏ కార్యాలయంలోనూ సరిపడా లేరు..

జిల్లా కార్యాలయాల్లో ఏ ఒక్కచోట ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేరు. ఎన్నికల ప్రక్రియలో రెవెన్యూ సిబ్బందితో పాటు నాన్ రెవెన్యూ ఉద్యోగులను సైతం రిజర్వ్ సిబ్బందిగా కేటాయించడమో లేక ఇతరత్రా విధులకు ఉపయోగించుకుంటూ ఉంటారు. జిల్లా కార్యాలయాలన్నింటిలో కలిపి దాదాపు 300 వరకు సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో రెవెన్యూ వాటా వందకు పైన ఉండగా మిగిలిన విభాగాలు అన్నీ కలిపి 200వరకు కొరత ఉండొచ్చని సమాచారం. ఉదాహరణకు జిల్లా మార్కెటింగ్ విభాగంలో దాదాపు పదిమంది సిబంది నియామకం చేపట్టాల్సి ఉండగా, అరకొర సిబ్బందితోనే లాగిస్తున్నారు. అత్యంత కీలక హౌసింగ్ విభాగానిది అదేదారి. ఎన్నికల సమయంలో సిబ్బంది అందరినీ ఏదో ఒక విధులకు కేటాయిస్తున్నారు. రెవెన్యూలో చాలామందిని ఇప్పటికే కలెక్టరేట్ అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో పనులు పడకేస్తున్నాయనే విమర్శఉంది. ఉన్న సిబ్బంది మొత్తం ఎన్నికల విధుల్లోనే నిమగ్నమవడంతో ప్రజల సమస్యలు పూర్వపక్షం అయ్యాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గెజిటెడ్ ర్యాంకు ఆఫీసర్ల అవసరం..

ఎన్నికల విధుల్లో ఎక్కువగా గెజిటెడ్ ఆఫీసర్ల అవసరం ఉంటుంది. మొన్నటి వరకు ఆయా విభాగాలకు సంబంధించి జిల్లాస్థాయి అధికారులుగా నేరుగా ఉంది కేవలం నలుగురు మాత్రమే కావడం గమనార్హం. తాజాగా జరిగిన బదిలీల్లో మరో 5 గురు ఆ స్థాయి అధికారులు వివిధ విభాగాలకు అధిపతులకు జిల్లాకు వచ్చారు. సిబ్బంది వివరాలతో పాటు గెజిటెడ్ అధికారుల సంఖ్య ఇతరత్రా అంశాలతో ఎన్నికల కమిషన్‌కు శనివారం నివేదికను జిల్లా అధికారులు పంపినట్లు సమాచారం.

తొందరగా తేలిస్తేనే...

చాలా విషయాల్లో ఉమ్మడి జిల్లాల తకరారు నడుస్తుండడంతో సిబ్బంది విషయంలో పాటు జిల్లా అధికారుల విషయంలో స్పష్టత రావడం లేదు. ఇప్పటికీ కీలక ఖాతాలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతుండడం విశేషం. వారంలో మూడురోజులు ఎన్నికల సన్నద్ధతలోనే యంత్రాంగం మునిగిపోయి ఉంటుంది. ప్రస్తుతానికి నోటిఫికేషన్ విడుదల కానందున రెవెన్యూ విభాగమే ఎన్నికల సన్నాహక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నోటిఫికేషన్ అంటూ విడుదలయ్యాక అన్ని విభాగాల ఉద్యోగులను ఆ క్రతువులో భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. ఈలోగానే ఉమ్మడి జిల్లాల పంచాయితీని త్వరగా తేల్చుకుని నిష్పత్తి ప్రకారం ఆయా కార్యాలయాలకు కేటాయించాల్సిన సిబ్బందిని నియమించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేనే ఎన్నికల అంకం సజావుగా ముగుస్తుంది.

నిధుల విషయంలోనూ ఎదురుచూపులే..

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఫాంలకు సంబంధించి రిజిస్టర్ పోస్టుల ద్వారా నోటీసులు పంపించడం తిరిగి వాటికి సమాధానం తీసుకోవడం ఇతరత్రా ఖర్చులన్నీ కలిసి రెవెన్యూ విభాగానికి తడిసి మోపెడైంది. ఇప్పటికీ ఒక్క రూపాయి ప్రభుత్వ ఖజానానుంచి విడుదల కాలేదు. ఎన్నికల అంకం కూడా మరి కొన్ని రోజుల్లో ప్రారంభం కానుండడంతో నిధుల కొరత వెంటాడుతూనే ఉంది. ప్రభుత్వం ఆదేశాలివ్వడంతోనే సరిపెడుతోంది తప్ప నిధుల మంజూరు విషయంలో పట్టనట్లు వ్యవహరిస్తోందని యంత్రాంగం వాపోతోంది. ఎన్నికల వేళ నిధుల విషయంలో ప్రభుత్వంగా ఉదారంగా వ్యవహరించకపోతే ఆ ప్రభావం ప్రక్రియ మీద పడేఅవకాశముందని సిబ్బంది చెబుతున్నారు.

ఉత్తిపోతల పథకాలు


నిరుపయోగంగా ఉన్న నక్కబొక్కలపాడు ఎత్తిపోతల పథకం

- నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు
- అద్దంకిలో ఐదేళ్లుగా మరమ్మతులు లేవు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు
- 15 ఏళ్లుగా పూర్తి కాని కొరిశపాడు పథకం

మేదరమెట్ల, అద్దంకి, ఫిబ్రవరి 3: రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చేసేందుకు ప్రభుత్వం ఎత్తి పథకాల పథకాలను మంజూరు చేసింది. అయితే ఆయా పథకాల గురించి పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి అవి ఉత్తిత్తి పథకాలుగానే మిగిలాయి. కొన్ని పథకాలు అసంపూర్తిగా ఉండగా.. మరికొన్నింటికి మరమ్మతులు లేక మూలనపడిపోయాయి. రైతులకు ఎంతోఉపయోగపడే ఎత్తిపోతల పథకాలపై అటు అధికారులు, ఇటు పాలకులు నిర్లక్ష్యం వారి పాలిట శాపంలా మారింది. సాగర్ ఆయకట్టులేని మెట్ట పొలాలకు సాగునీరు అందించే లక్ష్యంతో గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకాన్ని 2009లో ప్రకటించారు. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి బంధువు అయిన యర్రం చినపోలిరెడ్డి పేరుతో కొరిశపాడు ఎత్తిపోతల పథకాన్ని రూ.177 కోట్లతో 20 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రకటించారు. కొరిశపాడు మండలంలో 8 గ్రామాలకు, నాగులుప్పలపాడు మండలంలో నాలుగు గ్రామాలకు సాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని 2009లో ప్రారంభించారు. ఇప్పటివరకు రూ.114 కోట్లు ఖర్చు చేశారు. కొరిశపాడు రిజర్వాయర్ కట్టలో ఇంకా వంద మీటర్లు పూర్తిచేయాల్సి ఉంది. తూర్పుపాలెం గ్రామానికి పునరావాసం ఇస్తేనే వంద మీటర్లు పనులు చేయనిస్తామని గ్రామస్తులు అడ్డంతిరిగారు. బొల్లవరప్పాడు రిజర్వాయర్‌కు ఇంతవరకు భూసేకరణే జరగలేదు. కొరిశపాడు రిజర్వాయర్ నుంచి బొల్లవరప్పాడు రిజర్వాయర్‌కు 8.2 కిలోమీటర్లు ఫీడర్ కెనాల్ పూర్తి చేయాల్సి ఉంది. 2016 తరువాత ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఎకరానికి రూ.12 లక్షల చొప్పున పరిహారం ఇప్పించి 99 ఎకరాలను ఫీడర్ కెనాల్ నిర్మాణానికి ఇప్పించారు. ఫీడర్ కెనాల్ ఇప్పటివరకు 6.5 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఇంకా 1.7 కిలోమీటర్లు పూర్తిచేయాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా ఎత్తిపోతల పనులు, పునరావాసానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. గత బడ్జెట్‌లో యర్రం చినపోలిరెడ్డి కొరిశపాడు ఎత్తిపోతల పథకానికి రూ.74 లక్షలు మాత్రమే కేటాయించారు. ప్రాజెక్టు పూర్తికి అప్పటి లెక్కల ప్రకారం ఇంకా రూ.63 కోట్లు నిధులు కావాల్సి ఉంది. పనులు చేసిన కాంట్రాక్టర్‌కు రూ.94 లక్షలు బకాయి ఉంది. పాత బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు వదిలేసి వెళ్లిపోయాడు.

మరమ్మతులతో మూలకు..

అద్దంకి నియోజకవర్గంలోని రెండు ప్రధానమైన ఎత్తిపోతల పథకాలకు అందుబాటులో పుష్కలంగా నీరుఉన్నా మరమ్మతులకు గురై మూలనపడి ఉన్నాయి. వీటికి తోడు మరికొన్ని చిన్నచిన్న ఎత్తిపోతల పథకాలు కూడా నిరుపయోగంగా ఉన్నాయి. అద్దంకి మండలంలోని శింగరకొండ పాలెం వద్ద భవనాసి చెరువు ఆధారంగా నాలుగు దశాబ్దాల క్రితం మూడు వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేశారు. కొంతకాలం బాగానే పనిచేసింది. గత దశాబ్ద కాలం క్రితం నుంచి మరమ్మతులకు గురవుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి కొత్తగా మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేసి పునరుద్ధరణ చేశారు. అయితే, ఎత్తిపోతల పథకం నుంచి అద్దంకి మేజర్ కాలువ వరకు ఉన్న పైప్‌లైన్‌లకు పలుచోట్ల లీకులు ఏర్పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మరమ్మతులకు చిల్లిగవ్వ కేటాయించకపోవడంతో పథకం పూర్తిగా మూలన పడింది.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురై నాలుగేళ్లు...

బల్లికురవ మండలంలోని నక్కబొక్కలపాడు వద్ద సుమారు 1200 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నాలుగేళ్ల క్రితం చోరీకి గురైంది. అప్పటి నుంచి ఇంతవరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవటంతో మూల నపడింది.


అసంపూర్తిగా ఉన్న కొరిశపాడు రిజర్వాయర్


చిట్టడవిని తలపిస్తున్న శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ఆవరణ

అడుగంటిన చెరువు

- వేసవి రాక ముందే బాపట్లకు నీటి కష్టాలు
- ఆరు రోజులకు సరిపడ మాత్రమే నీటి నిల్వలు
- ఇక నుంచి రోజు మార్చి రోజు నీటి సరఫరా

బాపట్ల, ఫిబ్రవరి 3: వేసవి రాలేదు.. అప్పుడే బాపట్లవాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పాలకుల అలక్ష్యం.. అధికారుల నిర్లక్ష్యంతో చెరువులో నీరు అడుగంటింది. కేవలం 10 అడుగులు మాత్రమే ఉన్న నీటిలో కేవలం 3 అడుగుల నీటిని మాత్రమే తాగునీటికి వినియోగిస్తారు. మిగిలిన 7 అడుగులు సిల్ట్‌తో కూడిన మురుగు తాగునీటి సరఫరాకు పనికిరాదు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు చూస్తే ఆరు రోజుల వరకే వస్తాయి. ఆ తర్వాత ఏమిటి అనే ఆందోళన మొదలైంది. అయినా చెరువులో నీరు పెట్టే ఆలోచన అధికారులు చేయకపోవడం పట్టణ ప్రజల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం చెరువులో ఉన్ననీరు కేవలం ఆరు రోజులకు మాత్రమే సరిపోతుంది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా చెరువులో నీరు డెడ్ స్టోరేజికి వెళ్లడంతో అధికారులు చెరువును పరిశీలించి ఇక నుంచి ప్రజలకు రోజు మార్చిరోజు నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈవిధంగా చేసినా కేవలం 12 రోజులకు మాత్రమే నీరు సరిపోతుంది. ఆ తర్వాత ప్రజలు కష్టాలు పడాల్సిందే. సాంకేతిక కారణాల వల్ల వీటీ ఛానల్‌కు నీరు రావడం ఆలస్యమైందని మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు చెబుతున్నారు. ఓ వైపు నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయంటూ మరోవైపు సాంకేతిక సమస్యలు అంటూ పొంతన లేని మాటలు చెబుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల సమయంలో 100 చోట్లకు పైగా పైపులైన్‌లు పగలగొట్టారు. దీంతో చెరువులో నీరు అటు ప్రజలకు చేరకుండా ఇటు చెరువులో ఉండకుండా వృథా అయ్యింది. ఇష్టానుసారంగా గుంతలు తవ్వి పైపులు పగలగొట్టి నీటిని వృథా చేసిన కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.


సమ్మర్ స్టోరేజ ట్యాంక్

ప్రజలు సహకరించాలి : డీఈ

చెరువులో నీరు డెడ్ స్టోరేజికి వెళ్ళినందున ప్రజలు అధికారులకు సహకరించాలని మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు తెలిపారు. తాగునీరు రంగుమారి వచ్చేఅవకాశం ఉందన్నారు. నీటిని క్లోరినేషన్ చేసి కాపర్ సల్ఫేట్ కలిపి సరఫరా చేస్తామన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కాచి చల్లార్చి తాగాలని సూచించారు.

నీరు వచ్చే అవకాశం ఉంది : కమిషనర్

సమ్మర్ స్టోరేజి ట్యాంకులో నీరు అడుగంటిన నేపథ్యంలో నీరు విడుదల చేయమని ఇరిగేషన్ అధికారులను కోరినట్లు మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. నీరు విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆ నీరు వస్తే సమస్య ఉండదన్నారు. గతంలో ఏప్రిల్ 15 వరకు నీరు ఇచ్చేవారని ప్రస్తుతం నీరు తక్కువగా ఉన్నందు వల్ల వీటీ ఛానల్‌కు రావడంలేదన్నారు.



కిలో రూ. 289 పలికిన పొగాకు

● కర్ణాటకలో రికార్డు స్థాయి ధర
● ముగింపు దశకు చేరుకున్న వేలం

ఒంగోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పొగాకు మార్కెట్ ముగింపు దశకు చేరుకుంది. మరో పది రోజుల్లో సగం కేంద్రాల్లో వేలం ముగియనుండగా మిగిలనవి కూడా ఆ తర్వాత వారంలో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ దశలో అక్కడ రికార్డు స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. శనివారం అక్కడి మార్కెట్లో కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.289 పలుకగా మీడియం గ్రేడ్‌లన్నీ రూ.280పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో 2023-24 సంవత్సరానికి వంద మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా సుమారు 83 మిలియన్ కిలోలు ఉత్పత్తిగా అంచనా. ఇప్పటివరకు 72 మిలియన్ కిలోలు అమ్మకాలు జరగ్గా సగటున కిలోకు రూ.254 ధర లభించింది. మరో పది మిలియన్లకు అటుఇటుగా అక్కడ కొనుగోళ్లు జరగాల్సి ఉండగా రానున్న పక్షం రోజుల్లో మొత్తం వేలం ప్రక్రియ ముగుస్తుంది. ఈ దశలో హాట్‌హాట్‌గా మార్కెట్ నడుస్తోంది. గ్రేడ్ ఏదైనా రేటు ఒకటే అన్న విధంగా సాగుతున్న అక్కడి మార్కెట్లో కనిష్ఠ ధరలు కిలో రూ.260పైనే ఉంటున్నాయి. మీడియం గ్రేడ్, మేలురకం తేడా లేకుండా వాటి ధరలు కిలో రూ.280పైగా ఉంటుండగా గరిష్ఠ ధరలు శుక్రవారం కిలో రూ.280 పలుకగా శనివారం రూ.289 లభించింది. ముగింపుదశ కావడంతో వ్యాపారులు కూడా పోటీపడి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.



ఆక్రమణదారులు చదును చేసిన పొలం

ఆక్రమణల్లో కొండలు, అసైన్‌మెంటు పొలాలు

● చదును చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 3: ఆక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఖాళీగా భూమి కనిపిస్తే చాలు వాలిపోతున్నారు. యథేచ్ఛగా ఆక్రమించి సాగుకు సిద్ధం చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తిచూడకపోవడం ఆలోచించాల్సిన విషయమే. వివరాల్లోకి వెళితే.. మండలకేంద్రం త్రిపురాంతకానికి చెందిన 30 ఎకరాలకుపైగా అసైన్‌మెంట్ భూమిపై కొందరు కన్నేశారు. త్రిపురాంతకానికి చెందిన వైసీపీ వర్గీయులు సాగర్ కుడి ప్రధాన కాలువకు పడమటి వైపున గణపవరం రెవెన్యూకు ఆనుకుని సర్వే నెంబరు 804, 300లలో భూమిని ఆక్రమించి కొన్ని రోజులుగా చదును చేస్తున్నారు. ప్రస్తుతం ఆక్రమణకు గురైన భూమి సమీపంలోనే ఇటీవల ప్రభుత్వం గ్రామంలోని 12 మంది లబ్ధిదారులకు అసైన్‌మెంటు కమిటీ ఆమోదం ద్వారా 23.46 ఎకరాల పొలాన్ని అందజేసింది. దీన్ని ఆసరాగా చేసుకుని అధికార పార్టీకి అనుకూలంగా ఉండే కొందరు ఆ పక్కనే ఉన్న కొండ భూమిని ఆక్రమిస్తున్నారు. మిగిలిన భూమిని, కొండలను ఆక్రమించి పిచ్చి కంపను తొలగించారు. యంత్రాల సహాయంతో భూమిని చదునుచేసి, దుక్కి దున్ని, సాగు చేసేందుకు సిద్ధం చేశారు. ప్రస్తుత ఆక్రమిత భూమి విలువ రూ.కోటికిపైగా ఉండొచ్చని అంచనా. కాగా రెవెన్యూ అధికారులు మాత్రం విషయం తెలిసినా ఆక్రమణలను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో గ్రామస్థుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై వీఆర్వో శివలింగయ్యను వివరణ కోరగా...ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడతామన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొన్నిశాఖలకే జీతాలు

● మెజార్టీ ప్రభుత్వ ఉద్యోగులకు పడని వైనం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు పడటంలో లేదు. రానురాను వారి పరిస్థితి దారుణంగా తయారవుతోంది. 3వతేదీకి కేవలం కొన్నిశాఖల ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడగా మెజార్టీ శాఖలకు మాత్రం జీతాలు పడలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 1వతేదీనే ఉద్యోగులు, పెన్షనర్లు తమ వేతనాలు బ్యాంకు అకౌంట్లలో జమ అవుతాయని ఆశించారు. అయితే జగన్ సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటంతో ఉద్యోగులు మండిపడుతున్నారు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్స్‌తో కలిపి 50 వేలమందికిపైగానే ఉన్నారు ఇప్పటి వరకు సచివాలయ ఉద్యోగులు, ట్రెజరీ, పోలీసుతోపాటు మరో నాలుగైదు శాఖల ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడ్డాయి. ప్రధానంగా ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులే 30వేల మంది వరకు ఉంటారు. ఇతర అన్ని శాఖల్లో కలిపి మరో 20వేల వరకు ఉంటారు. ఇక ఉపాధ్యాయులకు గత ఏడెనిమిది నెలల నుంచి ఏ తేదీన జీతాలు పడతాయో కూడా తెలియడం లేదు. ఉపాధ్యాయులు 1వతేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గత కొన్ని నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇలా ఉద్యోగులు తమ జీతాల కోసం ఎదురుచూడాల్సిన రావడంతో అందరూ మండిపడుతున్నారు.



ఎపిక్ కార్డులను స్కాన్ చేస్తున్న సిబ్బంది

జిల్లాకు వచ్చిన ఎపిక్ కార్డులు

● బీఎల్వోల ద్వారా పంపేందుకు చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నుంచి జి ల్లాకు 1.50లక్షల కొత్త ఎపిక్(ఓటు గుర్తింపు కార్డు) కార్డులు చేరాయి. కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగానికి ఎన్నికల కమిషన్ నుంచి కార్డులు రావడంతో వాటిని ఓటుదారులకు పంపేందుకు శనివారం బూత్ లెవల్ అధికారులు(బీఎల్వో)లు చర్యలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ నుంచే ఓటుదారుడికి పంపేందుకు అడ్రసుతో సహా కవర్లు వచ్చాయి. ఆ కార్డులను సెల్ లేదా ల్యాప్‌టాప్‌లో స్కాన్ చేసే ప్రక్రియను చేపట్టారు. ఆ ఎపిక్ కార్డులను స్కాన్ చేసిన అనంతరం పోస్టాఫీసు ద్వారా ఓటుదారుడికి పంపేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రక్రియను సజావుగా, సత్వరంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

ఒంగోలు డీఎస్పీగా కిషోర్‌బాబు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 3 :ఒంగోలు డీఎస్పీగా ఎం.కిషోర్‌బాబు శనివారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కె.నారాయణస్వామిరెడ్డి భీమవరం బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కిషోర్‌బాబును నియమించగా ఆయన శనివారం ఒంగోలు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కిషోర్‌బాబు ఇప్పటివరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు.

అటు.. ఇటు.. హీటు

మారిస్తే సరిపోతుందా..!
మార్కాపురం, గిద్దలూరుల్లో
సూటిగా ప్రశ్నిస్తున్న వైసీపీ శ్రేణులు
ఆనియోజకవర్గం మనకొద్దు, వెళ్లొద్దు
ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి అనుచరుల సూచన
వైసీపీకి గుడ్‌బై అంటున్న
గిద్దలూరులోని ఒక వర్గం నాయకులు
స్థానికులను మోసం చేశారంటూ
నేతల ఆగ్రహం
హైదరాబాద్ వెళ్లి బాలినేనిని
కలిసిన నేతలు
తాడేపల్లి నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లిన
రాంబాబు



ఓటమి భయంతో పోటీచేసే స్థానాలు మార్చి ఎమ్మెల్యేలను కాపాడుకోవాలని చూస్తున్న సీఎం జగన్‌రెడ్డి వ్యూహానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని తాజా పరిస్థితులు అందుకు దర్పణం పడుతున్నాయి. ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తులకు చెక్‌పెట్టే ఉద్దేశంతో వైసీపీ ఎమ్మెల్యేలను సీఎం జగన్ నియోజకవర్గాలు మారుస్తున్న విషయం తెలిసిందే. దీనికితోడు రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు మార్చుకుని మరీ ఎమ్మెల్యేలకు జైకొడుతున్నారు. అందులో భాగంగా పోటీ చేయను మహాప్రభో అన్న అన్నాని ఒప్పించి మార్కాపురం ఇన్‌చార్జిగా నియమించారు. పోటీ చేయకుండా ఖాళీగా అయినా ఉంటా కానీ గిద్దలూరు వెళ్లకూడదని నిర్ణయం తీసుకున్న నాగార్జునరెడ్డితో సీఎం ప్రత్యేకంగా మాట్లాడి ఒప్పించారు. అయితే రెండుచోట్ల జగన్ వ్యూహాన్ని ఆ పార్టీశ్రేణులే జీర్ణించుకోలేకపోతున్నారు. కొందరు కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇక వైసీపీతో లాభం లేదని గుడ్‌బై చెబుతుండగా మరికొందరు బహిరంగంగానే వారి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీంతో రెండు చోట్ల వైసీపీ శ్రేణుల్లో శనివారం తీవ్రస్థాయిలో అలజడి ఆరంభమైంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఆయా నియోజకవర్గాల్లో ప్రజావ్యతిరేకత ఉందని భావిస్తున్న ఎమ్మెల్యేలను ఇతర చోట్ల నుంచి రంగంలోకి దింపే ప్రక్రియను వైసీపీ అధిష్ఠానం వేగవంతం చేసింది. ప్రకాశం జిల్లాలో ఈ ప్రక్రియకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. తాజాగా గిద్దలూరు ఎమ్మెల్యేను మార్కాపురం, మార్కాపురం ఎమ్మెల్యేను గిద్దలూరుకు మార్పు చేయగా రెండుచోట్ల వైసీపీ శ్రేణుల నుంచి తీవ్రస్థాయిలో అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. పక్కపక్కనే ఉండే గిద్దలూరు, మార్కాపురం ఎమ్మెల్యేలు రాంబాబు, నాగార్జునరెడ్డిలు నివాసం ఉండేది మార్కాపురంలోనే. రెండు నియోజకవర్గాలకు రెవెన్యూ డివిజన్, పోలీసు సబ్ డివిజన్, ఇతర ఆయా ముఖ్యశాఖల కార్యాలయాలు ఉండేది మార్కాపురంలోనే. రెండు కలిసే ఉంటాయి. గిద్దలూరులో ఎమ్మెల్యే రాంబాబుపై వైసీపీలోనే అసమ్మతి పెరిగిపోయింది. ప్రధానంగా అక్కడ రెడ్డి సామాజికవర్గం నాయకులంతా రాంబాబు తమను ఇబ్బందిపెడుతున్నారంటూ నేరుగా సీఎం జగన్‌కే ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ రెడ్డిని అభ్యర్థిగా రంగంలోకి దింపబోతున్నట్లు జగన్ ముందుగానే సంకేతం ఇచ్చారు. కారణం ఏమైనా తర్వాత రాంబాబు వచ్చే ఎన్నికల్లో పోటీచేయనని బహిరంగంగా ప్రకటించారు. పైగా వైసీపీకే చెందిన ఎంపీ మాగుంటపై ఆరోపణలు చేసి వివాదాస్పదుడయ్యాడు. అయితే చివరికి అధిష్ఠానం రాంబాబును ఒప్పించి మార్కాపురానికి బదిలీ చేయటంతో ఈ విషయాలన్నీ మార్కాపురం వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమయ్యాయి.





ఇక మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పాలనలో కుటుంబ సభ్యుల పాత్ర పెంచారని ఆయన సోదరుడు భూకుంభకోణాలతో రెచ్చిపోయాడన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. టీడీపీ నాయకులైతే వారికి మార్కాపురం నయామ్ అనే బిరుదును ఇచ్చి ఆ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఇక్కడ జరుగుతున్న వ్యవహారాన్ని పక్కనే ఉన్న గిద్దలూరు వాసులు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారు. పైగా తాను గిద్దలూరు వెళ్లనని నాగార్జునరెడ్డి చెప్పినప్పటికీ జగన్ బలవంతంగా ఒప్పించారు. దీంతో వైసీపీ శ్రేణులు వారికి వ్యతిరేకంగా వ్యాఖ్యానించటం బదిలీలపై అసంతృప్తి వ్యక్తం చేయటం స్పష్టంగా కనిపించింది.

గిద్దలూరు వద్దనే వద్దు

శనివారం మార్కాపురంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఇంటికి ఆయన అనుచరగణం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 'గిద్దలూరులో పరిస్థితులు ఏమీ ఆశాజనకంగా లేవు. ఎమ్మెల్యే రాంబాబుకు మద్దతుగా ఉన్న ఓ సామాజికవర్గం వారు జై జనసేన అని వెళ్లిపోతున్నారు. రెడ్డి సామాజికవర్గం నాయకులంతా ఐక్యంగా నియోజకవర్గేతర నాయకులకు సహకరించబోమని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో మీరు గిద్దలూరుకు వెళ్లటం మాకిష్టం లేదు' అంటూ నాగార్జునరెడ్డికి అనుచరులు స్పష్టంగా సూచించారు. అయితే నాగార్జునరెడ్డి 'నాకూ ఇష్టం లేదు, కానీ సీఎం జగన్ ఒకటికి రెండుసార్లు చెప్పారు, ఆయన మాటను గౌరవించి వెళ్లాల్సిందే. అక్కడ ఇబ్బందులు ఉంటాయని కూడా నేను అనుకోవటం లేదు' అని అన్నట్లు తెలిసింది. తదనుగుణంగా మంచిరోజు చూసుకుని గిద్దలూరులో అడుగుపెట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. అయితే నియోజకవర్గంలోని రాంబాబు అనుచరులుగా ముద్రపడిన పలువురు గత రెండురోజుల నుంచి టీడీపీలో చేరటం ప్రారంభించారు. ప్రజారాజ్యంలో రాంబాబు చేరినప్పటి నుంచి ఆయనతో పయనిస్తూ వ్యక్తిగతంగా ఆయనతో ఉన్న కాపు సామాజికవర్గం నాయకులంతా జనసేన పట్ల ఆసక్తితో టీడీపీ నేత అశోక్‌రెడ్డిని కలిసి మద్దతు ప్రకటిస్తున్నారు. గిద్దలూరులోని ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన రెండు వార్డులలోని ముఖ్యులంతా అశోక్‌రెడ్డిని కలిసి శుక్రవారం రాత్రికే తమ మద్దతును ప్రకటించేశారు. ఇంకోవైపు రెడ్డి సామాజికవర్గంలో స్థానికులకు అవకాశం ఇస్తామని హామీ ఇచ్చి అధిష్ఠానం మాట తప్పిందని ఆ సామాజికవర్గం నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. టిక్కెట్ ఆశించి భంగపడిన లింగారెడ్డి, ఐవీరెడ్డి తదితరులైతే హైదరాబాద్ వెళ్లి బాలినేనితో మంతనాలు ప్రారంభించారు. మిగిలిన నాయకులు గతంలో చెప్పిన మాట ప్రకారం స్థానికేతర నాయకుడికి సహకరించేది లేదని స్పష్టంగా చెబుతున్నారు.

మార్కాపురం రాని రాంబాబు

తాడేపల్లిలో సీఎంతో సమావేశం అనంతరం ఎమ్మెల్యే రాంబాబు మార్కాపురం రాకుండా పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. సోమవారం సాయంత్రానికి ఆయన మార్కాపురం చేరే అవకాశం ఉంది. మార్కాపురంలో సీఎం జగన్ ఆశించినట్లు ఆర్యవైశ్యులలో రాంబాబు పట్ల అంతో ఇంతో ఆసక్తి కనిపించినప్పటికీ రెడ్డి సామాజికవర్గం నాయకులు ఈ విషయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మార్కాపురం జడ్పీటీసీ అధిష్ఠానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తాను కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తానని బహిరంగంగానే చెబుతున్నారు. దీనికితోడు గిద్దలూరులో రెడ్లను రాంబాబు ఇబ్బందిపెట్టారన్న ప్రచారం వారిలో విస్తృతంగా ప్రారంభమైంది. దీంతో అభ్యర్థులను మార్చినంత మాత్రాన వారిపై వైసీపీ శ్రేణుల్లో ఉన్న అసంతృప్తి అంత సులువుగా తొలగిపోదన్న విషయాన్ని ఆ రెండుచోట్ల నెలకొన్న పరిస్థితులు మరోసారి తేటతెల్లం చేస్తున్నాయి.

బాలినేనితో చెవిరెడ్డి భేటీ

అధిష్ఠానం నిర్ణయంతో అసంతృప్తితో హైదరాబాద్‌లో ఉన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కొత్తగా రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి కలవటం విశేషం. శుక్రవారం రాత్రి ఒకసారి శనివారం ఉదయం మరోసారి బాలినేనిని కలిశారు. ఒంగోలులో వివాదంగా మారిన ఫ్లెక్సీల ఏర్పాటు వ్యవహారం తనకు తెలియదని చెప్పినట్లు తెలిసింది. ఒంగోలు వెళ్లి కార్యక్రమం పెట్టేందుకు రమ్మని కోరినట్లు తెలిసింది. అయితే బాలినేని తనను సీఎం నుంచి అధిష్ఠానంలోని నాయకులు పదేపదే మోసం చేశారని వారి మోసపు ఎత్తుగడలకు తన రాజకీయాన్ని పణంగా పెట్టలేనని అన్నట్లు తెలిసింది.

ముంపు గుబులు

వెలిగొండ నిర్వాసితుల్లో భయాందోళన
ఇంతవరకూ అతీగతీ లేని పునరావాసం, పరిహారం
కొద్దిరోజుల్లో ప్రాజెక్టు ప్రారంభోత్సవం అంటూ హడావుడి
నిర్వాసిత కాలనీల్లో అసంపూర్తిగా నిర్మాణాలు



ప్రాజెక్టు ముంపు గ్రామం కలనూతల గ్రామానికి ఏర్పాటు చేసిన ఇడుపూరు పునరావాస కేంద్రం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 2 : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పుడు నిద్ర కరువైంది. రెండో టన్నెల్ తవ్వకం పూర్తయ్యిందంటూ ఇటీవల అధికారులు ప్రకటించారు. అయితే సొరంగం లోపల రివెంట్‌మెంట్‌ను పూర్తి చేయలేదు. ఎన్నికల నేపథ్యంలో మరో వారంలో ప్రాజెక్టు ప్రారంభిస్తామని అధికారులు హడావుడి చేస్తున్నారు. అయితే పునరావాస కాలనీల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వెలిగొండ ప్రాజెక్టు ముంపుగ్రామాల నిర్వాసితులకు కనీసం పునరావాస కాలనీల్లో నేటికీ పట్టాలు ఇవ్వలేదు. దీంతో వారు ఎక్కడికి పోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ గ్రామాలను వదిలి వెళ్లేందుకు వారు సిద్ధంగా ఉన్నప్పటికీ వీరికి పరిహారం, ఇతర ప్యాకేజీలు సక్రమంగా అందలేదు. తమకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆర్ ఆర్ ప్యాకేజీల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఈ ఏడాది.. వచ్చే ఏడాది అంటూనే ప్రభుత్వం నాలుగున్నరేళ్లపాటు కాలం వెళ్లదీసింది. అయితే ప్రాజెక్టు ప్రారంభిస్తామని హడావుడి నెలకొనడంతో నిర్వాసితుల సమస్య మొదటికి వచ్చింది. దీంతో అధికారులు నిర్వాసితులు జాబితాలను నేడోరేపో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మరోవారంలో ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని చెబుతున్న అధికారులు నిర్వాసితులకు ప్రభుత్వం ప్యాకేజీ ఇస్తుందా..? లేదా..? అన్నది ప్రకటించడం లేదు. మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతాండా గ్రామాలకు, అదే మండలంలోని వేములకోట ఇలాకాలో కుంట, జమ్మనపల్లి మార్గమధ్యలో 83ఎకరాల భూమిని సేకరించారు. 800 నిర్వాసిత కుటుంబాలకు ఇక్కడ పట్టాలు ఇవ్వాల్సి ఉంది. కాలనీలో మౌలిక వసతులు కూడా కల్పించాల్సి ఉంది. అయితే సదరు కాంట్రాక్టర్ అర్థంతరంగా పనులను నిలిపేశాడు. దీంతో పునరావాసం ప్రహసనంగా మారింది.

నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు

పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కలనూతల, చింతలముడిపి, కాటమరాజుతాండ, గుండంచర్ల, మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువుతండా, అర్థవీడు మండలంలోని లక్ష్మీపురం, కృష్ణానగర్, సాయినగర్, రామలింగేశ్వరపురం గ్రామాలను వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలుగా ఉన్నాయి. వీటిలో 4,517 కుటుంబాలను నిర్వాసితులుగా గుర్తించారు. 2019 నాటికి 18ఏళ్లు నిండిన మరో 2,918 మంది యువతీ యువకులను ప్యాకేజీకి అర్హులుగా గుర్తించారు. దీంతో మొత్తం 7,555 మంది నిర్వాసితులకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి తరలించాల్సి ఉంది. అర్థవీడు మండలానికి చెందిన నిర్వాసితులు 96 మందికి మాత్రమే వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా నష్టపరిహారం అందించారు. ప్రాజెక్టు ముంపుగ్రామాల్లో ఒక్కరికి కూడా పునరావాసం కల్పించకుండా, నష్టపరిహారం అందించకుండా, ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా ప్రాజెక్టు పూర్తిచేశామని చెప్పుకుంటూ త్వరలో ప్రారంభమని చెప్పడంపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్అర్ ప్యాకేజీ ఊసే కరువు

మార్కాపురం మండలం ఇడుపూరు పంచాయతీలో ఇడుపూరు-2 పునరావాస కాలనీ, కలనూతల గ్రామం వారికి కేటాయించారు. కానీ నిర్వాసితుల తుది జాబితా ఇంతవరకు విడుదల చేయలేదు. సుమారు రూ.1000 కోట్ల వరకు నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది కానీ బడ్జెట్లో కేవలం రూ.101 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రారంభం అంటూ హడావుడి చేస్తున్న అధికారులు ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వకుండా ముంపు గ్రామాల నుంచి తమను బలవంతంగా పంపించేస్తారేమోనన్న ఆందోళన నిర్వాసితుల్లో నెలకొంది.

భోజనం బాగోలేదంటే దూషించారు

కళాశాల భవనం పైనుంచి దూకిన విద్యార్థిని
తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలింపు



విద్యార్థినిని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తున్న బంధువులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 3: భోజనం బాగా లేదని చెబితే తననే తిరిగి దూషిస్తున్నారంటూ మనస్తాపం చెంది ఓ నర్సింగ్ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని దరిమడుగులోని ఓ నర్సింగ్ కళాశాలలో శనివారం చోటుచేసుకుంది. ఎర్రగొండపాలెం మండలం పీఆర్‌సీ తండా చెందిన జానకీబాయ్ బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ ఏడాది మే నెలలో దరిమడుగులోని నర్సింగ్ కళాశాలలో చేరారు. వసతిగృహంలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో భోజనం సక్రమంగా లేకపోవడంతో మనస్తాపం చెందారు.

దీనిపై ఫిర్యాదు చేసినా సిబ్బంది తననే దుర్భాషలాడుతున్నారని మరింత ఆవేదన చెందారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో కళాశాల మొదటి ఫ్లోర్ నుంచి కిందకి దూకింది. దీంతో ఆమె తల, వెన్నెముక భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సిబ్బంది వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం వేధింపులతోనే తాను ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు.

ఎలుకలు పడిన భోజనం పెట్టారని, ఈ విషయం సిబ్బందికి చెబితే తననే వేధించారని ఆరోపించారు. కళాశాలలో వసతులు కూడా సక్రమంగా లేవన్నారు. దీంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. కళాశాల సిబ్బంది వేధింపులతోనే తమ బిడ్డ ఇలా చేసిందని బాధితురాలి తల్లిదండ్రులు, ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. బాధితురాలిని మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 2: జిల్లాలో మార్చి1నుంచి 20వతేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధితశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలన్నారు. జిల్లాలో 69 పరీక్షా కేంద్రాల్లో 44,733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 21,570 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 23,163 మంది ఉన్నారని ఆయన తెలిపారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో సిటింగ్, లైటింగ్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరీక్షలు జరిగే రోజున ఫ్లయింగ్ స్క్వాడ్ చురుకుగా పని చేయడంతో పాటు కేంద్రాల్లో సీసీకెమెరాల నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులఆర్టీసీ బస్సుల ఏర్పాటుతో పాటు విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ఆర్ఐవో సైమన్‌విక్టర్, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఆర్ఎం సుధాకర్, ఆర్టీసి, ట్రెజరీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫి బ్రవరి 3 : సింగరాయకొండ మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఒంగోలులోని జ నసేన పార్టీ కార్యాలయం లో శనివారం పార్టీ జిల్లా అ ధ్యక్షుడు షేక్ రియాజ్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు కండువాలు వేసి ఆయన సా దరంగా ఆహ్వానించారు. వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్‌డీ.ఖాజా యూసఫ్, మూలగుంటపాడు 9వ వార్డు మెంబర తస్లీమ్, షేక్ కరీంబాషా, పి. మల్లికార్జున, షేక్ ఖాజావలి, రాజా రామచంద్ర, యుగంధర్, షేక్ రసూల్, రజియాతో పాటు పలువురు చేరారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ వ చ్చే ఎన్నికల్లో జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీలో చేరిన నా యకులకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు.

అధిష్ఠానం ఆదేశిస్తే బాపట్ల నుంచి పోటీచేస్తా!

» కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

పంగులూరు, ఫిబ్రవరి 3: పార్టీ అధినాయకత్వం అంగీకరిస్తే బాపట్ల పార్లమెంటరీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తానని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. వ్యక్తిగత పనిపై శనివారం పంగులూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన సమయంలో అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వందల సంఖ్యలో సామాజిక భవనాలు, స్వచ్ఛమైన తాగు నీరందించే ఆర్వో ప్లాంట్లు నిర్మించి గ్రామ పంచాయతీలకు అప్పగించినట్లు చెప్పారు. కష్ట జీవులకు దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కార్పొరేట్ సంస్థల యజమానులకు కట్టబెడుతున్న కేంద్ర పాలకుల విధానాలను తప్పుబట్టారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, ఎస్సీ, ఎస్టీ లకు ప్రయోజనం చేకూర్చే 26 పథకాలను రద్దు చేసిన జగన్మోహనరెడ్డి, తానే దళిత, గిరిజనులకు మేలు చేకూర్చుతున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు.

12 మంది సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 3: సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శనివారం కళాశాలలో నిర్వ హించిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లా డుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యానికి పదును పెట్టుకోవాల్సిన ఆవశ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టమైన రంగంలో ఉన్నతస్థాయికి ఎదగాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 3: విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో కృషితో ఉన్నత స్థాయికి ఎదగాలని పీజీఎస్ఎఫ్ ప్రతినిధులు, ఈఎస్టీ డాక్టర్ కొర్రపాటి సుధాకర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(యూఎస్ఐ) గుళ్లపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం(పీజీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో 22 సైకిళ్లతో సైకిల్ బ్యాంక్ ఏర్పాటు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులలో అనేక మార్పులు వస్తాయన్నారు. పీజీఎస్ఎఫ్ అందించిన పుస్తకాలను విద్యా ర్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా ఉంటాం


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 3: ఆపన్నులకు అండగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని బుర్లవారిపాలెం కాలువ కట్టపై ఉన్న యానాదులను శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆపన్నహస్తం అందించేందుకు టీడీపీ ముందు వరుసలో ఉంటుందన్నారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు ప్రతిఒక్కరూ ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నక్క మరియమ్మ, గున్నం పద్మ, లక్ష్మి, రమణమ్మ, లక్ష్మయ్య, వెంకన్న, మోహన్‌గౌడ్, కొమ్మనబోయిన రజిని, గంజి పురుషోత్తమ్, గజవల్లి శ్రీనివాసరావు, రత్నబాబు, అడ్డగడ్డ రామయ్య, కట్టెం వంశీకృష్ణ, తేలప్రోలు నాగేశ్వరరావు, కౌతవరపు జనార్దనరావు, గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ సర్వనాశనం

» నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

» ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు దగా డీఎస్సీ

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజం


రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 3: డీఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసి తీరా ఎన్నికల సమయం వచ్చేసరికి ఇప్పుడు ప్రకటిస్తుందని చెప్పారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50,896 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు మెగా డీఎస్సీ అని చెప్పి ఐదేళ్ళు తాడేపల్లి ప్యాలెస్‌లో నిద్రపోయి, ఎన్నికలకు ముందు 6,100 పోస్టులకు అనుమతి ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ సర్వనాశనం అయ్యిందన్నారు. సీఎం సభ కోసం ఇంటర్మీడియట్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా వాయిదా వేశారన్నారు. ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం సభకు విద్యార్థులను పెద్దఎత్తున తరలించేందుకు విద్యాలయాలకు సెలవు ప్రకటించారన్నారు. కళాశాల యాజమాన్యాలను అధికారులతో బెదిరించి బస్సులను బలవంతంగా తీసుకోవటం హేయమైన చర్య అని అన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్ రెడ్డి ఓటమే లక్ష్యంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడ్డా దాని మూలాలు ఏపీలోనే ఉండటం జగన్‌రెడ్డి అరాచకపాలన కు నిదర్శనమన్నారు. గంజాయి రవాణా వైసీపీ నేతలు, అధికారుల కనుసన్నలలో జరుగుతుందన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రం పెట్టుబడులకు హబ్ గా ప్రథమస్థానంలో ఉంటే, వైసీపీ పాలనలో గంజాయి రవాణాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం రావాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు.

అక్రమ కేసులు పెట్టినా అదరం బెదరం

» ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఊరుకోం

» టీడీపీ నేతల హెచ్చరిక


మార్టూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మార్టూరు, ఫిబ్రవరి 3: అక్రమంగా కేసులు పెట్టినా భయపడేది లేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. అక్రమ దందా చేస్తూ మార్టూరులోని కష్టాన్ని రోజూ కరెన్సీ రూపంలో ఎత్తుకుపోతున్నా కళ్లు మూసుకున్న నాయకులు కళ్లు తెరవాలన్నారు. ప్రశాంతకు మారుపేరైన పర్చూరు నియోజకవర్గంలో అలజడి సృష్టించి, అభివృద్ధికి మార్గదర్శకుడైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై దుష్ప్రచారం చేసే వారిపై తీవ్ర పరిణామాలు ఉంటాయని టీడీపీ మండల నాయకులు హెచ్చరించారు. గతనెల 30న మార్టూరులో టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్‌లో జరిగిన గొడవలో నెల్లూరు విజిలెన్స్ అధికారి బాలాజీ నాయక్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు పోలీసులు అరెస్టుచేసిన ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులకు శనివారం ఒంగోలు జైలు నుంచి బెయిల్‌పై విడుదలై వచ్చారు.


ఈసందర్భంగా మార్టూరులోని పార్టీ కార్యాలయంలో బెయిల్‌పై వచ్చిన నాయకులతో పాటు మండలంలోని నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. న్యాయం గెలిచిందని, టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కేవలం టీడీపీకి చెందిన గ్రానైట్ పరిశ్రమలలో అధికారులు తనిఖీలు చేయడం ఎంతవరకు సబబని అడిగిన పరిశ్రమల యజమానులపై అధికారుల చేత అధికారపార్టీ వారు అక్రమంగా కేసులు పెట్టించడం నీచ సంప్రదాయమన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తుందని చెప్పారు. సదరు వైసీపీ నాయకుడు మార్టూరు గ్రామంలో ఒక్క అభివృద్ధి పని చేశారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును విమర్శించే అర్హత ఎవరికీ లేదన్నారు. ఎంతో మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమలకు అధికారులు ప్రయివేటు వ్యక్తులతో ముఖ్యంగా వైసీపీకి చెందిన వ్యక్తితో మారణాయుధాలుతో తనిఖీలకు రావడం కక్షపూరిత చర్య కాదా అని ప్రశ్నించారు. అదేమిటని అడిగినందుకు, ప్రజాప్రతినిధిగా అక్కడకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూరిపై అక్రమంగా కేసులు పెట్టడం రాజకీయ ప్రతీకారచర్య కాదా అని ప్రశ్నించారు. తాము పెట్టిన కేసును ఇంతవరకు పోలీసులు నమోదు చేయడానికి కారణం అధికార పార్టీ ఒత్తిడులు కాదా అని పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గంలో రౌడీ రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరని అన్నారు. ప్రజానీకం తిరుగుబాటు చేసే సమయం ఆసన్నమయిందని నాయకులు స్పష్టం చేశారు.

కార్యక్రమంలో కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు, తొండెపు ఆదినారాయణ, మక్కెన శేఖర్‌బాబు, శివ, దాసం అశోక్ కుమార్, జంపని శ్రీనివాసరావు, రావినేని శ్రీనివాసులు, ఉప్పటూరి రమాదేవి, గొట్టిపాటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నేత భార్యకు రెండు చోట్ల ఓట్లు

» టీడీపీ వర్గీయులు ఏడుగురికి ఒకేచోట ఉన్నా రెండోసారి ఫాం 7 అందజేత

» అధికారులు విచారణ చేసి స్థానికులే అని నిర్ధారించినా మరలా ఫిర్యాదులు



ఒంగోలులో ఉన్న సూదనగుంట సుప్రియ ఓటు



కొటికలపూడిలో ఉన్న సుప్రియ ఓటు

అద్దంకి, జనవరి 3: వైసీపీ గ్రామస్థాయి నేత భార్యకు రెండుచోట్ల ఓటు హక్కు ఉన్నా.. అదే నేత టీడీపీ వర్గీయులకు చెందిన ఏడుగురిపై ఫాం7లు అందజేయటం పట్ల టీడీపీ వర్గీయులు మండిపడుతున్నారు. అద్దంకి మండలంలోని కొటికలపూడికి చెందిన సూదనగుంట సుప్రియకు కొటిక లపూడిలోని 194వ బూత్‌లో ఓటు హక్కు ఉంది. ఆమె పుట్టిల్లు అయిన ఒంగోలు నగరంలోని 10వ నెంబరు బూత్‌లోనూ ఓటు ఉంది. సుప్రియ భర్త ఉన్నం అశోక్‌బాబు వైసీపీ నేతగా చెలామణి అవుతూ అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులుగా ఉన్న ఏడుగురిపై తన తోపాటు మరో వ్యక్తి ద్వారా ఫాం 7 ఇచ్చారు. మొదటి విడతలో ఫాం 7లను ముగ్గురు అధికారుల బృందం విచారణ చేసి ఫిర్యాదులు తప్పుడువిగా నిర్ధారించి ఓటు హక్కు కల్పించినట్లు సర్పంచ్ పూనాటి విక్రమ్ తెలిపారు. మరలా వీరిపై రెండోసారి ఫాం7 లు దరఖాస్తు చేయటం పట్ల టీడీపీ వర్గీయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ సానుభూతిపరులకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని, టీడీపీ వర్గీయులకు ఒక్కచోట మాత్రమే ఓటు హక్కు ఉన్నప్పటికి ఫాం7 లు పదేపదే ఇవ్వటం ఏమిటని, అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి తప్పుడు ఫిర్యాదులు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమార్కులను వదిలి ఎమ్మెల్యేపై కేసులా!


విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 3: అక్రమ కేసులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిష్టను తగ్గించలేరని ఏఎంసీ మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి అన్నారు. శనివారం కారంచేడు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్టూరు గ్రానైట్ పరిశ్రమలలోకి అధికారులతో వచ్చిన వైసీపీ రౌడీమూకలను వదిలి ఎమ్మెల్యే ఏలూరిపై కేసులు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గత నాలుగున్నర ఏళ్ళగా వైసీపీ నేత కనుసన్నల్లోనే అవినీతి రాజ్యమేలు తుందన్నారు. సదరు నేత వచ్చిన తరువాత అక్రమాలు, అరాచకాలకు అడ్డులేకుండా పోయిందని విమర్శించారు. మార్టూరు గ్రానైట్ యజమానులపై, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులపై కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఎమ్మెల్యే ఏలూరి రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, పాతూరి శివరాం, బోయిన శ్రీను, ఆంజనేయులు, గద్య సుబ్బయ్య, శ్రీను, కొల్లా భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో ఆమంచికి షాక్

» వెంకటేష్‌కు మద్దతు తెలిపిన ముఖ్యఅనుచరులు


వెంకటేష్‌కు మద్దతు తెలుపుతున్న ఆమంచి ముఖ్యఅనుచరులు

చీరాల, ఫిబ్రవరి 3: చీరాల నియోజకవర్గంలో రాజకీయ సమీరణాలు మారుతున్నాయి. ఆమంచి కృష్ణమోహన్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగే కొందరు శుక్రవారం రాత్రి ఒంగోలులో వైసీపీ నియోకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ను కలిశారు. వచ్చే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో తనకు మద్దతుగా పనిచేస్తామని చెప్తూ బొకే అందజేశారు. ఆమంచికి అత్యంత ఆంతరంగికులుగా గుర్తింపు పొందిన పైడి రాజేష్, గరికపాటి సుధీర్, కౌన్సిలర్ సల్లూరి సత్యానందం తదితరులు మద్దతు తెలపటం ప్రస్తుతం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈక్రమంలో భవిష్యత్ రాజకీయపై ఈ కలయిక ఎలా ఉంటుందనే విషయంలో రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధిలో ముందుండి పనిచేయండి

చీరాల, ఫిబ్రవరి 3: మున్సిపల్ పరిధిలో ఎవరికి ఏ అవసరం వచ్చినా అభివృద్ధిలో ముందుండి పనిచేయాలని కమిషనర్ విజయసారథికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. చీరాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయసారథి ముందుగా స్థానిక అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పురప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

» పట్టించుకోని అధికారులు


అధికారులు పట్టించుకోకపోవటంతో యథేచ్ఛగా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు(ఫైల్)

చీరాల, ఫిబ్రవరి 3: చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. ఇదేమని ప్రశ్నించినవారికి సమాధానం కరువవుతోంది.

చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లి సమీపంలో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారీయింగ్‌పై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఈనేపథ్యంలో శుక్రవారం ఇసుక అక్రమ క్వారీయింగ్‌పై జనసేన పార్టీపరంగా చేపట్టిన చర్యలను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీలకు అతీతంగా చేపట్టిన ఆ చర్యను అడ్డుకోవటం ఎంతవరకు సమంజసమని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇదేమని ప్రశ్నించిన వారికి ఎలాంటి సమాధానం రావటం లేదు. అధికార పార్టీ అడ్డదండలు అందుకు కారణంగా చెప్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

పంగులూరు, ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెక్టోరియల్ అధికారులు శనివారం పలుగ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పంగులూరు, బూదవాడ, కల్లంవారిపాలెం, మల్లవరం, ఆరికట్లవారిపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారి కె.సుబ్బారెడ్డి, చందలూరు, నూజెళ్ళపల్లి, తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్ళపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కేవీపీ కుమారి పరిశీలించారు.

అప్రంటీస్ విధానం తగదు!

మార్టూరు, ఫిబ్రవరి 3: ఉపాధ్యాయుల భర్తీకోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే డీఎస్సీలో అప్రంటీస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు స్కూల్ అసిస్టెంట్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సర్వోత్తమ రెడ్డి, ప్రధానకార్యదర్శి చింతల సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో ప్రకటించబోయే డీఎస్సీలో మార్చి వరకు ఖాళీలయ్యే వాటిని గుర్తించి వాటిని కూడా కలిపి వెంటనే డీఎస్సీని ప్రకటించాలన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయవాది మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 3: చీరాలలో ఓ న్యాయవాది శనివారం మృతిచెందాడు. పట్టణానికి చెందిన చెన్నుపాటి నాగేశ్వరరావు(60)కు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. వయోభారంతో ఆయన తల్లి రమాదేవి గతనెల 23న మృతిచెందడంతో ఇరువురు సోదరులతో కలిసి సంబంధిత ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే బంధువుల సౌకర్యార్థం రామాపురంలో కూడా రూములు ఏర్పాటు చేశారు. ఇదిలాఉండగా శనివారం తెల్లవారు జామున ఇంటినుండి బయటకు వెళ్లిన నాగేశ్వరరావు రామాపురం సముద్రతీరంలో విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్సై జనార్దన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని కుటుంబీకుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబీకులు చెబుతున్నట్లు ఎస్సై తెలిపారు. గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతి విషయం తెలియగానే పెద్ద సంఖ్యలో న్యాయవాదులు హాస్పిటల్ వద్దకు చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు.

విజేతలకు బహుమతులు అందజేత

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 3: యద్దనపూడి మండలం పూనూరు జడ్పీ హైస్కూల్లో శనివారం 2011-12, 2013-14 లకు చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పర్చూరు డివిజన్ పరిధిలోని పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో శ్రీనివాసులు, దివి భావనాచార్యులు విచ్చేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో మొదటి స్థానాన్ని బల్లికురవ జడ్పీ హైస్కూల్, రెండవ స్థానాన్ని పెద అంబడిపూడి, మూడవ స్థానాన్ని కొప్పెరపాడు హైస్కూల్ విద్యార్థులు సాధించారు. టాలెంట్ టెస్ట్ పోటీలలో మొదటి స్థానాన్ని సీహెచ్ నితిన్ (బల్లికురవ), రెండవ స్థానాన్ని ఎస్‌కే గౌస్‌బాషా (బూదవాడ), ఎస్.అనిల్ (పెద అంబడిపూడి) సాధించారు. విజేతలకు డీఈవో శ్రీనివాసులు, పూర్వవిద్యార్థులు పవన్, శశి, రాజారావు, మాధురి, లత, అరుణ చేతుల మీదగా నగదు బహుమతులు అందజేశారు.

నేడు పర్చూరులో ఆర్యవైశ్యుల సర్వసభ్య సమావేశం

పర్చూరు, ఫిబ్రవరి 3: పర్చూరులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్యుల సర్వసభ్య సమావేశం జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు మామిడిపాక హరిప్రసాద్, పోలిశెట్టి గురుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు మండల పరిధిలోని ఆర్యవైశ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, ఫిబ్రవరి 3: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి తాళ్ళూరు మండలం తురకపాలెంకు చెందిన పి.అంజిరెడ్డి, కలమాల కుటుంబసభ్యులు రూ.1,01,116 శనివారం ఈవో సుభద్రకు అందజేశారు. సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

అధికారుల ఒత్తిడి తగదు!

మేదరమెట్ల , ఫిబ్రవరి 3: ఒత్తిడితో పూజిత ఆత్మహత్యకు పాల్పడడం బాధ కలిగించిందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మేదరమెట్ల రైతు భరోసా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడిన వ్యవసాయ విస్తణాధికారి బెల్లంకొండ పూజిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమూరు మండలం చావలిగ్రామంలో వ్యవసాయ విస్తణా ధికారిగా పనిచేస్తున్న పూజిత అధికారులు ఒత్తిడి, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం బాధకలిగించిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, విస్తణాధికారులు రాణి, సుక న్య, ప్రత్యూష, సుష్మా, మేరి, అఫ్రీన్, షరీఫ్, సంతోష్ శ్రీలేఖ, సంతోష్, మౌనిక,హసీనా, చినబాబు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని బైకిస్టుకు తీవ్రగాయాలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 3: జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద డివైడర్‌ను ఢీకొని మోటర్‌సైకిలిస్ట్‌కు తీవ్రగాయాలయ్యాయి. శనివారం మద్దిపాడు మండలం ఏడుగుళ్లపాడు నుంచి పి.గుడిపాడు వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో గాలి సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సురేష్‌ను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

మార్టూరు, ఫిబ్రవరి 3: మార్టూరు నుంచి డేగరమూడి రోడ్డుకు వెళ్లే సర్వీసు రోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో బిట్రగుంట మల్లేశ్వరరావు అనే ద్విచక్రవాహనదారుడు తీవ్రగాయాలైన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన బిట్రగుంట మల్లేశ్వరరావు ద్విచక్రవాహనంపై మండలంలోని నాగరాజుపల్లిలో శుభకార్యక్రమానికి వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన మల్లేశ్వ రరావును 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమా దానికి కారణమయిన మరో ద్విచక్రవాహనదారుడు వాహనంతో పాటు పరారయ్యాడు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్నం భోజనం వండి పెట్టే కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇచ్చి ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఎమ్మార్పీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవో-1 గంగాధరరావు, ఎంఈవో -2 బి. సుధాకరరావుకు కార్మికులు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యునియన్ సభ్యులు ఆర్.కోటేశ్వరమ్మ, పి.భవాని, గోవిందమ్మ, పద్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు ఎంపీడీవోగా శ్రీదేవి

ఇంకొల్లు, ఫిబ్రవరి 3: ఇంకొల్లు ఎంపీడీవో శ్రీదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గుంటూరు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు.

రెవెన్యూ సిబ్బంది నిరసన

ఇంకొల్లు, ఫిబ్రవరి 3: విశాఖపట్టణంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రమణయ్య హత్యకు గురికావడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీటీ స్వర్ణగీత, లక్ష్మీకుమారి, పుష్పలత, వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

చినగంజాం, ఫిబ్రవరి 3: చినగంజాం ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అపరాధ రుసుం చెల్లించకుండా ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను జిల్లా మైనింగ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. చినగంజాం గ్రామ అధికారి బి.దానియేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సర్వే నెంబర్లు 828, 829 గల భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ అధికారి రాజేష్‌కుమార్ సీజ్‌చేసి చినగంజాం పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

మండంలోని అధికార పార్టీ చెందిన నాయకుడు సర్వే నెంబర్లు 828, 829లోని ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక క్వారీలను నిర్వహిస్తున్నారు. ఇసుక క్వారీల్లో ఎంతమేరకు ఇసుక తీసింది అధికారులు కొలతలు వేసినట్లు తెలుస్తుంది. ఎక్స్‌కవేటర్ డ్రైవర్ పారిపోవడంతో దానిని లారీపై తీసుకొచ్చి పోలీసుస్టేషన్‌లో ఉంచారు. మైనింగ్ అధికారులు వివరాలు చెప్పటానికి నిరాకరించారు.





రథంలో కొలువుదీరిన ఉత్సవర్లు



భక్తజనం నడుమ సాగుతున్న జగన్నాథుడి రథం

హరేరామ.. హరేకృష్ణ!

నెల్లూరులో వైభవంగా జగన్నాథ రథయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం) : హరేకృష్ణ హరేకృష్ణ.. హరేరామ హరేరామ.. రామ రామ కృష్ణ కృష్ణ అంటూ భక్తుల నామస్మరణలతో నెల్లూరు నగరం మారుమోగింది. శనివారం సాయంత్రం ఇస్కాన్ 11వ జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. ఈ రథయాత్ర తిలకించేందుకు భక్తులు తరలిరాగా, ఇతర రాష్ట్రాల నుంచి ఇస్కాన్ భక్తులూ పాల్గొన్నారు. రథం తిరిగిన వీధుల్లో ఆధ్యాత్మికత, భక్తిపారవశ్యం ఉప్పొంగింది. తొలుత సంతపేటలోని నాలుగుకాళ్ల మండపం వద్ద రథానికి గుమ్మడికాయతో దిష్టితీసి ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుకదేవ స్వామి రథయాత్రను ప్రారంభించారు. అంతకుముందు జరిగిన ఆధ్యాత్మిక సభలో శ్రీప్రభుపాద జీవిత చరిత్ర గ్రంథం, గుడ్డ సంచులను ఆవిష్కరించారు. అనంతరం రథంలో కొలువుదీరిన శ్రీకృష్ణ బలరామ సుభద్ర విగ్రహాలకు విశేష పూజలు, హారతులు ఇచ్చారు. సంతపేట, ఏసీబొమ్మ సెంటర్, ట్రంకు రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, ముత్తుకూరు గేట్, మినీబైపాస్‌రోడ్డు, అన్నమయ్య సర్కిల్, పీవీఆర్ కల్యాణ మండపం వరకు ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసశ్యామ్ (హోసూరు), మహాసింగ్‌దాసా (కూకట్‌పల్లి), చక్రధర్‌ద దాస్ (విజయవాడ), గోపీనాథ్ దాస్ (పెరంబూర్), రూపేష్ చైతన్యదాస్ (తిరుపతి), వైష్ణవదాస్ (కర్నూలు), కీర్తిరాజ్‌దాస్ (చీరాల), కరుణసింధు దాస్ (ఝాన్సీ) తదితరులు పాల్గొన్నారు.



పులిహోర ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న మహిళలు

'ఆసరా'లో ఆకలి కేకలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 3: 'ఆసరా' పేరుతో ఆర్భాటపు ప్రచారం చేస్తున్న పాలకులు కనీసం కార్యక్రమంలో పాల్గొన్న అక్కా చెల్లెమ్మలకు ఆకలి తీర్చలేకపోతున్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఉదయగిరి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలోనే పొదుపు మహిళలు ఆకలి కేకలు వేస్తూ ఇళ్లకు వెళ్లిపోయారు. సమావేశం ఆలస్యంగా ప్రారంభమైనా నాయకులు ఊకదంపుడు ప్రసంగాలు చేస్తూ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగించారు. అప్పటికే విసిగిపోయిన మహిళలు సిద్ధమయ్యారు. భోజనాలు వస్తున్నాయని నాయకులు, అధికారులు పదే పదే మైకుల్లో చెప్పి నిలిపివేశారు. కాసేపటికి భోజనాలు తెచ్చినా ఏర్పాట్లు సరిగ్గాలేక తోపులాట చోటు చేసుకుంది. తెచ్చిన పులిహోర ప్యాకెట్లు కూడా చాలకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు ఇళ్ల వెళ్లిపోయారు. మరోవైపు ఈ కార్యక్రమానికి అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది.



ఖోఖో విజేతలకు బహుమతులు ఇస్తున్న మంత్రి కాకాణి, తదితరులు

ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా'!


● జిల్లా విజేతలకు బహుమతుల పంపిణీ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 3 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో ఆత్మకూరు ప్రథమస్థానం, సర్వేపల్లి ద్వితీయ, నెల్లూరు రూరల్ తృతీయ స్థానాలు సాధించాయి. మహిళల విభాగంలో నెల్లూరు రూరల్, కావలి, కందుకూరు వరుస స్థానాలు సాధించాయి. ఇక క్రికెట్ పురుషుల విభాగంలో కోవూరు, ఉదయగిరి, సర్వేపల్లి జట్లు, మహిళల విభాగంలో సర్వేపల్లి, కావలి, కోవూరు వరుస స్థానాలను దక్కించుకున్నాయి. ఖోఖో పురుషుల విభాగంలో కోవూరు, నెల్లూరు రూరల్, కావలి జట్లు, మహిళల విభాగంలో నెల్లూరు రూరల్, కందుకూరు, కావలి, కబడ్డీ పురుషుల విభాగంలో కోవూరు, కందుకూరు, ఆత్మకూరు, మహిళల విభాగంలో కందుకూరు, కోవూరు, కావలి జట్లు వరుసగా మూడుస్థానాలు దక్కించుకున్నాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో కోవూరు, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ జట్లు, మహిళల విభాగంలో కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్ జట్లు గెలుపొందాయి. విజేతలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ బహుమతులు అందచేశారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ జిల్లాస్థాయి లో రాణించిన క్రీడాకారులందరూ విశాఖలో ఈ నెల 9 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని సూచించారు. అలా గే జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారులు కె.తులసి (వెయిట్ లిఫ్టర్), సురేష్, మహేష్‌బాబు (కబడ్డీ), ప్రకాష్(ఫుట్‌బాల్), లక్ష్మీ నారాయణ (ఖోఖో)లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, కమి షనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఎస్ డీఓ ఆర్‌కె. యతిరాజ్, అదనపు కమిషనర్ శర్మద, ఆర్డీఓ మలోల, డీఎస్‌ఏ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కావలి టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి

● ఖరారు చేసిన అధిష్ఠానం

నెల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా దగు మాటి వెంకటకృష్ణారెడ్డి అలియాస్ కావ్య కృష్ణారెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ స్థానం కోసం పలువురు నాయకులు పోటీపడినా చివరికి అభ్యర్థిత్వం వెంకట కృష్ణారెడ్డినే వరించింది. 2004 నుంచి టీడీపీలో కొనసాగుతున్న కృష్ణారెడ్డి గత ఎన్నికల్లో టికెట్టు ఆశించినా దక్కలేదు. దీంతో ఆయన కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. గత ఏడాది మహానాడు సందర్భంగా ఆయన మళ్లీ టీడీపీకి దగ్గరయ్యారు. యువగళం పాదయాత్రలోనూ చురుగ్గా పాల్గొన్న ఆయన కావలి టికెట్టు ఆశిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. అయితే, ఆశావహులు ఎక్కువవడంతో పార్టీ పెద్దలు లోతుగా అధ్యయనం చేశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడిని పలుసార్లు పిలిపిం చుకొని మాట్లాడారు. అలాగే ఆశావహుల్లో ఒక్కరైన పసుపులేటి సుధాకర్‌ను రెండు రోజుల క్రితం పిలిపించుకొని కావలి టికెట్టు కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపారు. మాలేపాటి సోదరులతోనూ నేడో, రేపో చర్చించే అవకాశం ఉంది. ఇక అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందిన వెంటనే ప్రజల్లోకి వెళ్లడానికి కృష్ణారెడ్డి అన్ని ఏర్పాట్లు చేసుకొంటున్నారు.



పిల్లోడు కాదు.. పిడుగు!

ఆదివారం ప్రత్యేకం

పిన్నవయసులోనే బుల్లి, వెండితెర కెక్కిన గడుగ్గాయ్

ఎంతోమంది ప్రశంసలు.. ఇంటినిండా అవార్డులే!

'లేదని ధైర్యమా.. రానని నమ్మకమా.. నేనెక్కడున్నా నా అనుకున్నవాళ్ళు ఇక్కడుంటారు.' ఇది లెజెండ్ సినిమాలో బాలయ్య డైలాగ్. ఈ డైలాగ్ సినిమానే ఓ ఊపు ఊపేసింది. ఇదే డైలాగ్ వెంకటేష్ కళారంగం ఆరంగేట్రానికి తోడ్పడింది. ఇంతకీ ఎవరీ వెంకటేష్ అనుకుంటున్నారు. ఇప్పుడీ బుడతడి పేరు కళారంగం వెంకీగా మారిపోయింది. తాను అనుకున్నది సాధించి, ప్రముఖులు, పెద్ద పెద్ద స్టార్‌లతో నటించి, వారినుంచి మన్ననలు సంపాదించి ఎన్నో సన్మానాలు, సత్కారాలు, అవార్డులు అందుకున్నాడు. అలాంటి బుడతడు గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



మనుబోలు, ఫిబ్రవరి 3 : మనుబోలు మండలం మడమనూరు గ్రామానికి చెందిన ఉప్పు చెంచయ్య, చంద్రిక దంపతులకు చందన, వెంకటేష్ పిల్లలు ఉన్నారు. డ్రైవర్‌గా పని చేస్తూ చెంచయ్య కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వెంకటేష్ 5వ తరగతిలో ఉన్నప్పుడు అంటే 2019లో చెంచయ్య ఉన్న రేకుల ఇంట్లోకి జెముడు కాకి దూరింది. దీంతో ఇల్లు మూతవేసి నెల్లూరుకు వెళ్లిపోయారు. వెంకటేష్‌కు నటన, డ్యాన్స్ మీద ఆసక్తి ఉండటంతో నెల్లూరులోని డీజే డ్యాన్స్ అకాడమీలో చేర్చారు. అకాడమీలో డ్యాన్స్, ఇంట్లో తల్లి చంద్రిక అభినయంలో వెంకటేష్‌కు ఓనమాలు నేర్పింది. ఇటు నటన, అటు డ్యాన్స్‌తో బాగా ప్రావీణ్యం సంపాదించాడు. ఆటో నడుపుకుంటూ, పండ్ల వ్యాపారం చేస్తున్న చెంచయ్య తన కుమారుడికి షూటింగ్ అవకాశాలు వస్తుండటంతో 2022లో హైదరాబాద్ వలస వెళ్లాడు. అయితే, పెరిగిపోతున్న ఖర్చులను భరించలేక 2023లో తిరిగి తమ స్వగ్రామమైన మడమనూరుకు వచ్చేశారు.

● చదువుతో పాటు షూటింగ్‌లు

5వ తరగతిలో ఉన్నప్పుడు వెంకటేష్ డ్యాన్స్ అకాడమీలో చేరి శిక్షణ పొందారు. జీ తెలుగు చానల్ డ్రామా జూనియర్స్ ప్రోగ్రాం ఆడిషన్స్ కోసం వెంకటేష్‌ను వెంటబెట్టుకుని చెంచయ్య తిరుపతి వెళ్లాడు. అక్కడ నుంచి మరోమారు హైదరాబాదులో జరిగిన ఆడిషన్స్‌కి వెళ్లారు. ఆడిషన్స్‌లో నెగ్గిన తరువాత టీవీ చానళ్లలో ఈవెంట్లు, ప్రోగ్రామ్స్‌ను వెంకటేష్ చేసేవారు. షూటింగ్ సమయంలో బడికి డుమ్మా కొట్టే ఈ బుడతడు షూటింగ్ ముగియగానే ఆన్‌లైన్ క్లాసుల ద్వారా నేర్చుకునేవాడు. డ్రామా జూనియర్స్‌లో వెంకటేష్ నటనను తేజ చూసి ముగ్ధుడయ్యాడు. దీంతో తాను నటించిన 'హనుమాన్' చిత్రంలో ఓ పాత్రలో నటించేందుకు అవకాశం కల్పించినట్లు వెంకటేష్ తెలిపారు. బాగా చదువుకొని హీరో కావాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

● చేసిన ప్రోగ్రామ్స్

ఈటీవీలో జాతిరత్నాలు, జబర్దస్త్‌లో ఆది స్క్రిప్ట్‌లతో పాటు జీ తెలుగు చానల్‌లో డ్రామా జూనియర్స్, రామచక్కని సీత సీరియల్‌తోపాటు మాయాద్వీపంలో నటించాడు. ఈటీవీలో కార్తీక పౌర్ణమి ఈవెంట్, నెల్లూరు నెరజాణ సినిమాలో నటించారు. ఇటీవల బంపర్ హిట్ అయిన 'హనుమాన్' సినిమాలో వెన్నెల కిశోర్ క్యారెక్టర్ చేసి, మన్ననలు పొందుతున్నాడు. అలాగే సినీ హీరోయిన్ శ్రేయ తీస్తున్న మ్యూజికల్ మూవీలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తున్నాడు. ఈవెంట్, ప్రోగ్రాం, స్క్రిప్ట్ ఎందులోనైనా వెంకటేష్ తన ప్రతిభను చాటుతూ సన్మానాలు, సత్కారాలు అందుకున్నాడు. ఇటీవల మనుబోలు, సర్వేపల్లి ప్రాంతాలలో జరిగిన పలు ప్రాంతాలలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నుంచి సన్మానం అందుకున్నాడు.

వాడి ఆశయం కోసం పోరాడుతా



మాది పేద కుటుంబం. డ్రైవింగ్ పని, పండ్ల వ్యాపారం చేసుకుంటూ రేకుల ఇంట్లో ఉంటున్నాం. వెంకటేష్ కోసం ఐదేళ్లుగా రూ.లక్షల్లో ఖర్చు చేశాను. వాడి ఆశయం కోసం ఎంతవరకైనా పోరాడతా. కష్టపడి మా అబ్బాయిని ఒకస్థాయికి తీసుకువస్తా.

- చెంచయ్య, వెంకటేష్ తండ్రి

మేయర్ వర్సెస్ కమిషనర్

● ఫాగింగ్ డెమో వేదికగా బయటపడ్డ విభేదాలు

నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పోట్లూరి స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్‌ల మధ్య అంతర్గత విభేదాలు వెలుగుచూస్తున్నాయి. కార్పొరేషన్ కార్యాలయంలో ఇరువురి పేషీల మధ్య దూరం పెరుగుతోంది. సమీక్షలు, సమావేశాలు, పర్యటనలు, ప్రారంభోత్సవాలలో ఆచితూచి వ్యవహరిస్తున్న కమిషనర్ తన వద్దకు వస్తున్న అనేక రాజకీయ ఫైళ్లను సైతం తిరస్కరిస్తున్నారు. ప్రజా సమస్యలు, నగరాభివృద్ధిపై మౌనం వహిస్తున్న మేయర్ కేవలం రాజకీయ సభలు, సమావేశాలకే పరిమితమవుతుందన్న విమర్శలు మూటగట్టుకుంటోంది. తాజాగా కార్పొరేషన్ కార్యాలయంలో ఫాగింగ్ యంత్రాల డెమో వేదికగా ఇరువురి మధ్య విభేదాలు ఉన్నట్లు బహిర్గతమైంది.





నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 3 : నెల్లూరులో దోమల నివారణకు కమిషనర్ వికాస్‌మర్మత్ ఫాగింగ్ యంత్రాలను ఇటీవల కొనుగోలు చేశారు. ఇవి ఎలా పని చేస్తాయన్నది ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం డెమో ఇచ్చారు. వాటిని పరిశీలించిన కమిషనర్ వెంటనే వాటిని వినియోగించాలని ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈ విషయం తమకు సమాచారం ఇవ్వలేదని గ్రహించిన మేయర్ స్రవంతి పోటీగా శనివారం మరోసారి తనదైన శైలిలో ఫాగింగ్ యంత్రాల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. దీంతో ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసిన కమిషనర్ ఇంజనీరింగ్ అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ పరిశీలన అయ్యే వరకు ఆయన కమాండ్ కంట్రోల్ భవనంలోనే ఉండిపోయారు. ఆమె వెళ్లిపోయాక బయటకు వచ్చిన కమిషనర్ అక్కడే మరో కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఫాగింగ్ యంత్రాలను తమకు తెలియకుండా ఎలా ప్రారంభిస్తారని, వాటిని తన అనుమతి లేకుండా ఆరోగ్య విభాగానికి ఎలా అప్పగిస్తా రంటూ ఎస్ఈ సంపత్‌కుమార్‌పై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలా మేయర్, కమిష నర్‌ల మధ్య విభేదాలు క్రమేణా వెలుగు చూస్తున్నాయి. ఇద్దరి చాంబర్ల ఆధునికీకరణ, నగరంలో పర్యటన వివరాలు మీడియాకు తెలియజేయడం ఇలా అంశాలపై వారి మధ్య పొసగడం లేదని కార్యాలయ ఉద్యోగులు గుసగుస పోతున్నారు.

జిల్లాలో తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు (హరనాథపురం): సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు కేటాయిస్తూ కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మండలం	తహసీల్దారు
నెల్లూరు నగరం	బి.వెంకటేశ్వర్లు
నెల్లూరు రూరల్	జీవీ.సుబ్బారెడ్డి
కోవూరు	జి.విజయశ్రీ
బుచ్చిరెడ్డిపాళెం	పి. సురేష్‌బాబు
ఇందుకూరుపేట	పి.సునీత
టీపీ గూడూరు	కె.మాధవరెడ్డి
ముత్తుకూరు	ఎల్.బాలకృష్ణ
వెంకటాచలం	ఎం.పూర్ణచంద్రరావు
మనుబోలు	కె. చిరంజీవి
పొదలకూరు	వీరవసంతరావు
రాపూరు	బి.వెంకటస్వామి
సైదాపురం	టి. ప్రవీణ్‌కుమార్
ఆత్మకూరు	ఎస్.శివనాగిరెడ్డి
చేజర	కె.గోపికృష్ణ
ఏఎస్‌పేట	కె.రవికుమార్
మర్రిపాడు	పి.సీతారత్నం
సంగం	బి.రమాదేవి
అనంతసాగరం	పి.నరసింహారావు
ఉదయగిరి	కె. నెహ్రూబాబు
సీతారాంపురం	ఎవీ కృష్ణారెడ్డి
కలువాయి	సీహెచ్ శ్రీనివాసరావు
కావలి	కె.నగేష్
బోగోలు	ఎం. క్షమారాణి
అల్లూరు	ఎస్. దుర్గేశ్వరరావు
దగదర్తి	పి. జాన్‌పీటర్
జలదంకి	ఎస్. వాసు
కలిగిరి	బాలకిషోర్
దుత్తలూరు	ఎస్. వెంకటరత్నం
కొడవలూరు	పిశైలేంద్రకుమార్
విడవలూరు	ఎస్‌కే ఇస్మాయిల్
వింజమూరు	ఎంపీ కృష్ణారెడ్డి
కందుకూరు	పి.కృష్ణకాంత్
గుడ్లూరు	ఏవీ రమణ
లింగసముద్రం	జి. శ్రీచరణ్
ఉలవపాడు	కె. రవిబాబు
వలేటివారిపాలెం	ఎస్. నాగమల్లేశ్వరరావు
కొండాపురం	డి. శ్రావణ్‌కుమార్
వరికుంటపాడు	ఏవీపీ చంద్రారెడ్డి
నెల్లూరు డీఏఓ	కె. సంజీవరావు
ఎల్పీఏ స్పెషల్ తహసీల్దారు	బి.సుశీల
కలెక్టరేట్ స్పెషల్ తహసిల్దార్ (ఎల్ఆర్)	ఎం.రాజ్యలక్ష్మి
కలెక్టరేట్ తహసిల్దార్ నెల్లూరు-(కోఆర్డినేషన్)	పి. సుబ్రహ్మణ్యం

ఇంటర్ ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం

● రేపటి నుంచి సీసీ కెమెరాల నీడలో నిర్వహణ

● ఫిర్యాదులపై కఠిన చర్యలు : ఆర్ఐవో

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 3 : ఇంటర్మీడియట్ ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు చేశామని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 20వతేదీ వరకు మూడు దశల్లో ఒకేషనల్, 11 నుంచి 20వతేదీ వరకు జనరల్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 1954 మందికి 25 కేంద్రాల్లో, జనరల్ సైన్స్‌లో 19,389 మంది పరీక్షలకు హాజరవుతున్నారని అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరా లను ఏర్పాటు చేశామని, వీటిని ఇంటర్‌బోర్డు అధికారులు నిత్యం పరిశీలిస్తుంటారని చెప్పారు.

● నిర్వహణకు డీఈసీ కమిటీ

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)ని నియమిస్తూ ఇంటర్‌బోర్డు కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆర్ఐఓ కన్వీనర్‌గా, సభ్యులుగా ప్రిన్సిపాళ్లు బిడి.దీనదయాళ్, పి.వేణుగోపాల్, అధ్యాపకులు కె.కొండయ్య ఉంటారని అన్నారు. అలాగే ప్రత్యేక అధికారిగా డీవీఈఓ కె.మధు బాబు, ఒకేషనల్ కోర్సుల పర్యవేక్షకులుగా అధ్యాపకులు డి.ఆదినారాయణ, జిల్లా స్ట్రాంగ్‌రూమ్ ఇన్చార్జిగా ఫిజికల్ డైరెక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి నియమితులైనట్లు తెలి పారు. 400 మంది ఎగ్జామినర్లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీ, డీఈసీ సభ్యులను నియమించామన్నారు. పరీక్షలు జరిగే కళాశాలల్లోని ల్యాబ్‌లను ఇప్పటికే పరిశీలించినట్లు తెలిపారు.

● సీసీ కెమెరాల నిఘా

ఎన్నడూ జరగని రీతిలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేలా సన్నాహాలు చేశామని, కార్పొరేట్‌లకు కళ్లెం వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆర్ఐవో తెలిపారు. అవకతవకలు జరిగినా, ల్యాబ్‌ల నిర్వహణ సరిగా లేకున్నా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పరీక్షల పేరుతో కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు స్పష్టం చేశారు. అలాగే ఈ ఏడాది పరీక్ష పూర్తయిన వెంటనే ఎప్పటికప్పుడు మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. కాగా, శనివారం) నిర్వహించాల్సిన పర్యావరణ విద్య పరీక్షను కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు, తదితరులు

జిల్లావ్యాప్తంగా రెవెన్యూ వర్గాల నిరసన

కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

తహసీల్దారు హత్యపై గరం గరం



నెల్లూరు : తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నెల్లూరు (హరనాథపురం); ఫిబ్రవరి 3 : భూ వివాదాల కారణంగా విశాఖలో తహసీల్దారు రమణయ్యను హత్య చేయడాన్ని ఖండిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరులోని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి డానియర్ పీటర్‌రావు తదితరులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెంచలరెడ్డి మాట్లాడుతూ తహసీల్దారు రమణయ్య హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అధిక భూ వివాదాలు ఉన్న మండలాల్లో తహసీల్దార్లకు ప్రత్యేక రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని మండలాల తహసీల్దారు కార్యాలయాలతోపాటు కలెక్టరేట్ వద్ద కూడా ఉద్యోగులు ఆందోళన చేశారు.



వెంకటాచలం తహసీల్దారు కార్యాలయం ఎదుట...



కలెక్టరేట్‌లో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

పాఠశాలలో వసతులు లేక విద్యార్థుల అవస్థలు

● అర్ధంతరంగా నిలిచిన నాడు-నేడు పనులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 3: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగిస్తున్నామని గొప్పలు చెప్పే ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. రూ. కోట్లల్లో నిధులు వెచ్చిస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం ఆశించిన మేర ఫలితాలు సాధించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు నిదర్శనమే మండలంలోని భోగ్యంవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏళ్ల తరబడి ముందుకు సాగక నిలచిన నాడు-నేడు పనులు. ఆ పాఠశాలకు 2021-22 విద్యా సంవత్సరంలో రెండో విడత పథకం కింద రూ. 18లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రహరీ, టైల్స్, మరుగుదొడ్డి, విద్యుత్, ఇతరత్రా మరమ్మతు పనులతో పాటు తాగునీటి బోరు ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించాల్సి ఉంది. అయితే అప్పటి నుంచి అధికారుల అలసత్వమో లేక రాజకీయ గ్రహణమో ఏమోగానీ పనులకు మాత్రం అవరోధాలు ఏర్పడడంతో ప్రతినిత్యం విద్యార్థులు సమస్యల వలయంలోనే చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

విద్యార్థులకు తిప్పలే: సమస్యలు పరిష్కరించే నాథులే కనిపించక పోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. దాహం తీర్చుకొనేందుకు వాటర్‌ప్లాంట్ల


ప్రహరీకి నోచుకోని భోగ్యంవారిపల్లి ప్రాథమిక పాఠశాల

నుంచి కొనుగోలు చేయక తప్పడం లేదు. ప్రాంగణంలోని చేతిపంపు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. పూర్తి స్థాయిలో ప్రహరీ కూడా లేకపోవడంతో పశువులు, మూగజీవాలు ప్రాంగణాన్ని అపరిశుభ్రం చేస్తుండడంతో శుభ్రం చేసుకోవడం విద్యార్థుల వంతైంది. అంతేగాక దుమ్మూ, ధూళితో నిండిపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. కనీసం నేలపై కూర్చునేందుకు అనుకూలంగా లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో నాడు-నేడు పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి వంచన : బొల్లినేని

వింజమూరు, ఫిబ్రవరి 3: తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రానికి కంపెనీలు తీసుకొస్తే జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి గంజాయిని తీసుకొచ్చి యువత భవిష్యత్తును అంధకారం చేశా దని, డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను వంచించడానికి సిద్ధమయ్యాడని మాజీ ఎమ్మెల్యే, తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జ్ బొల్లినేని వెంకట రామారావు విమర్శించారు. శనివారం వింజమూరులోని అరుంధతివాడ వడ్డిపాలెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ ప్రజాదీవెన యాత్రలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన రూపొందించిన ఉమ్మడి మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. 50892 ఖాళీలు ఉంటే 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మరోసారి వంచించడానికి జగన్మోహన్‌రెడ్డి సిద్ధమయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెమూర మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి, యారవ కృష్ణయ్య, చల్లా వెంకటేశ్వర్లు, నర్సారెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, బాషా, మాల్యాద్రి, సుధాకర్‌రెడ్డి, హజరత్, అంకయ్య, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బొల్లినేని

మృతుడి కుటుంబానికి పరామర్శ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో కుంకు వెంకటయ్య కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో శనివారం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు టీడీపీ నాయకులతో కలిసి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నర్రవాడ మాజీ సర్పంచ్ మల్లంపాటి గురవయ్యనాయుడు, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, నాయకులు కాకర్ల మధుసూదన్‌రెడ్డి, కంభం సుబ్బారెడ్డి, సుబ్బారావు తదితరులున్నారు.

పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: భారతీయ జనతాపార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గావ్ చలో (పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, రూరల్ అధ్యక్షుడు వాసిపల్లి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న గావ్ చలో కార్యక్రమ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ ఉప్పలూరు నరసింహులునాయుడు, సీనియర్ నాయకుడు గున్నం నారసింహారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొలగాని కల్యాణచక్రవర్తి, ఉపాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసులనాయుడు, పట్టణ కార్యదర్శి సున్నా సంతోష్‌కుమార్, ఆళ్ల మధుసూదన్‌రావు, ఓబుల్‌రెడ్డి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

కలువాయి, ఫిబ్రవరి 3: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక శివసాయి కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై రోడ్డు రవాణా, పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఆర్టీవో రాములు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం అన్నారు. కలువాయి ఎస్‌ఐ అయ్యప్ప మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు భయపడకుండా బాధితులను ఆసుపత్రికి తీసుకువెళ్లి కాపాడాలని కోరారు. రహదారి భద్రత, మోటారు వాహనాల చట్టం నిబంధనలు పాటించడం అందరి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 3: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈవో-2 టీ శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని బీసీకాలనీ తెలుగు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. సులభ రీతిలో విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో

రూ.5 కోట్లతో గౌతమ్‌రెడ్డి స్మృతివనం : మేకపాటి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 3: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల వ్యయంతో దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి స్మృతివనం ఏర్పాటు చేయనున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ కళాశాలతోపాటు స్మృతివనం ఏర్పాటుచేసే ప్రాంతాన్ని కళాశాల యాజమాన్యం, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో కళాశాలను యూనివర్శిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ టీ గోపికృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కనిపించని సచివాలయ ఉద్యోగులు

● స్పందన తీరుపై విమర్శలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 3: సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ప్రగల్భాలు పలికే ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. అధికారులు సైతం పదే పదే హెచ్చరిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వారి మాటలు పట్టించుకొనే ఉద్యోగులే కరువయ్యారు. శనివారం రామాపురం సచివాలయంలో అలాంటి సంఘటనే చోటు చేసుకోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సచివాలయ పరిధిలో వివిధ శాఖలకు చెందిన పది మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా అంతంత మాత్రంగానే విధులకు హాజరవుతుండడం గమనార్హం. ప్రతి ఉద్యోగి మధ్యాహ్నం వరకు ఫీల్డ్ పేరుతో హాజరుకాకపోయినప్పటికీ మూడు నుంచి ఐదు గంటల వరకు తప్పనిసరిగా సచివాలయంలోనే ఉంటూ స్పందన కార్యక్రమం నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ అక్కడి ఉద్యోగులునిర్లక్ష్య వైఖరితో అటువైపు కన్నెత్తి చూడనే లేదు. ఆ సమయంలో కేవలం పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు మాత్రమే విధుల్లో ఉండడం చూస్తుంటే ఆ సచివాలయ పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. దీంతో పలు శాఖల ఉద్యోగుల కోసం అక్కడికి పరుగులు తీసిన ప్రజలకు నిరాశే మిగిలింది. సరైన సమాచారం తెలియకపోవడంతో చేసేదేమి లేక మౌనంగానే వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆత్మకూరు జట్టు ఎంపిక


మంత్రి కాకాణి చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు చెక్కును అందుకుంటున్న క్రీడాకారులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ఆత్మకూరుకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడా కారులు సత్తా చాటారు. శనివారం జిల్లా స్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సచివాలయం పరిధిలోని క్రీడాకారులు కె అశోక్, సీహెచ్ కార్తికేయులు సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు జట్టు పై విజయం సాధించి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రోత్సాహక నగదు చెక్కును అందచేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఆత్మకూరుకు మంచి పేరు తేవాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పలువురు అధికారులు ఆకాంక్షించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: పట్టణంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి రూ. 10వేల వంతున సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి శనివారం అందజేశారు. 22వ వార్డులోని వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న యాకసిరి పోలమ్మ, 5వ వార్డులో షేక్ నజీర్, 10వ వార్డులోని చాకలవీధికి చెందిన కామేల్లి శ్రీరాములు, 16వ వార్డులో షేక్ సారంబి, 19వ వార్డులో షేక్ మీరాంబి కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమా ల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు త్రివేణి, కొండా స్వరూపరాణి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనంతోనే అభివృద్ధి సాధ్యం

అనంతసాగరం, జనవరి 3: ఆత్మకూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం రామనారాయణరెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని అనంతసాగరం టీడీపీ సీనియర్ నాయకుడు పాతపాటి మదుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ త్వరలో జరిగే ఆసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఆనం సారధ్యంలో టీడీపీ విజయం తథ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చేలా మండలంలోని టీడీపీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కోరారు.

బావి స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

వింజమూరు, ఫిబ్రవరి 3: స్థానిక పాతూరులో ఉన్న పలుకూరు బావి ప్రాంతాన్ని పంచాయతీ స్వాధీన పరుచుకున్నట్లు సర్పంచ్ ఎస్ సుజనా తెలిపారు. ఈ స్థలం వల్ల పంచాయతీకి ఆదాయాన్ని తీసుకొచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామని, చిల్డ్రన్స్‌పార్కు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎవరైనా ఆక్రమించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత పనుల ప్రారంభం

వింజమూరు, ఫిబ్రవరి 3 : మండలంలోని శంకవరం గ్రామంలో మురుగు కాలువల పూడికతీత పనులను సర్పంచ్ బి మల్లేశ్వరి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది చేపట్టారు. ఈ కార్యక్రమంలో బోగిరెడ్డి వెంకటరమణారెడ్డి, నాగిరెడ్డి, సానా గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కంకరతో వాహనదారుల అవస్థలు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 3: పట్టణంలోని ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ కంకర ఉండడం తో వాహనదారులు కష్టాలు ఎదు ర్కొంటున్నారు. కంకర రవాణా చేసే టిప్పర్లు, ట్రాక్టర్లు పరిమితికి మించి తరలిస్తూ తమ ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతుండడంతో అం దులో ఉన్న కంకర రహదారులపై పడి ప్రమాదాలకు దారితీస్తోంది. రోడ్లపై కంకరను అలాగే వదిలేస్తుండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకర రవాణా చేసే వాహనదారులను హెచ్చరించి రహదా రులపై కంకర పడకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వీఆర్వోకు సన్మానం


వీఆర్వోకు సన్మానం చేస్తున్న కార్యాలయ సిబ్బంది

సంగం, ఫిబ్రవరి 3: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సంగం వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళ్తున్న రవిబాబును శనివారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, రీసర్వే డీటీ అశోక్ కుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కందుకూరు, ఫిబ్రవరి 3: తెలుగుదేశం పార్టీ గెలుపు ద్వారా చంద్రబాబును సీఎం చేయటమే లక్ష్యంగా వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు కోరారు. శనివారం సాయంత్రం కందుకూరులోని పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలతో వారు సమావేశం నిర్వహించారు. తొలుత ఒక్కొక్కరిని పిలిచి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆనంద్‌బాబు, అశోక్‌బాబులు నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌తో ప్రత్యేకంగా మాట్లాడి వెళ్లారు. ఈ సమావేశంలో నాయకులు ఇంటూరి నాగేశ్వరరావు, దివిశివరాం, కుసుమకుమారి, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, నార్నె రోశయ్య పాల్గొన్నారు.

● కుట్టుమిషన్ల పంపిణీ : టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో రెండో బ్యాచ్ శిక్షణ పూర్తిచేసుకున్న 60మంది మహిళలకు సర్టిఫికెట్లతో పాటు ఉచితంగా కుట్టుమిషన్లను నక్కా ఆనంద్‌బాబు, అశోక్‌బాబు అందించారు.


మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

హెల్మెట్ ధారణతో ప్రమాదాల నివారణ

కందుకూరు, ఫిబ్రవరి 3: రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించడంతోపాటు ఐఎస్‌ఐ మార్కు కలిగిన హెల్మెట్‌లను ధరించడం ద్వారా ప్రమాదాలను, ప్రాణనష్టాన్ని నివారించవచ్చని కావలి ప్రాంతీయ రవాణాశాఖాధికారి వై.సుధాకరరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం కందుకూరులో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపటమే ప్రమాదాలకు కారణ మని పేర్కొన్నారు. కార్యక్రమంలో కందుకూరు ఎంవీఐ ఎస్కే మహమ్మద్ రఫీ, రూరల్ ఎస్‌ఐ పీ నరేష్, ఏఎస్‌ఐ కె. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న సుధాకరరెడ్డి. రఫీ తదితరులు

అద్వానీకి భారతరత్న పట్ల సంబరాలు

కావలి టౌన్, ఫిబ్రవరి 3 : బీజేపీ సీనియర్ నేత ఎల్‌కె అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల శనివారం శివాజీ విగ్రహం వద్ద బీజేపీ నేతలు సంబరాలు నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కందుకూరి సత్యనారాయణ, వీవీ రంగారెడ్డి, సీవీసీ సత్యం, వెంకటేశ్వర్లు, వాయుగండ్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భగా మిఠాయిలు పంచిపెట్టారు.


సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఫిబ్రవరి 3: మండలంలోని మన్నేరువాగులో ఇసుకను అక్రమంగా నింపుకుంటున్న నాలుగు ట్రాక్టర్లను కందుకూరు ఎస్‌ఈబీ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం తెల్లవారుజామున కందుకూరు సెబ్ అధికారులు, సిబ్బందితో దాడి చేసి ఇసుక రవాణాకు సిద్ధంగా ఉన్న నాలుగు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనపై సెబ్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ మహేంద్రనాయక్ చెప్పారు.

లింగసముద్రం ఎస్‌ఐగా మహేంద్రనాయక్

లింగసముద్రం, ఫిబ్రవరి 3: లింగసముద్రం పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా వలేటివారిపాలెం ఎస్‌ఐ మహేంద్రనాయక్‌ను నియమించారు. లింగసముద్రం ఎస్‌ఐ ఎం బాజీబాబు అసెంబ్లీ బందోబస్తుకు వెళ్లారు. ఆయన వచ్చేవరకు మహేంద్రనాయక్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా కొనసాగుతారని గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు శనివారం తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 6,59,561

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 3: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,59,561 ఆదాయం లభించినట్లు ఆలయ ఏసీ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 5,300, కుంకుమార్చన ద్వారా రూ. 22,840, తలనీలాల ద్వారా రూ. 23,450, వాహనపూజల ద్వారా రూ. 2,880, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,41,800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1,020, రూముఅద్దెల ద్వారా రూ. 29,330, కవర్ల ద్వారా రూ. 4,800, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,76,965, అన్నదానం ద్వారా రూ. 2,31,176, విరాళాల ద్వారా రూ. 20 వేలు ఆదాయం లభించిందన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 3 : మండలంలోని రేళ్లపాడు, లింగపాలెం, అమ్మపాలెం, బంగారక్కపాలెం, బండివారిపాలెం గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మధుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్చే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు.

తిప్ప జూనియర్ కాలేజీలో క్లీన్ అండ్ గ్రీన్

చిట్రగుంట, ఫిబ్రవరి 3: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం నాగులవరంలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. సచివాలయం, గ్రామ పరిసర ప్రాంతాల్లోని చెత్త తొలగించి కాల్చివేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో వెంకటసుబ్బయ్య, డిజిటల్ అసిస్టెంట్ మణిరత్నం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


చెత్త ఏరుతున్న విద్యార్థులు

వైభవంగా ప్రసన్నుడి ఊంజల్‌సేవ


ప్రసన్నుడికి నిర్వహించిన ఊంజల్‌సేవ

చిట్రగుంట, ఫిబ్రవరి 3: బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరుడి శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. జలదంకి మండలం వేముల పాడు గ్రామస్థులు అన్నసంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రికి శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరుడికి ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి సభ్యులు తులసీరామ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో జోరుగా మోటార్ల చోరీలు

లింగసముద్రం, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని గ్రామ పొలాల్లో ఉన్న మోటార్లను, కేబుళ్లను దొంగలు తీసుకెళుతున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని పెదపవని, ముత్యాలపాడు, ముత్తంవారిపాలెం గ్రామాల్లో ఇటీవల ఈ తరహా చోరీలు ఎక్కువయ్యాయి. ముత్యాలపాడులో రెండు మోటార్లను, 15 కేబుళ్లను, ముత్తంవారిపాలెంలో 15 కేబుళ్లను, పెదపవనిలో రెండు మోటార్లను, 15 కేబుళ్లను దొంగలు చోరీ చేశారని రైతులు చెప్పారు.ఒక్కో మోటారు విలువ రూ.25 వేలు, ఒక్కో కేబుల్ విలువ సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటుందని చెప్పారు. ఇటీవల ముత్యాల పాడులో ముగ్గురు దొంగలను పోలీసులకు పట్టిచ్చినట్టుగా రైతులు చెప్పారు. కాగా తాము దొంగలను విచారిస్తున్నట్టు ఎస్సై ఎం బాజీబాబు చెప్పారు.

విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యాంప్రసాద్

కావలిటౌన్, ఫిబ్రవరి3: విద్య ద్వారానే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ముసునూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రాధాన్యత, బాల్య వివాహాల్లో తల్లితండ్రుల పాత్ర అనే అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు మొగల్ సిరాజ్‌బేగ్, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ


కుట్టుమిషన్ అందిస్తున్న ప్రసాదరావు, సురేంద్ర

కావలిటౌన్, ఫిబ్రవరి3: అమరా బాలసుబ్రహ్మణ్యం మనవడు నాగనిమేష్ పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం పేదమహిళకు కుట్టుమిషన్ అందించారు. సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీకాంత అనే పేదమహిళకు రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు చేతుల మీదుగా కుట్టుమిషన్ అందించారు. అనంతరం బుడమగుంట గిరిజన కాలనీలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు

● అనుమతులు లేకుండా ఏర్పాటు ● ప్రభుత్వ ఖజానాకు గండి ● పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 3 : మండలంలోని అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, చుండి, కాకర్లవారిపాలెం, పోలినేనిచెరువు, గరుకుపాలెం, పెద్దఅమ్మపాలెం గ్రామాల్లో ఇష్టానుసారం ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన రాయిల్టీకి ఎగనామం పెడుతూ బట్టీలు కొనసాగిస్తున్నారు. చెరువులు, కుంటల నుంచి అనుమతి లేకుండా మట్టి తరలించి ఇటుకలు తయారు చేస్తూ లక్షలు గడిస్తున్నారు. అయినా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

● రాయల్టీ చెల్లించడం లేదు..

ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలంటే ఇటుకలు తయారు చేసిన లెక్కల ప్రకారం పంచాయతీకి రాయల్టీ చెల్లించాలి. లక్ష ఇటుకలు పైన తయారు చేసే బట్టీల నిర్వాహకులు ట్రేడ్, లైసెన్స్ వ్యాపార పన్ను కట్టాల్సి ఉంటుంది. అంతేకాక తయారు చేసిన ఇటుకలు కాల్చేందుకు పొల్యూషన్ అధికారుల నుంచి అనుమతులు పొందాలి. గ్రామ పంచాయతీతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, భూగర్భ, అటవీశాఖ, కార్మికశాఖ అనుమతులు కూడా పొందాల్సి ఉంటుంది. అయితే ఇటుక బట్టీల నిర్వాహకులు అవేమి పట్టించుకోకుండా బట్టీలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాలలో వ్యవసాయ భూములతోపాటు ప్రభుత్వ భూములలో ఇటుక బట్టీలు నిర్వమిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో వ్యవసాయేతర పనులకు వినియోగిస్తున్నందున రెవెన్యూకు 9 శాతం సుంకం చెల్లించాలి. అంతేకాకుండా వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తూ ప్రభుత్వ చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మట్టిని అక్రమంగా తరలించి ఇటుకలు తయారీకి వినియోగించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

● బాల కార్మికులతో పనులు

ఇటుక బట్టీల నిర్వాహకులు ఒడిశా నుంచి కార్మికులను తీసుకువస్తున్నారు. ఇందులో బాల కార్మికులే ఎక్కువగా ఉంటున్నారు. ప్రతి ఇటుక బట్టీ వ్యాపారి వద్ద సుమారు ఐదారుమంది బాలకార్మికులు పని చేస్తుంటారు. అయినా అధికారులు స్పందించడం లేదు. జిల్లా అధికారులు స్పందించి ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


వలేటివారిపాలెంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు

కంపుకొడుతున్న పల్లెలు!

లింగసముద్రం, ఫిబ్రవరి 3 : మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు, కుళాయిల్లో వృథాగా పోయే నీరు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు, అంతర్గత మట్టి రోడ్లపై నిల్వ చేరడంతో పల్లెలు కంపుకొడుతున్నాయి. దీంతో ప్రజలు, దీహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెదపవని, అన్నెబోయినపల్లి, లింగసముద్రం, మొగిలిచెర్ల గ్రామాల్లో మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. అక్కడ దోమల ఉత్పత్తి చెంది రాత్రి వేళల్లో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోన్నాయి. అయినా పంచాయతీ పాలకులు, కార్యదర్శులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.